


www.navabhoomi.in | epaper.navabhoomi.in
RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 10 శనివారం | మే 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 235

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur




# భీకర దాడి

- 36 ప్రాంతాలపై 400 డ్రోన్లతో పాకిస్థాన్ దాడి..
- టర్కీ తయారీ డ్రోన్లను నాశనం చేశాం..
- వివరాలు వెల్లడించిన కర్నల్ సోఫియా ఖురేషీ
- పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సింధూర్
- చేపట్టినందుకు ప్రతీకారంగా పాక్ దాడులు
- పాక్ చొరబాటుదారులు సరిహద్దులు దాటే యత్నం
- కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్న భారత భద్రతాదళాలు

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో
భారత్ పై పాకిస్థాన్ భీకర దాడికి పాల్పడినట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్.. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిన్న రాత్రి భారత్ లోని సియాచిన్(లద్దాక్) నుంచి కచ్(గుజరాత్)వరకు 36 ప్రాంతాల్లో పాకిస్థాన్ దాదాపు 300- 400 డ్రోన్లు ప్రయోగించినట్లు కర్నల్ సోఫియా ఖురేషీ తెలిపారు. ఈ డ్రోన్లకు కెమెరాలు ఫిక్స్ చేసి ఉన్నాయని.. అక్కడి సమాచారాన్ని సేకరించేలా పాక్ ఇలా పన్నాగం పన్నినట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు వివరాలు వెల్లడించారు. అయితే ఈ డ్రోన్లను నాశనం చేసినట్లు పేర్కొన్నాయి. మరోవైపు ప్రాథమిక నివేదిక

## పాక్ కాల్పుల్లో ఆంధ్రా జవాన్
# వీరమరణం..!

- ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొంటున్న మురళీ నాయక్
- పాక్ జరిపిన కాల్పుల్లో మురళీనాయక్ వీరమరణం
- గోరంట్ల మండలం కల్లితాడకు చెందిన జవాన్ మురళీ
- సమాచారం తెలిసిన వెంటనే మురళీ కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

2



శ్రీ సత్యసాయి జిల్లా(పుట్టపర్తి)-నవభూమిబ్యూరో
భారత్-పాకిస్తాన్ మధ్య సరిహ ద్దుల్లో సాగుతున్న పోరులో ఏపీలోని సత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందారు. పాకిస్తాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొంటున్న మురళీ నాయక్ తాజాగా పాక్ జరిపిన కాల్పుల్లో చనిపోయినట్లు తెలుస్తోంది. దీంతో సత్యసాయి జిల్లాలోని ఆయన కుటుంబం విషాదంలో మునిగిపోయింది. జవాన్ మృతిపై సంతాపాలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసిన తెలుగు జవాన్ మురళీనాయక్ త్యాగం మరువలేనిదని హెూంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితాడకు చెందిన జవాన్ మురళీనాయక్ యుద్ధభూమిలో మరణించారన్న వార్త దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. జవాన్ మురళీ నాయక్ మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. అమర జవాన్ మురళీనాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జవాన్ మురళీనాయక్ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలర్పించిన అమర వీరుడు మురళీ నాయిక్ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు,

# ఐపీఎల్‌కు 7 రోజుల బ్రేక్

- ఐపీఎల్‌పై భారత్,పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల ప్రభావం
- ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ అర్ధాంతరంగా ఆపేసిన బీసీసీఐ..
- మెగా టోర్నీని నిరవధికంగా వాయిదా వేసిన బీసీసీఐ త్వరలోనే కొత్త షెడ్యూల్ ప్రకటన..!

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల ప్రభావం ఐపీఎల్ 18వ సీజన్‌పై పడింది. ఆటగాళ్ల భద్రత దృష్ట్యా గురువారం ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ అర్ధాంతరంగా ఆపేసిన బీసీసీఐ.. మెగా టోర్నీని నిరవధికంగా వాయిదా వేసిన విషయం తెలిసిందే. అయితే.. శుక్రవారం మధ్యాహ్నం మరో ప్రకటనలో వారం రోజుల పాటు ఐపీఎల్ మ్యాచ్‌లకు బ్రేక్ ఇస్తున్నట్లు బీసీసీఐ వివరించింది. అనంతరం పరిస్థితులను బట్టి.. ప్రభుత్వ ఆదేశాలను బట్టి లీగ్ కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటామని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వెల్లడించాడు.
ధర్మశాలలో పంజాబ్, ఢిల్లీ మ్యాచ్‌ను రద్దు చేసిన బీసీసీఐ ఆటగాళ్ల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఐపీఎల్‌ను వారం పాటు వాయిదా వేసింది. అప్పటికీ సాధారణ పరిస్థితులు నెలకొనకుంటే ఫ్రాంఛైజీ యజమానులతో మాట్లాడి టోర్నీ నిర్వహణపై ఓ నిర్ణయానికి రానుంది బీసీసీఐ. ప్రస్తుతానికైతే ఐపీఎల్ 18వ సీజన్‌ను వారం రోజులకు వాయిదా వేశాం. బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్, ఐపీఎల్ జట్ల యజమానులతో మాట్లాడాకే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

# కేంద్రానికి బాసట

- తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం!
- నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ప్రజాప్ర తినిధుల ఒక నెల వేతనం
- న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్లో సరిహద్దు రాష్ట్రాలలోని తెలంగాణ వాసుల కోసం కంట్రోల్ రూమ్..హెల్ప్‌లైన్లు
- భారత ఆర్మీ కోసం ఆలయాల్లో పూజలు : మంత్రి సురేఖ

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో
భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న వేళ అన్ని రాష్ట్రాలలోని ప్రభుత్వాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. పలు కీలక నిర్ణయాలు తీసుకుంటూ ఐక్యతను చాటుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం భారత్ పాకిస్తాన్ మధ్య ప్రస్తుతం కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ప్రజాప్రతినిధుల ఒక నెల వేతనం విరాళం పాకిస్థాన్లోని ఉగ్రవాద శిబిరాలపై సైనిక దాడి నేపథ్యంలో నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఒక నెల వేతనం విరాళంగా ఇవ్వాలని

# జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు

- ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జర్నలిస్టులకూ ఇండ్లు మంజూరు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తాజాగా ప్రకటన
- అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు ఇస్తామని.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి అధిక ప్రాధాన్యత
- ప్రెస్ అకాడమి నిర్వహించిన సమావేశంలో మంత్రి పొంగులేటి

2




హైదరాబాద్-నవభూమిబ్యూరో
2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ఆరు గ్యారెంటీలను ప్రకటించింది. ఈ గ్యారెంటీలలో ఒకటి ఇందిరమ్మ ఇళ్ల పథకం. అందులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా సొంత స్థలం ఉండి అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, ఇల్లు లేని పేదలకు స్థలంతో పాటు రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలోకి జర్నలిస్టులు చేరారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జర్నలిస్టులకూ ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తాజాగా ప్రకటించారు. నాంపల్లి ప్రెస్ అకాడమీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు ఇస్తామని.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. మూతబడిన ప్రెస్ అకాడమీని ఈ నెల చివరి నాటికి తిరిగి ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పేదలకే కాకుండా జర్నలిస్టులకూ ఇండ్లు ఇస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నాంపల్లిలోని ప్రెస్ అకాడమీలో నిర్వహించిన సమావేశంలో

# మధ్యవర్తిత్వం వద్దు!

- భారత్-పాక్ దేశాల మధ్య మధ్యవర్తిత్వం వహిస్తానన్న ట్రంప్
- ట్రంప్ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించిన మోదీ
- రెండు దేశాల మధ్య సమస్యలు ద్వైపాక్షికం..
- రెండు దేశాలు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి
- ఈ వ్యవహారంలో 3 పక్షం జోక్యం అనవసరమన్న భారత్

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో
అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తనదైన శైలిలో, ఇరు దేశాల మధ్య మధ్యవర్తిత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. అయితే, ఈ ప్రతిపాదనను భారత్ సున్నితంగా తిరస్కరించిం ది. భారతదేశం స్పష్టంగా తన వైఖరిని తెలియజేసింది: పాకిస్తాన్‌తో ఉన్న సమస్యలు ద్వైపాక్షికమైనవి. వాటిని ఇరు దేశాలు మాత్రమే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. ఈ విషయంలో మూడవ పక్షం జోక్యం అవసరం లేదని భారత్ ఖరాఖండిగా చెప్పింది. భారతదేశం ఎల్లప్పుడూ పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక చర్చలకు సిద్ధంగా ఉంది. అయితే, ఉగ్రవాదం మరియు సరిహద్దు సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరగాలంటే, పాకిస్తాన్ ముందుగా ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం ఆపాలని భారత్ తేల్చి చెప్పింది. భారతదేశం తన సార్వభౌమాధికారానికి అత్యంత ప్రాధాన్యత

# పాక్‌ను విడిచిపెట్టిన డాన్

- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీసిన అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం
- 'ఆపరేషన్ సింధూర్' మొదలు పెట్టగానే దావూద్ ఇబ్రహీం గ్యాంగ్‌లో అలజడి
- అర్ధరాత్రి ఎక్కడికో తరలివెళ్లినట్లుగా ప్రచారం

2



కరాచి-నవభూమిబ్యూరో
భారత్ మెరుపు వేగంతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడుతుంటే, ఆ దెబ్బకు అండర్‌వరల్డ్ సామ్రాజ్యపు చక్రవర్తి సింహాసనం ఒక్కసారిగా ఊగిపోయింది. ముంబై రక్తపు మరకలు ఆరకముందే, భయమనే నీడ అతడి కనుపాపలను కమ్మేసింది. ఎన్నో ఏళ్లుగా కరాచీ అతడి అభేద్యమైన కోట. కానీ ఇప్పుడు, ఆ గోడలు భారత సైన్యం ధాటికి బీటలు వారుతున్న శబ్దం అతడి గుండెల్లో పిడుగులా మోగింది. 'ఆపరేషన్ సింధూర్' వార్తలు పిడుగులా చెవులు చేరగానే, దావూద్ ఇబ్రహీం ముఖంలో భయం స్పష్టంగా కనిపించింది. ఎప్పుడూ గర్వంతో నిండిన కళ్లు ఇప్పుడు ఆందోళనతో వెతుకులాడుతున్నాయి. అతడి చుట్టూ ఉన్న అనుచరులు సైతం వణికిపోతున్నారు. ఎందుకంటే, ఇది కేవలం సరిహద్దుల్లో జరిగే పోరాటం కాదు. ఇది నేరుగా వారి ఆశ్రయాన్ని ప్రశ్నిస్తోంది. చోటా షకీల్ మరియు మున్నా జింగడా వంటి నమ్మకమైన అనుచరులతో రహస్య సమావేశాలు జరిగాయి. క్షణాల్లో కారు శబ్దాలు వినిపించాయి. రాత్రి చీకటిలో, కాన్వాయ్ కరాచీ వీధుల్లో వేగంగా దూసుకుపోయింది. గమ్యం ఎక్కడికో ఎవరికీ తెలియదు. ఒకప్పుడు డాన్‌గా వెలుగొందిన దావూద్ ఇప్పుడు తన ఉనికిని కాపాడుకోవడానికి పారిపోతున్నాడు. కొందరు అతడు దుబాయ్ వైపు వెళ్తున్నాడని గుసగుసలాడుకుంటున్నారు. మరికొందరు

# త్వరలో భూమి అంతం!

- భూమి అంతమయ్యే తేదీ చెప్పేసిన ఎలాన్ మస్క్..
- ఆ గ్రహంపైకి వెళ్తున్నానంటూ సంచలన ప్రకటన
- 2026 నాటికి అంగారక గ్రహాన్ని భాగాలుగా విభజన
- 2030 నాటికి మానవాళి నివాసం కోసం పరిశోధనలు

2



న్యూయార్క్-నవభూమిబ్యూరో
స్పేస్ ఎక్స్ వ్యవస్థాపకుడు, ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్షం, సాంకేతిక రంగాల్లో దిగ్గజ వ్యాపార వేత్తగా ఎదిగారు ఎలాన్ మస్క్. ప్రస్తుతం ప్రపంచ కుబేరుల్లో ఒకరిగా ఎలాన్ మస్క్ ఉన్నారు. అయితే ఆయన తాజాగా ఓ కీలక అంశాన్ని ప్రస్తావించారు. త్వరలో భూగ్రహం అంతం కాబోతోందని.. మానవాళికి ఈ ఒక్క గ్రహం సరిపోదని అభిప్రాయపడ్డారు. సూర్యుడు విస్తరిస్తూ ఉన్నాడని అందువల్ల భూగ్రహానికి పెను ముప్పు పొంచి ఉందని మస్క్ తెలిపారు. ఈ మేరకు ఎలాన్ మస్క్.. అంగారక గ్రహంపై దృష్టి పెట్టారు. ఆ గ్రహం భవిష్యత్తులో మానవాళి ఉండేందుకు అనువుగా ఉందని చెప్తూ వస్తున్నారు. 2026 నాటికి అంగారక గ్రహాన్ని భాగాలుగా విభజించి.. 2030 నాటికి మానవాళి అక్కడకు వెళ్లి నివాసం ఉండేందుకు పరిశోధనలు పూర్తవుతాయని అన్నారు. ఈ మేరకు ఫాక్స్ న్యూస్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన 'మార్స్ ను స్వాధీనం చేసుకోండి' అనే అంశంపై ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వాతావరణ మార్పులతో పాటు వివిధ అంశాలపై ఆయన మాట్లాడారు. ప్రస్తుతం భూమి గ్రహం ఒక్కటే మానవాళికి సరిపోదు. సూర్యుడి విస్తరణ కారణంగా భూగ్రహానికి పెను ముప్పు రాబోతోంది. భూమికి ఏదైనా విపత్తు తలెత్తేలోపే ఇతర గ్రహాన్ని మానవుడు స్వాధీనం చేసుకోవడం ఉత్తమం. అంగారక గ్రహం మానవాళి నివాసానికి యోగ్యంగా ఉంటుంది. ఇందుకు సంబంధించిన పరిశోధనలు జరుగు తున్నాయి. సూర్యుడు క్రమంగా విస్తరిస్తున్నా డని, 440 మిలియన్ సంవత్సరాలకు సూర్యుడి వేడికి భూమిపై జీవం లేకుండా పోతుందని ఆయన అంచనా వేశారు. 2026 నాటికి అంగారక గ్రహంపై మానవ రహిత వ్యోమ నౌకను దించాలని.. ఆ తర్వాత 2030 లోపు

# రూ.7 లక్షల కోట్లు మటాష్

- ఇన్వెస్టర్లను ముంచేసిన భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు
- లక్షల కోట్ల రూపాయల సంపద కోల్పోయిన మదుపరులు
- ఇన్వెస్టర్లు సురక్షిత ఆస్తుల వైపు మళ్లడంతో స్టాక్ మార్కెట్‌పై ఒత్తిడి
- అంతర్జాతీయ మార్కెట్లలో కూడా ప్రతికూల సంకేతాలు కారణమే..

2



ముంబై-నవభూమిబ్యూరో
భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో స్టాక్ మార్కెట్ సూచీలు వారాంతంలో శుక్రవారం (మే 9న) భారీ నష్టాలను చవిచూశాయి. ఈ నేపథ్యంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ 880 పాయింట్లు క్షీణించగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 266 పాయింట్లు నష్టపోయింది. ఈ కుప్పకూలిన మార్కెట్‌లో మదుపర్లు కొన్ని గంటల్లోనే లక్షల కోట్ల రూపాయల సంపదను కోల్పోయారు. ఈ ఘటన దేశీయ, అంతర్జాతీయ ఇన్వెస్టర్లలో ఆందోళనను రేకెత్తించింది.

**మార్కెట్‌పై ప్రభావం**
ఏప్రిల్ 2025లో జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ దాడిలో 26 మంది మరణించగా, 20 మందికి పైగా గాయపడ్డారు. రెసిస్టెన్స్ ఫ్రంట్ ఈ దాడికి బాధ్యత వహించినట్లు ప్రకటించింది. ఆ తర్వాత నియంత్రణ రేఖ వెంబడి ఇరు దేశాల మధ్య సాయుధ ఘర్షణలు జరిగాయి, ఇది రెండు అణ్వాయుధ శక్తుల మధ్య పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ భౌగోళిక రాజకీయ అనిశ్చితి మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. దీంతో ఇన్వెస్టర్లు సురక్షిత ఆస్తుల వైపు మళ్లడంతో స్టాక్ మార్కెట్ ఒత్తిడికి గురైంది.

**సెన్సెక్స్, నిఫ్టీ పతనం**
మే 9, 2025న ఉదయం మార్కెట్ ట్రేడింగ్ ప్రారంభమైన కొద్ది గంటల్లోనే సెన్సెక్స్ 900 పాయింట్లకు పైగా క్షీణించింది. ఈరోజు ముగిసే సమయానికి సెన్సెక్స్ 880 పాయింట్ల నష్టంతో 79,919 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 266 పాయింట్లు కోల్పోయి 24,168 వద్ద స్థిరపడింది. ఈ నష్టాలు బ్యాంకింగ్, ఐటీ, మెటల్, ఆటోమొబైల్ రంగాల్లో భారీ అమ్మకాల వల్ల సంభవించాయి. ఈ క్రమంలో నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 4% కంటే ఎక్కువ క్షీణించగా, బ్యాంక్ నిఫ్టీ 3% నష్టపోయింది. దీంతో మార్కెట్లు ఒక్క రోజులోనే రూ. 7 లక్షల కోట్లకు పైగా మదుపర్ల సంపదను ఆవిరి చేశాయి. మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 403 లక్షల కోట్లకు దిగజారింది.

**నష్టాలకు కారణాలు**
ఈ భారీ నష్టాలకు అనేక కారణాలు ఉన్నాయి. ప్రధానంగా భారత్-పాకిస్తాన్ మధ్య సైనిక ఘర్షణలు, దౌత్యపరమైన సంక్షోభం ఇన్వెస్టర్లలో భయాందోళనలను రేకెత్తించాయి. దీంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లలో కూడా ప్రతికూల సంకేతాలు కనిపించాయి. అమెరికా మార్కెట్లు డోజోన్స్ ఇండెక్స్ 400 పాయింట్ల క్షీణతతో ముగియడం ఆసియా మార్కెట్లపై ప్రభావం చూపింది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన అమెరికా విధించిన సుంకాలు కూడా భారత ఎగుమతి రంగంపై ఒత్తిడిని పెంచాయి. ఈ సమయంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు భారత మార్కెట్ నుంచి రూ. 2,000 కోట్లకు పైగా ఈక్విటీ షేర్లను అమ్మేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్ డేటా


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 హైదరాబాద్ శనివారం 10 । మే । 2025




# 23 ఏళ్లకే యుద్ధ విమానాన్ని నడిపా..

హైదరాబాద్-నవభూమి: భారత్‌కు చెందిన రఫేల్ విమానాన్ని కూల్చేశామంటూ పాకిస్తాన్ చెప్పడం అబద్ధమని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రఫేల్ యుద్ధ విమానం భారత సరిహద్దులు కూడా దాట లేదన్నారు. మన విమానాలు సరిహద్దు కూడా దాటకుండా ఉంటే.. వాటిని ఎలా పాకిస్తాన్ కూలుస్తుందని ఆయన సందేహం వ్యక్తం చేశారు. యుద్ధం చేయడం మన ఉద్దేశ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా కేవలం టెర్రరిస్ట్ క్యాంపులను మాత్రమే భారత సైన్యం కొట్టేసిందని చెప్పారు. పాకిస్తాన్ తీవ్ర ఇబ్బందుల్లో ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పేరుకు ప్రజాస్వామ్య దేశమైనప్పటికీ పాకిస్తాన్‌ను మాత్రం ఆర్మీ నడిపిస్తుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తాను మిలిటరీ పర్సన్‌గా చెబుతున్నానని.. భారత సైన్యం అద్భుతంగా పాకిస్తాన్‌పై దాడి చేసిందన్నారు.డ్రోన్స్, రఫేల్ యుద్ధ విమానాలతో సైన్యం దాడి చేసిందని చెప్పారు. డ్రోన్లు పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లాయని.. అయితే రఫేల్ యుద్ధ విమానాలు మాత్రం భారత సరిహద్దును దాట లేదని తెలిపారు. అయితే తాను లోక్ సభ సభ్యుడిగా ఉన్నప్పుడు పార్లమెంట్ డిఫెన్స్ కమిటీలో సభ్యుడినని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.ఏప్రిల్ 22వ తేదీ పహల్గాంలో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని అభివర్ణించారు. కుటుంబాలని కళ్ల ముందు విడదీసి మతం అడిగి మరీ కాల్చి చంపారంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. కాశ్మీర్‌లో హిందూ, ముస్లింల మధ్య విభేదాలు సృష్టించాలని ఉగ్రవాదులు ప్రయత్నం చేశారని విమర్శించారు. పహేల్గాం దాడి చేసింది ది రెసిస్టెన్స్ ఫ్రంట్ అనేది లష్కర్ ఏ తోయిబాకి ఫ్రంటల్ ఆర్గనైజేషన్ అని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.

నవ వార్త




## ఇండియా-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు..

### దీన్ని కూడా వదలరా..? సజ్జనార్ వార్నింగ్ ట్వీట్



హైదరాబాద్-నవభూమి: భారత్- పాకిస్తాన్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సింధూర్' చేపట్టగా.. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో దాదాపు 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. దీనికి ప్రతిస్పందనగా.. పాకిస్తాన్ భారత భూభాగంలోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో దాడులకు ప్రయత్నించింది. అయితే భారత భద్రతా దళాలు పాకిస్తాన్ ప్రయత్నాలను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రెండు దేశాల మధ్య తీవ్రమైన ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.అయితే భారత్-పాకిస్తాన్ సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతలను సైబర్ నేరగాళ్లు సొమ్ము చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రజల భయాందోళనలను ఆసరాగా చేసుకుని కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ, వీసీ సజ్జనార్ శుక్రవారం 'ఎక్స్' వేదికగా ప్రజలను అప్రమత్తం చేశారు. సరిహద్దుల్లోని ఉద్రిక్త పరిస్థితులను వివరిస్తూ చేస్తూ, సైబర్ నేరగాళ్లు ఆర్మీ అధికారులను నమ్మబలుకుతూ విరాళాలు అడుగుతున్నారని సజ్జనార్ తెలిపారు. ఇలాంటి నకిలీ ఆర్మీ అధికారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి విరాళాల సందేశాలను గుడ్డిగా నమ్మి డబ్బులు పంపవద్దని ఆయన సూచించారు.

కేంద్ర ప్రభుత్వానికి చెందిన సైబర్ దోస్త్ విడుదల చేసిన ఒక ఫోటోను సజ్జనార్ షేర్ చేశారు. ఆ ఫోటోలో, కేంద్ర బలగాల పేరుతో కొందరు మోసగాళ్లు నకిలీ విరాళాలు సేకరిస్తున్నారని హెచ్చరించారు. ఎవరైనా విరాళం అడిగితే, నిజమైనదేనా అని పూర్తిగా విచారించుకోవాలని సూచించారు. ఒకవేళ అది నకిలీ విరాళాల అభ్యర్థన అనిపిస్తే వెంటనే దానిని రిపోర్ట్ చేయాలని వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. సైబర్ నేరాల పట్ల ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేస్తున్న నిరంతర కృషిని పలువురు ప్రశంసిస్తున్నారు. ఉద్రిక్త పరిస్థితుల్లోనూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న ఆయన ప్రయత్నం అభినందనీయమని కొనియాడుతున్నారు.

## భారత్-పాక్ మధ్య హైటెన్షన్.. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు జరిగేనా..?



హైదరాబాద్-నవభూమి:భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో భారత బలగాలు పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశాయి. దీనికి ప్రతిస్పందనగా.. పాకిస్తాన్ భారత భూభాగంలోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో దాడులకు ప్రయత్నించింది. భారత భద్రతా దళాలు పాకిస్తాన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. అంతేకాకుండా, పాకిస్తాన్ వైమానిక రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని ఎదురు దాడులు చేశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య తీవ్రమైన ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సరిహద్దు ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.ఇదిలా ఉండగా.. తెలంగాణలో 72వ మిస్ వరల్డ్-2025 పోటీలు మొట్టమొదటిసారిగా జరుగుతున్నాయి. ఈ పోటీలు భారతదేశానికి, అలాగే తెలంగాణ రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తీసుకురానున్నాయి. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మే10న ప్రారంభం కానుండగా.. గురువారం సాయంత్రం వరకు 109 దేశాల నుంచి మిస్ వరల్డ్ పోటీదారులు, నిర్వాహక బృందం, సిబ్బంది హైదరాబాద్ చేరుకున్నారు. భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇప్పుడు మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ సందిగ్ధంలో పడింది. విమాన సర్వీసుల మార్పులు, రద్దుల ప్రభావం పోటీలపై ఉండనుంది.116 దేశాల నుండి వచ్చే అందాల పోటీదారులకు, స్పాన్సర్లకు, అంతర్జాతీయ మీడియాకు పూర్తి స్థాయి భద్రత కల్పించడం అతిపెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా హైదరాబాద్‌లోని వ్యూహాత్మక ప్రదేశాలు, సాధారణ ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, వీరికి కూడా రక్షణ కల్పించాల్సి ఉంటుంది. మూడు వారాల పాటు ఇంత పెద్ద సంఖ్యలో అంతర్జాతీయ అతిథులకు భద్రత కల్పించడం పోలీసు యంత్రాంగానికి పెనుభారంగా మారవచ్చు. షెడ్యూల్ ప్రకారం పోటీదారులు నాగార్జునసాగర్, చార్మినార్, వరంగల్, యాదగిరిగుట్ట వంటి సుదూర ప్రాంతాల్లో పర్యటించాల్సి ఉంది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ ప్రాంతాల్లో వారికి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయటం కష్టమైన పని నిపుణులు అంటున్నారు.

భారత్-పాక్ ఉద్రిక్తతల కారణంగా విమాన మార్గాలు మారే లేదా సర్వీసులు రద్దయ్యే అవకాశం ఉంది. ఇది మిస్ వరల్డ్ పోటీదారుల రాకపోకలపై ప్రభావం చూపవచ్చు. కొందరు మధ్యలో చేరుకునేలా ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ.. హఠాత్తుగా ఏర్పడే అంతరాయాల వల్ల షెడ్యూల్‌లో మార్పులు చేయాల్సి రావచ్చు. పాకిస్థాన్‌లోని అమెరికా పౌరుల విషయంలో ట్రంప్ చేసిన సూచనల నేపథ్యంలో.. ఇతర దేశాలు కూడా తమ పౌరుల భద్రత గురించి ఆందోళన చెందుతున్నాయి. ఇది మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై ఒత్తిడి పెంచే అవకాశం ఉంది.తెలంగాణ ప్రభుత్వం భద్రతా చర్యలు చేపట్టినప్పటికీ.. హైదరాబాద్‌లోని కీలక సంస్థలు, ప్రజల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. మూడు వారాల పాటు పూర్తి భద్రత కల్పించడం సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో పోటీల కొనసాగింపుపై కేంద్రం సూచనల మేరకు నడుచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



హైదరాబాద్-నవభూమి:పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం ద్వారా నిరుపేదల ఇండ్ల నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నారు. తాజాగా ఈ పథకంపై కీలక అప్డేట్ వచ్చింది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. పేదలకే కాకుండా.. జర్నలిస్టులకు కూడా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రెస్ అకాడమీలో జరిగిన జర్నలిస్టు కుటుంబాలకు పెన్షన్, ఎక్స్ గ్రేషియా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విధి నిర్వహణలో మరణించిన, దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్న జర్నలిస్టుల కుటుంబాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అందిస్తుందని హామీ ఇచ్చారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద జర్నలిస్టులు, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

జర్నలిస్టుల నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కోసం మూతపడిన ప్రెస్ అకాడమీని ఈ నెల చివరి నాటికి తిరిగి ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని.. వారి సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. జర్నలిస్టుల ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, ఇతర సంక్షేమ పథకాల గురించి కూడా మంత్రి ప్రస్తావించారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలు, ఆర్థిక సహాయం, ఇతర సహాయక చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.ఇక ఈ పథకం కింద ప్రభుత్వం ఆధునిక షేర్‌వెల్ టెక్నాలజీని ఉపయోగించి తక్కువ సమయంలో ఇళ్లను నిర్మించే ప్రయత్నాలు చేస్తోంది. ఒక ప్రైవేట్ కంపెనీ కేవలం 15 రోజుల్లో 75 చదరపు గజాల్లో ఇందిరమ్మ ఇంటి నమూనాను నిర్మించింది. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల్లో ఇలాంటి మోడల్ హౌస్‌లను నిర్మించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ఆరుగురు కార్మికులు రోజుకు 16 గంటలు పని చేశారు. ఈ ఇళ్ల జీవితకాలం 30 ఏళ్లు ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వం తొలి దశలో 71 వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా.. 65 వేల మంది అర్హులుగా తేలారు. వీరిలో కొంతమంది బేస్‌మెంట్ పూర్తి చేయగా.. మరికొందరు నిర్మాణం ప్రారంభించారు. నిధులకు ఇబ్బందులు రాకుండా బేస్‌మెంట్ పూర్తి చేసిన లబ్ధిదారుల ఖాతాల్లో ప్రతి సోమవారం కొంత మొత్తం ఆర్థిక సహాయం అందిస్తున్నారు. రెండో దశ లబ్ధిదారుల ఎంపిక కూడా చివరి దశకు చేరుకుంది.

# భీకర దాడి

(1వపేజీ తరువాయి)ప్రకారం టర్కీ తయారీ డ్రోన్లను పాకిస్థాన్ ప్రయోగించినట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. అంతేకాక పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా ఉపయోగిస్తోందని ఆర్మీ అధికారులు వెల్లడించారు. ఇక పాకిస్థాన్ పై భారత్ ఎక్కుపెట్టిన బ్రహ్మాస్త్రం ఆపరేషన్ సిందూర్. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌ను దెబ్బకు దెబ్బ తీసింది భారత ఆర్మీ. అత్యాధునిక క్షిపణులతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లో 9 కీలక ఉగ్రవాద స్థావరాలపై భారత క్షిపణులు దాడి చేశాయి. ఈ దాడుల్లో దాదాపు 100 మంది ఉగ్రమూకలు హతం అయినట్లు కేంద్ర రక్షణశాఖ పేర్కొంది. అయితే ఆపరేషన్ సిందూర్ లో భాగంగా జైషే మహ్మద్ కీలక ఉగ్రవాది, మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ రవూఫ్ అజహర్ హతం అయ్యాడు.

భారత్, పాక్ ఉద్రిక్తతల వేళ సరిహద్దుల్లో భారీ చొరబాటుయత్నాన్ని బీఎస్ఎఫ్ బలగాలు సమర్థవంతంగా అడ్డుకున్నాయి. సైనిక వర్గాల సమాచారం ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున సాంబ సెక్టార్ లో భారీ సంఖ్యలో ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. సర్వేలెన్స్ కెమెరాల ద్వారా ఈ విషయం గుర్తించిన బీఎస్ఎఫ్ బలగాలు వెంటనే అప్రమత్తమయ్యాయి. ఉగ్రవాదులపై కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఏడుగురు ఉగ్రవాదులు హతమయ్యారని సమాచారం. బీఎస్ఎఫ్ బలగాల కాల్పుల్లో పాక్ సైనిక పోస్ట్ ధ్వంసమైందని తెలుస్తోంది. అయితే, మృతుల సంఖ్యపై బీఎస్ఎఫ్ ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటన చేయలేదు. కాగా, ఉగ్రవాదుల కదలికలకు సంబంధించి సర్వేలెన్స్ కెమెరా ఫుటేజీని భద్రతా బలగాలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఆ వీడియో ప్రస్తుతం వైరల్ గా మారింది.

# కేంద్రానికి బాసట

(1వపేజీ తరువాయి)తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చించారు. సీఎం సూచన మేరకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించి ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించనున్నారు. సరిహద్దు రాష్ట్రాలలోని తెలంగాణ వాసుల కోసం కంట్రోల్ రూమ్ ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉంటే సరిహద్దు రాష్ట్రాలలో ఉన్న తెలంగాణ పౌరుల కోసం, వారికి సహాయం అందించడం కోసం కూడా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్లో సరిహద్దు రాష్ట్రాలలోని తెలంగాణ వాసుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. సరిహద్దులో ఉన్న తెలంగాణా వాసుల సహాయం కోసం ఢిల్లీలో ఏర్పాటు అంతర్జాతీయ సరిహద్దులో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, సరిహద్దు రాష్ట్రాలలో ప్రస్తుతం నివసిస్తున్న,చిక్కుకున్న తెలంగాణ వాసులకు సకాలంలో సహాయం, సమాచారం, సేవలను అందించే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు పేర్కొంది. నిరంతరాయంగా సేవలను నిర్ధారించడానికి ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందని వెల్లడించింది. ఈ కంట్రోల్ రూమ్ కి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.ఈ నెంబర్లలో సంప్రదించాలని సూచన ల్యాండ్‌లైన్: 011-23380556 వందన, రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రటరీ లైజన్ హెడ్ - 9871999044 హైదర్ అలీ నఖ్వీ, రెసిడెంట్ కమిషనర్ వ్యక్తిగత సహాయకుడు - 9971387500 జి. రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ - 9643723157 సిహెచ్. చక్రవర్తి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ - 9949351270. ఎవరికైనా ఎటువంటి సహాయం కావాలన్నా పైన పేర్కొన్న నెంబర్లలో సంప్రదించవచ్చని ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డా.గౌరవ్ ఉప్పల్ తెలిపారు. తెలంగాణ పౌరుల భద్రత కోసం ఈ కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

# ఆపరేషన్ సిందూర్ విజయం కోసం

## ఆలయాల్లో పూజలు: మంత్రి సురేఖ

హైదరాబాద్-నవభూమి: పహల్గాంలో పర్యాటకులను చంపిన తీవ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్-టార్గెట్ విజయవంతం కావాలని మంత్రి కొండా సురేఖ దేవాదాయ శాఖకి కీలక ఆదేశాలు జారీ చేశారు. మన రాష్ట్రంలో ఉన్న ప్రతి దేవాలయంలో ఇండియన్ ఆర్మీకి మద్దతుగా పూజలు చేయాలని మంత్రి కొండా సురేఖ ఆదేశాలు ఇచ్చారు. ఇంతటి సంక్లిష్టమైన సమయంలో భారత ఆర్మీకి మనమంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావటం సంతోషం పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేపట్టిన "ఆపరేషన్ సిందూర్" రెండో దాడి విజయవంతం అవడం హర్షించదగ్గ విషయం అని ఆమె పేర్కొన్నారు. కోట్లి వద్ద గుల్పూర్ ప్రాంతంలో ఉన్న లష్కరే తోయిబా నియంత్రణ కేంద్రాన్ని ఇండియన్ ఆర్మీ పూర్తిగా నాశనం చేసిందని, ఇది సంతోషించాల్సిన అంశమన్నారు. అత్యాధునిక ఆయుధాలతో ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడి చేసిన దృశ్యాలను భారత భద్రతా సంస్థలు అధికారికంగా విడుదల చేశాయని పేర్కొన్నారు. ఆర్మీ క్షేమం కోసం మనమంతా పూజలు చేయడం సందర్భోచితం ఉగ్రవాదంపై పోరాటం కొనసాగుతుందని భారత ఆర్మీ



బలగాలు ప్రకటించాయన్నారు. ఆర్మీ బలగాలు సరిహద్దులో పెద్ద ఎత్తున పోరాడుతున్న సమయంలో వారి క్షేమం కోసం మనమంతా పూజలు చేయడం సందర్భోచితం అని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. తీవ్రవాద దాన్ని యావత్ భారతదేశం ఉక్కు పిడికిలితో ఎదుర్కొందని, ఈ సమైక్యత దేశ భద్రత విషయంలో రానున్న రోజులలో కూడా ఉంటుందని అన్నారు. తెలంగాణా మంత్రిగా కాదు, దేశ పౌరురాలిగా సంతోషంగా ఉన్నా తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా... ఎక్కడ ఉన్నా కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. మన దేశ పౌరుల మీద ఇటీవల కాశ్మీర్ లో జరిగిన దాడికి నిరసనగా ఇండియన్ మిలటరీ చేపట్టిన సిందూర్ ఆపరేషన్ ను అందరం స్వాగతిస్తున్నామని పేర్కొన్న కొండ సురేఖ తెలంగాణ మంత్రిగా కాదు, ఇంతటి గొప్ప దేశ పౌరురాలిగా, ఈ చర్యపై చాలా సంతోషంగా భావిస్తున్నా అని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ తో భారత్ తలెత్తి నిలిచింది పుల్వామాలో మనం కోల్పోయిన వీర సైనికులను తిరిగి తీసుకురాలేం, వారి త్యాగం శాశ్వతం. మనమున్నంత కాలం వారిని స్మరించుకుంటాం అని పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా భారత్ తలెత్తి నిలిచిందని, ఏకత్వంతో, శక్తితో, నిశ్శబ్దమైన సంకల్పంతో మనలని ప్రపంచం నిలబెట్టిందని పేర్కొన్నారు. ఇది కేవలం ప్రతిస్పందన కాదు, ఒక ప్రతి సమాధానం అని స్పష్టం చేశారు.భారత్ పాకిస్తాన్ యుద్ధం వేళ భారతీయ రైల్వే సాహసోపేత నిర్ణయం అన్ని పార్టీలను కలుపుకుపోవాలన్న కొండా సురేఖ కేంద్రప్రభుత్వం ఈ విషయంలో చాలా మర్యాదగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ భద్రత విషయంలో అందరినీ కలుపుకోవాలి. ఎందుకంటే, ఇది దేశానికి సంబంధించిన విషయం అని కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎటువంటి రాజకీయం చేయాలని అనుకోవడం లేదు. చేయదు కూడా అని స్పష్టం చేశారు. మేము భారత ఆర్మీకి పూర్తి మద్దతుగా ఉన్నామని పేర్కొన్న కొండ సురేఖ రానున్న రోజుల్లో కూడా ఉంటాం అని చెప్పారు. అందుకే ఈరోజు మా రాష్ట్రంలోని ప్రతి గుడిలో..దేవాలయాల్లో ఆర్మీకి మంచి జరగాలని పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

# భారీగా బంగారం ధరల పతనం

న్యూఢిల్లీ-నవభూమి: బంగారం ప్రియులకు పండుగ లాంటి వార్త. విపరీతంగా పెరిగి లక్ష రూపాయల మార్కును చేరుకున్న బంగారం ధరలు కాస్త తగ్గుతున్నాయి. నేడు బంగారం ధర భారీగా పడిపోయింది. గత నాలుగు రోజుల్లో భారీగా పెరిగి లక్షకు చేరువైన బంగారం ధర నేడు తగ్గింది. బంగారం కొనాలనుకునే వారికి నేడు తగ్గిన ధర కాస్త ఊరటనిస్తుంది. %ూణ% నేడు పతనమైన బంగారం ధరలు నేడు దేశంలోని ప్రధాన నగరాలలో 24 క్యారెట్లు, 22 క్యారెట్ల బంగారం ధరల విషయానికి వస్తే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని ప్రధాన నగరాలలో 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు 90,150 రూపాయలుగా ఉంది. 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు 98,350 రూపాయలుగా ఉంది. %ూణ% దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధరలిలా నిన్నటితో పోలిస్తే నేడు బంగారం ధర 10గ్రాముల 24 క్యారెట్ల బంగారానికి 1250 రూపాయలు, 10 గ్రాముల 22క్యారెట్ల బంగారానికి 1150 రూపాయలు చొప్పున క్షీణించింది.

## పాక్ కాల్పుల్లో ఆంధ్రా జవాన్ వీరమరణం..!

(1వపేజీ తరువాయి) పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. పాకిస్తాన్ తో యుద్ధంలో సత్యసాయి జిల్లాకు చెందిన సైనికుడు మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అన్నారు. సరిహద్దుల్లో మురళీ నాయిక్ ప్రదర్శించిన ధైర్య సాహసాలు దేశానికే కాక రాష్ట్ర ప్రజలందరికీ స్ఫూర్తిదాయకం అని తెలిపారు. మురళీ నాయిక్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అటు పాకిస్తాన్ కాల్పుల్లో రాష్ట్రానికి చెందిన వీరజవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందినది ఎంతగానో బాధాకరమని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. దేశ భద్రత కోసం తన ప్రాణాలను అర్పించిన మురళీ నాయక్ సేవలు చిరస్మరణీయమైనవిగా నిలిచిపోతాయన్నారు. దేశ రక్షణలో ఆయన చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమకు యావత్ దేశం గర్విస్తోందన్నారు. మురళీ నాయక్ ఈ త్యాగంతో చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయన మృతిపై భారత ప్రజలందరూ సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు వెల్లడించారు.

## జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు

(1వపేజీ తరువాయి) జెర్నలిస్టు కుటుంబాలకు పెన్షన్, ఎక్స్ గ్రేషియా చెక్కులు పంపిణీ చేశారు. విధి నిర్వహణలో మరణించిన, అనారోగ్యాలతో బాధపడుతున్న జర్నలిస్టుల కుటుంబాలకు ఆయన స్వయంగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అందిస్తుందని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద జర్నలిస్టులు, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. జర్నలిస్టుల శిక్షణ కోసం మూతపడిన ప్రెస్ అకాడమీని అతి త్వరలోనే తిరిగి ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఇక ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద.. ఇళ్లు లేదా భూమి లేని వ్యక్తులకు ఇంటి నిర్మాణం కోసం ఉచిత భూమి/సైట్ అందిస్తారు. ఆర్థిక సహాయం రూ. 5 లక్షలు ఇంటి నిర్మాణం కోసం అవసరమైన వారికి అందిస్తారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలం కూడా ఇస్తారు. రేషన్ కార్డు ఆధారంగా లబ్ధిదారుడిని ఎంపిక ఉంటుంది. లబ్ధిదారుడు బీపీఎల్ కు దిగువన ఉన్న వారై ఉండాలి.

## మధ్యవర్తిత్వం వద్దు!

(1వపేజీ తరువాయి) ఇస్తుంది. అంతర్జాతీయ వేదికలపై తన సమస్యలను పరిష్కరించుకునే సామర్థ్యం భారత్‌కు ఉందని స్పష్టం చేసింది. భారతదేశం అమెరికా, రష్యా, ఫ్రాన్స్ వంటి దేశాలతో బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉంది. ఈ దేశాల నుండి కూడా భారత్ కు మద్దతు లభించింది. భారతదేశం యొక్క ఈ సున్నితమైన, కానీ దృఢమైన స్పందన, అంతర్జాతీయ వేదికలపై దాని స్థిరమైన విధానాన్ని ప్రతిబింబిస్తుంది. భారతదేశం తన సమస్యలను తానే పరిష్కరించుకోగలదని, మూడవ పక్షం జోక్యం అవసరం లేదని నమ్మకంగా తెలియజేసింది.

## పాక్‌ను విడిచిపెట్టిన డాన్

(1వపేజీ తరువాయి)థాయిలాండ్ లేదా మలేషియా అడవుల్లో తలదాచుకుంటాడని ఊహిస్తున్నారు. కానీ నిజం ఏమిటనేది ఒక రహస్యంగానే మిగిలిపోయింది. ఒకప్పుడు ప్రపంచాన్ని శాసించిన నేర సామ్రాజ్యపు అధిపతి, ఇప్పుడు తన నీడను చూసి కూడా భయపడుతున్నాడు. భారత్ చేస్తున్న ఈ దాడులు కేవలం ఉగ్రవాద స్థావరాల మీదే కాదు, దావూద్ లాంటి నేరస్తుల గుండెల్లో కూడా భయాన్ని నింపుతున్నాయి. చట్టం యొక్క చేతులు ఎంత దూరమైనా వెళ్లగలవని ఈ ఘటన మరోసారి నిరూపిస్తోంది. కాలం మారుతుంది, చక్రం తిరుగుతుంది. ఒకప్పుడు అందరినీ భయపెట్టిన డాన్, ఇప్పుడు తాను భయంతో పారిపోతున్నాడు. ఈ పరిణామం భారత భద్రతా సంస్థలకు ఒక పెద్ద విజయం కావచ్చు. అయితే, దావూద్ ఎక్కడ ఉన్నాడో కనుక్కోవడం ఇంకా ఒక సవాలుగానే మిగిలి ఉంది.

## త్వరలో భూమి అంతం!

(1వపేజీ తరువాయి)మానవులను పంపాలని మస్క్.. చాలా సంవత్సరాల నుంచి ప్రకటిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఇటీవల తన లక్ష్యాన్ని సవరించుకున్న ఆయన.. 2029 నాటికి మానవులు ఈ గ్రహంపై అడుగుపెట్టే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ మేరకు పరిశోధనలు ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు. స్టార్ షిప్ వ్యోమ నౌకను అంగారక కక్ష్యలోకి పంపడం.. ప్రస్తుతం తమ ప్రథమ ప్రాధాన్యతలని మస్క్ స్పష్టం చేశారు.

## రూ.7 లక్షల కోట్లు మటాష్

(1వపేజీ తరువాయి)తెలిపింది. ఈ అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత దిగజార్చాయి. రూపాయి విలువ కూడా డాలర్‌తో పోలిస్తే 86.80 వద్ద రికార్డు కనిష్ఠ స్థాయికి చేరుకుంది.

## మళ్లీ భారత్‌లోకి దూసుకొస్తున్న పాక్ డ్రోన్లు

న్యూఢిల్లీ-నవభూమి:పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ జరుపుతున్న ఆపరేషన్ సింధూర్ పాకిస్తాన్ కు చుక్కలు చూపిస్తోంది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ భారత్ పై వరుసగా డ్రోన్లను పంపుతూ కవ్వింపులకు దిగుతోంది. ఇదే క్రమంలో నిన్న 36 ప్రాంతాల్లో పాకిస్తాన్ పంపిన 300 నుంచి 400 టర్కీ తయారీ డ్రోన్లను కూల్చేసినట్లు వాయుసేన ఇవాళ ప్రకటించింది. అయితే ఈ ప్రకటన వచ్చిన గంటల్లోనే మరోసారి పాకిస్తాన్ మరోసారి డ్రోన్లను భారీగా భారత్ పైకి ప్రయోగిస్తోంది. నిన్నటి తరహాలోనే పాకిస్తాన్ ఇవాళ కూడా జమ్మూతో పాటు సరిహద్దు రాష్ట్రాలపైనే డ్రోన్లను ప్రయోగిస్తోంది. ఇందులో జమ్మూ, సాంబా, పంజాబ్ లోని పఠాన్ కోట్, ఫిరోజ్ పూర్, రాజస్థాన్ లోని పోఖ్రాన్ వంటి ప్రాంతాలు ఉన్నాయి. వీటిపై నిన్నటి తరహాలోనే టర్కిష్ డ్రోన్లతో పాకిస్తాన్ దాడులకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే భారత్ కూడా అంతే దీటుగా వీటిని ఎక్కడికక్కడే కూల్చేస్తోంది. దీంతో ఎక్కడా ఎలాంటి నష్టం జరగలేదు. పాకిస్తాన్ డ్రోన్ల దాడులతో సరిహద్దుల్లో మరోసారి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిన్నటిలాగే ఇవాళ కూడా సరిహద్దు రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ప్రజల్ని ఇళ్లలో నుంచి బయటికి రావొద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. జమ్మూ, కశ్మీర్ తో పాటు జైసల్మేర్, పంజాబ్, రాజస్తాన్, అమృత్ సర్ ఇలా చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు. మరోవైపు నియంత్రణ రేఖ వెంబడి పలు చోట్ల పాకిస్తాన్ కాల్పుల మోత కొనసాగుతోంది. దీంతో భారత బలగాలు కూడా ప్రతిగా కాల్పులు జరుపుతున్నాయి. దీంతో సరిహద్దుల్లోనూ ఉద్రికత కొనసాగుతోంది. దీనిపై ప్రధాని మోడీకి ఎప్పటికప్పుడు త్రివిధ దళాధిపతులు సమాచారం అందిస్తున్నాయి.

## మాజీ సీఎం కన్నీటి పర్యంతం.. ఎందుకంటే..

**జమ్ము కశ్మీర్:నవభూమి:** భారత్, పాకిస్థాన్‌ల మధ్య జరుగుతోన్న కాల్పుల్లో అమాయక చిన్నారులతోపాటు మహిళలు మరణిస్తున్నారని జమ్మూ కశ్మీర్ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం మహబూబా ముఫ్తీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య చోటు చేసుకున్న టెన్షన్లు నివారించేందుకు రాజకీయ జోక్యం అవసరమని ఈ సందర్భంగా ఆమె అభిప్రాయపడ్డారు. ఇరు దేశాల మధ్య చోటు చేసుకున్న ఈ దాడులపై తొలిసారిగా మహబూబా ముఫ్తీ స్పందించారు.




శుక్రవారం శ్రీనగర్‌లో మాజీ సీఎం మహబూబా ముఫ్తీ విలేకర్లతో మాట్లాడుతూ.. గతంలో జరిగిన పుల్వామా అయినా.. పహల్గాం అయినా.. ప్రమాదం మాత్రం దేశ అంచునకు తీసుకు వెళ్లాయన్నారు. సరిహద్దు ప్రాంతంలో చిన్నారి కవలలు ఆడుకోవడం చూశానని.. అదే చిన్నారులు రక్తం మడుగులో పడి విగత జీవులుగా ఉండడాన్ని సైతం చూశాన్నారు. ఇలా విగత జీవులుగా మారుతోన్న చిన్నారులు, మహిళలకు బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. ఈ వారి మరణాలకు తప్పు ఎవరిదంటూ ఆమె నిలదీశారు. చిన్నారుల మరణంతో ఆ తల్లల ఒడి ఖాళీగా మారుతోందని.. ఇలా ఎంత కాలమంటూ మాజీ సీఎం మహబూబా ముఫ్తీ కన్నీటి పర్యంతమవుతూ ప్రశ్నించారు.

## మహారాష్ట్రలోని కీలక శాఖల్లో ఉద్యోగుల సెలవులు రద్దు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆరోగ్య విపత్తు నిర్వహణ సహా పలు కీలక శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సెలవులను మహారాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో మహా సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన చేసింది. శత్రువుకు లాభం చేకూరేలా ఎవరైనా తప్పుడు వార్తలను ప్రచారం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆ ప్రకటనలో హెచ్చరించింది.రాష్ట్రంలో భద్రతా పరిస్థితులపై సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మహారాష్ట్ర సీఎంవోలో ఇవాళ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే కీలక శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సెలవుల రద్దు నిర్ణయం తీసుకున్నారు. సీఎం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మహారాష్ట్ర డీజేపీ, ముంబై పోలీస్ కమిషనర్, హోంశాఖ ఉన్నతాధికారులు, వివిధ శాఖల, ఏజెన్సీల సీనియర్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కూడా సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని 36 జిల్లాల్లో యుద్ధ సన్నద్ధత కోసం మాక్ డ్రిల్స్ నిర్వహించాలని ఈ సమావేశంలో సీఎం ఫడ్నవీస్ సూచించారు. హాస్పిటల్స్‌లో కోఆర్డినేషన్ మిషనరీని సెటప్ చేయాలని చెప్పారు. ఇళ్లలో లైట్‌లు బయటికి కనిపించకుండా మందపాటి కర్టెన్‌లను వినియోగించాలని ఆదేశించారు.

## పెట్రోల్, డీజిల్ కొరతంటూ ప్రచారం.. ఇండియన్ ఆయిల్ క్లారిటీ




**జమ్ము కశ్మీర్:నవభూమి:**భారత్-పాకిస్థాన్ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశంలో అనేక పుకార్లు దర్జాగా షికారు చేస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా ఫేక్ న్యూస్ తెగ వైరల్ అవుతోంది. ఈ క్రమంలో తాజాగా సోషల్ మీడియాలో.. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత అంటూ ప్రచారం మొదలైంది. ఇది నిజమే అని నమ్మిన జనాలు.. నిజంగా ఇంధన కొరత సంభవిస్తుందేమో అనే ఆందోళనతో పెట్రోల్, డీజిల్‌లను ముందే కొని నిల్వ చేసుకునేందుకు పెట్రోల్ బంకుల వద్దకు క్యూ కట్టారు.ఈ క్రమంలో దేశంలోని పలు పెట్రోల్ బంకుల వద్ద భారీ ఎత్తున క్యూలైన్‌లో నిల్చున్న జనాల ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. మరి ఈ వార్త నిజమేనా.. నిజంగానే దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందా అనే ప్రశ్నలకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) స్పష్టతనిచ్చింది.దేశంలో ఇంధన కొరతంటూ జరుగుతున్న ప్రచారంపై ఐఓసీ స్పందించింది. మన దగ్గర పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఐఓసీ స్పష్టం చేసింది. ఈ మేరకు ఐఓసీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'(ట్విటర్) వేదికగా ఒక పోస్ట్ చేసింది. "ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. దేశంలో ఇంధన కొరత లేదు. మా అన్ని అవుట్‌లెట్లలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ సమృద్ధిగా అందుబాటులో ఉంది" అని తెలిపింది.దేశవ్యాప్తంగా ఇండియన్ ఆయిల్ వద్ద ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని.. ప్రశాంతంగా ఉండి, అనవసరమైన రద్దీని నివారించి మెరుగైన సేవలు అందించడంలో తమకు సాయం చేయమని తెలిపింది. అంతేకాక తమ సరఫరా మార్గాలు సజావుగా పనిచేస్తున్నాయని వెల్లడించింది. వినియోగదారులు అనవసరంగా ఈ ఫేక్ వార్తలను నమ్మి.. కంగారు పడి పెట్రోల్ బంక్‌లకు పోటెత్తవద్దని సూచించింది.ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి, ప్రతీకారంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడులు జరిపింది. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం పాక్ సరిహద్దు రాష్ట్రాల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

## ఏటీఎంలు బంద్.. ఫేక్ మెసేజ్‌పై ఫ్యాక్ట్ చెక్



**న్యూఢిల్లీ-నవభూమి:**రెండు మూడు రోజులు పాటు ఏటీఎంలను మూసివేయనున్నట్లు వాట్సాప్‌లో మెసేజ్‌లు వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆ వార్తలపై ఫ్యాక్ట్ చెక్ చేసింది. అయితే యధావిధిగా ఏటీఎంలను ఆపరేట్ చేస్తారని ప్రభుత్వం పేర్కొన్నది. వెరిఫై చేయని మెసేజ్‌లను షేరింగ్ చేయవద్దు అని, ఇండోపాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వం చెప్పింది. పాకిస్థాన్ నుంచి సాగుతున్న దుష్ ప్రచారాన్ని పీఐబీ ఎప్పటికప్పుడు బయటపెడుతూనే ఉన్నది.

## రాజౌరీ ఆర్మీ బ్రిగేడ్‌పై సూసైడ్ దాడి.. ఫేక్ న్యూస్ అని పేర్కొన్న ప్రభుత్వం




**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో ఆర్మీ బ్రిగేడ్‌పై సూసైడ్ దాడి జరిగినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. పంజాబ్‌లోని జలం ధర్‌పై డ్రోన్ అటాక్ జరిగినట్లు కూడా వస్తున్న వార్తలను ఫేక్ న్యూస్‌గా కేంద్రం ప్రకటించింది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్( యూనిట్ దీనిపై వివరణ ఇచ్చింది. ఆర్మీ కంటోన్మెంట్‌పై ఫిదాయిన్ లేదా సూసైడ్ దాడి జరగలేదని పీఐబీ వెల్లడించింది. జలంధర్‌లో డ్రోన్ దాడి కేవలం వ్యవసాయ క్షేత్రంలోని మంటలు మాత్రమే అని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ చెప్పింది. జలంధర్ జిల్లా కలెక్టర్ ఎటువంటి డ్రోన్ దాడి జరగలేదని చెప్పినట్లు పీఐబీ పేర్కొన్నది.

# భారత్-పాక్ టెన్షన్.. రంగంలోకి టెరిటోరియల్ ఆర్మీ



**జమ్ము కశ్మీర్:నవభూమి:**పహల్గామ్ ఉగ్రదాడి.. దానికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ భద్రతను మరింత పటిష్టం చేసేందుకు, సాధారణ సైన్యానికి సహాయం అందించేందుకు టెరిటోరియల్ ఆర్మీని రంగంలోకి దించేందుకు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదికి విస్తృత అధికారాలను కల్పిస్తూ.. రక్షణ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. టెరిటోరియల్ ఆర్మీ రూల్స్ 1948లోని రూల్ 33 ప్రకారం రక్షణ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త అధికారాల ద్వారా ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది.. టెరిటోరియల్ ఆర్మీలోని అధికారులను, సిబ్బందిని అత్యవసర భద్రతా విధుల కోసం లేదా సాధారణ సైన్యం కార్యకలాపాలకు మద్దతుగా ఉపయోగించవచ్చు.రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం, టెరిటోరియల్ ఆర్మీ రూల్ అధికారాలను వినియోగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం టెరిటోరియల్ ఆర్మీలోని ప్రతి అధికారిని అవసరమైన కాపలా కోసం లేదా సాధారణ సైన్యానికి మద్దతుగా లేదా అనుబంధంగా ఉండేందుకు పిలిచే అధికారాన్ని ఆర్మీ చీఫ్‌కు మంజూరు చేస్తోందని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న 32 ఇన్ఫాంట్రీ బెటాలియన్ల (టెరిటోరియల్ ఆర్మీ) నుంచి 14 బెటాలియన్లను సదరన్ కమాండ్, ఈస్టర్న్ కమాండ్, వెస్టర్న్ కమాండ్, సెంట్రల్ కమాండ్, నార్తర్న్ కమాండ్, సౌత్ వెస్టర్న్ కమాండ్, అండమాన్ నికోబార్ కమాండ్, ఆర్మీ ట్రైనింగ్ కమాండ్ (ఆర్ట్రాక్) ప్రాంతాల్లో మోహరించనున్నారు.అయితే బడ్జెట్‌లో నిధులు అందుబాటులో ఉంటే లేదా అంతర్గత పొదుపుల ద్వారా నిధులు సమకూర్చిన తర్వాత మాత్రమే ఈ మోహరింపునకు ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుంది. రక్షణ మంత్రిత్వ శాఖ కాకుండా ఇతర మంత్రిత్వ శాఖల అభ్యర్థన మేరకు యూనిట్లను మోహరిస్తే.. ఆ ఖర్చు సంబంధిత మంత్రిత్వ శాఖల ఖాతాలోనే జమ చేయబడుతుందని.. రక్షణ మంత్రిత్వ శాఖ బడ్జెట్ కేటాయింపులో చేర్చబడదని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఆర్మీ చీఫ్‌కు లభించిన ఈ అధికారాలు.. దేశ భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, ఎలాంటి సవాళ్లనైనా సమర్థవంతంగా ఎదుర్కోవడానికి భారత సైన్యానికి మరింత వెసులుబాటును కల్పిస్తాయి.

## బ్లాక్‌అవుట్ అంటే ఏంటి? లైట్లు, ఫ్యాన్లు సహా అన్నీ ఆఫ్



**జమ్ము కశ్మీర్:నవభూమి:**పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మొత్తంగా 26 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయిన విషయం అందరికీ తెలిసిందే. ఈ ఘటనతో దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు జ్వలించగా.. భారత్ ప్రతీకార చర్యలు చేపట్టింది. మంగళవారం రోజు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రసా?వరాలపై వైమానిక దాడులు చేసింది. దీంతో దాయాది దేశం కూడా ప్రతిచ ర్యలకు దిగగా.. భారత్-పాక్ సరిహద్దులో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతు న్నాయి.ఈక్రమంలోనే ఇండియా మే 7వ తేదీన ఢిల్లీ సహా అనేక నగరాల్లో సివిల్ సెక్యూరిటీ కింద మాక్ డ్రిల్స్, బ్లాక్‌అవుట్ వ్యాయామాలు చేపట్టింది. గత 54 ఏళ్లలో దేశంలో తొలిసారిగా ఇలాంటి సైనిక సన్నాహకాలు సాగగా.. బ్లాక్‌అవుట్ అంటే ఏమిటి, ఎందుకు ఆ సమయంలో లైట్లు, ఫ్యాన్లు సహా అన్నీ ఆఫ్ చేయాలనే అనుమానాలు ప్రజల్లో కల్గుతున్నాయి. ఇలాంటి వాటన్నిటికీ సమాధానమే ఈ స్టోరీ.

**బ్లాక్‌అవుట్ అంటే ఏమిటి..?**

బ్లాక్‌అవుట్ అంటే ఓ ప్రాంతంలోని అన్ని లైట్లు, ఫ్యాన్లను ఆర్పేయాలి. ఎక్కడా వెలుతూరు కనిపించకూడదు. కనీసం వాహనాలను సైతం రోడ్డుపై నడపకూడదు. అలాగే హెడ్ లైట్లు కూడా కనిపించకుండా చేయాలి. ముఖ్యంగా 5000 అడుగుల ఎత్తు నుంచి చూస్తే ఎలాంటి వెలుతూరు కనిపించకుండా ఉండాలి. ఇలా ప్రాంతం మొత్తాన్ని పూర్తి చీకటిగా మార్చడాన్ని బ్లాక్‌అవుట్ అంటారు.

**బ్లాక్‌అవుట్ సమయంలో ఏం చేయాలి?**

బ్లాక్‌అవుట్ సమయంలో భవనాల వెలుపల ఉన్న లైట్లు ఆర్పేయాలి. అలాగే వాహనాల హెడ్‌లైట్లు కూడా కనిపించకుండా కప్పేయాలి. అలంకారంతో పాటు ఏవైనా ప్రకటనల కోసం పెట్టిన లైట్లను సైతం ఆర్పేయాలి. బ్లాక్‌అవుట్ సమయంలో చేతిలోటార్చ్‌లు ఉన్నా.. వాటిని కూడా కాగితంతో కప్పివేస్తారు. అలాగే 75 శాతం వీధిలైట్లను పూర్తిగా ఆర్పేస్తారు. మిగతా వీధి దీపాల సామర్థ్యాన్ని కూడా చాలా వరకు తగ్గిస్తారు. షాపులు నిర్వహించే వాళ్లు, నివాస ప్రాంతాల్లోని వారు వెలుతూరు బయటకు రాకుండా కిటికీలు పెట్టడం, కర్టెన్లు మూయడం వంటివి చేయాల్సి ఉంటుంది. దీని వల్ల ఆ ప్రాంతమంతా పూర్తి చీకటిగా మారుతుంది.

**బ్లాక్‌అవుట్ వల్ల కల్గే లాభాలు..!**

శత్రువులు రాత్రి వేళల్లో పట్టణ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని వైమానికి దాడులకు పాల్పడుతుంటారు. అయితే వెలుతురు నిలిపివేస్తే, వారికి లక్ష్యాలు కనిపించకుండా ఉంటాయి. ఫలితంగా దాడులను నిరోధించవచ్చు. ఇది మాత్రమే కాకుండా శత్రుమూకలు ఉపగ్రహాల ద్వారా నగరాల చలనాలను గమనించే అవకాశం ఎక్కువగా ఉంది. ఇలాంటి సమయాల్లో బ్లాక్‌అవుట్ చేస్తే వారి పర్యవేక్షణకు తాత్కాలికంగా అడ్డుగోడ వేయొచ్చు. అలాగే తీవ్ర సంక్షోభ పరిస్థితుల్లో విద్యుత్ వనరులను ముఖ్య ప్రాంతాలకు పరిమితం చేయాల్సిన అవసరం వస్తుంది. అలాంటప్పుడు బ్లాక్‌అవుట్ చాలా బాగా ఉపయోగపడుతుంది. ఆధునిక యుద్ధాల్లో సిగ్నల్ జామింగ్, డ్రోన్ దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. అయితే ఇలాంటి దాడులు చేసే అవకాశం ఉన్నప్పుడు బ్లాక్‌అవుట్ చేస్తే సమర్థవంతమైన రక్షణ సాధ్యం అవుతుంది.అందుకే ప్రజల్లో భయాన్ని తగ్గించి.. మానసికంగా వారిని అన్నింటికీ సిద్ధం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ మాక్ డ్రిల్స్ నిర్వహించింది. దీని వల్ల ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి అనే దానిపై

## తహవ్వుర్ రాణా జ్యుడిషియల్ కస్టడీ పొడిగింపు

**న్యూఢిల్లీ-నవభూమి:** ముంబై ఉగ్రదాడుల (26/11) కేసులో ప్రధాన నిందితుడు తహవ్వుర్ రాణా జ్యుడిషియల్ కస్టడీని జూన్ 6వ తేదీ వరకూ పొడిగించారు. శుక్రవారంనాడు ఆయనను భారీ భద్రత మధ్య పాటియాలా హౌస్ కోర్టు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వైభవ్ కుమార్ ముందు హాజరుపరిచారు.వాయిస్, హ్యాండ్ రైటింగ్ నమూలాలు ఇచ్చేందుకు తహవ్వుర్ రాణా పూర్తిగా సహకరించినట్టు ఆయన తరపు లీగల్ ఎయిడ్ అడ్వకేట్ పీయూష్ సచ్‌దేవ్ కోర్టుకు తెలిపారు. ఎన్ఐఏ అభ్యర్థ మేరకు రాణా నుంచి ఈ శాంపుల్స్ తీసుకునేందుకు న్యాయమూర్తి చందర్ జిత్ సింగ్ సారథ్యంలోని ఎన్ఐఏ కోర్టు ఇటీవల ఆమోదం తెలిపింది.రాణాను విచారించేందుకు మరికొంత సమయం కావాలని ఎన్ఐఏ ఇటీవల కోరడంతో ఆయనను 12 రోజుల ఎన్ఐఏ కస్టడీకి కోర్టు అంగీకరించింది. 64 ఏళ్ల రాణాను 26/11 దాడుల కేసులో అమెరికా నుంచి ఇటీవల ఎన్ఐఏ టీమ్ భారత్ తీసుకువచ్చింది. అప్పట్నించి ఆయన న్యూఢిల్లీలోని ఎన్ఐఏ కస్టడీలో ఉన్నారు. పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తొయిబా ఉగ్రవాదులతో ఆయన సబంధాలు కొనసాగించినట్టు ఎన్ఐఏ ప్రధాన ఆరోపణగా ఉంది.

## జమ్మూకశ్మీర్‌లో పాక్ ఆర్టిలరీ దాడులు.. స్థానిక మహిళ మృతి



**జమ్ము కశ్మీర్:నవభూమి:** సామాన్య పౌరులే టార్గెట్‌గా పాకిస్థాన్ జమ్మూకశ్మీర్‌లోని ఉరీ సెక్టర్‌లో ఆర్టిలరీ దాడులకు తెగబడుతోంది. ఈ దాడుల్లో తాజాగా 45 ఏళ్ల మహిళ నర్గిస్ బానో మరణించగా ఆమె ఇద్దరు బంధువులు తీవ్ర గాయాపాలయ్యారు. పాక్ ఆర్టిలరీ షెల్ వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని తాకడంతో ఈ ఘోరం జరిగింది. పాక్ దాడుల నుంచి తప్పించుకునేందుకు ఆ కుటుంబం ఓ స్కార్పియో కారులో సురక్షిత ప్రాంతాలకు తరలివెళుతున్న సమయంలో ఈ దారుణం చోటుచేసుకుంది. తమ స్వగ్రామం రాజర్‌వానీకి మూడు కిలోమీటర్ల దూరంగా ఉండగా పాక్ భారీ ఎత్తున ఆర్టిలరీ షెల్లింగ్‌కు దిగిందని బాధితులు తెలిపారు.

పాక్ దాడులకు దీటుగా బదులిచ్చామని ఆర్మీ అధికారులు చెప్పారు. పాక్ తాజా ఆర్టిలరీ దాడిలో సామాన్య పౌరులు మరణించడం ఇదే తొలిసారి. గురువారం రాత్రి నుంచి పాకిస్థాన్ షెల్లింగ్‌కు దిగుతోందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. కాల్పులకు కాసేపు విరామం ఇచ్చినా శుక్రవారం ఉదయం కూడా ఆర్టిలరీ దాడులు కొనసాగాయని చెబుతున్నారు.కమాల్‌కోట్, బొనియార్, గింజిల్, మొహురా వంటి సరిహద్దు ప్రాంతాల్లో పాక్ భారీ ఎత్తున పౌరుల నివాసాలే టార్గెట్‌గా ఆర్టిలరీ దాడులకు దిగింది. అనేక ఇళ్లకు నష్టం జరిగింది.

## పాక్ 200 నిమిషాలపాటు దాడులు చేసింది: భారత్

**న్యూఢిల్లీ-నవభూమి:** పాకిస్థాన్ నిర్వహించిన దాడులపై భారత్ కీలక ప్రకటన చేసింది. 4 రాష్ట్రాల్లోని 24 ప్రాంతాలను టార్గెట్ చేసి పాకిస్థాన్ దాడులు చేసిందని చెప్పింది. ఇందుకోసం పాకిస్థాన్ 500 చిన్న డ్రోన్లను ఉపయోగించిందని పేర్కొంది.200 నిమిషాల పాటు ఈ దాడులు కొనసాగాయని భారత్ పేర్కొంది. 4 రాష్ట్రాల్లోని 24 ప్రాంతాలను టార్గెట్ చేసిన పాకిస్థాన్ .. మొత్తంగా 3 గంటల 20 నిమిషాల పాటు దాడి చేసిందని తెలిపింది. పాక్ టార్గెట్ చేసిన ప్రాంతాల్లో జమ్ము, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ ఉన్నాయని వెల్లడించింది. అయితే, పాక్ అన్ని డ్రోన్లను పూర్తిగా ధ్వంసం చేశామని భారత్ స్పష్టం చేసింది.పాకిస్తాన్ సాయుధ దళాలు 2025 మే 08, 09 తేదీల మధ్య రాత్రి మొత్తం పశ్చిమ సరిహద్దు వెంబడి డ్రోన్లు, ఇతర మందుగుండు సామగ్రిని ఉపయోగించి అనేక దాడులను ప్రారంభించాయని పేర్కొంది.

## భారత్ పాక్ ఉద్రిక్తతలు.. స్కూళ్లు, కాలేజీలు మూసివేత



**జమ్ము కశ్మీర్:నవభూమి:**పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన మెరుపు దాడులతో పాకిస్తాన్ వణికిపోయింది. ఆ తర్వాత సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఉల్లంఘించి విచక్షణా రహితంగా కాల్పులు జరుపుతోంది. సైనికులు, సరిహద్దు గ్రామాల ప్రజలే లక్ష్యంగా పాక్ సైన్యం కాల్పులకు దిగుతోంది. మరోవైపు.. జమ్మూ కాశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ వంటి సరిహద్దు రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకుని.. డ్రోన్లు, వైమానిక దాడులకు పాల్పడుతుండగా.. భారత డిఫెన్స్ వ్యవస్థ వాటిని అడ్డుకుంటోంది. మరోవైపు.. పాక్‌కు చెందిన పలు యుద్ధ విమానాలను కూడా భారత సైన్యం నేలకూల్చింది. దీంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ఢిల్లీ సహా సరిహద్దు రాష్ట్రాలు అలర్ట్ అయ్యాయి. ఢిల్లీ ప్రభుత్వం ఉద్యోగుల సెలవులు రద్దు చేసి భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. పాక్‌తో సరిహద్దు పంచుకుంటున్న రాష్ట్రాలైన పంజాబ్, జమ్మూ కాశ్మీర్, హర్యానా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్‌లలో స్కూళ్లు, కాలేజీలను మూసివేశారు. చండీగఢ్, శ్రీనగర్, అమృత్‌సర్ సహా మొత్తం 27 ఎయిర్‌పోర్టులు మూతపడటంతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే ఏవైనా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని రాష్ట్రాలు సిద్ధంగా ఉన్నాయి.ఢిల్లీలో హై అలర్ట్: ఈ క్రమంలోనే ఢిల్లీ పరిధిలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగుల సెలవులను సర్కార్ రద్దు చేసింది. నగరంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా మాల్స్, మార్కెట్లు, మెట్రో స్టేషన్లు, హోటళ్లు, రవాణా కేంద్రాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ఈస్ట్ ఢిల్లీ డీసీపీ అభిషేక్ ధనియా మాట్లాడుతూ.. మయూర్ విహార్ ఫేజ్-1 మెట్రో స్టేషన్‌లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించామని, సీఐఎస్ఎఫ్ సిబ్బందికి సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ఆ మెట్రో స్టేషన్‌లో 41 సీసీటీవీ కెమెరాలు నిరంతరం పనిచేస్తున్నాయని.. ప్రతి షిఫ్ట్‌లో ఇద్దరు మహిళా సిబ్బందితో సహా 9 మంది సీఐఎస్ఎఫ్ కానిస్టేబుళ్లు భద్రతను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు.బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లు నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాయి. ఇండియా గేట్ వద్ద ప్రజల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. అయితే ఇది సాధారణ ప్రక్రియ అని.. ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకే ఇలా చేశామని పోలీసులు స్పష్టం చేశారు. ప్రతి జిల్లా యంత్రాంగం ఆరోగ్య వ్యవస్థలు, విపత్తుల నిర్వహణపై అంతర్గత సమావేశాలు నిర్వహిస్తోంది.

**సరిహద్దు రాష్ట్రాల్లో ఆంక్షలు**

పాకిస్తాన్ డ్రోన్ దాడులకు పాల్పడిన నేపథ్యంలో పంజాబ్, జమ్మూ కాశ్మీర్, హర్యానా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్‌లలో విద్యా సంస్థలను మూసివేశారు. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్, బికానెర్, జోధ్‌పూర్, జైసల్మేర్, బార్మర్ వంటి సరిహద్దు జిల్లాల్లో పాఠశాలలు మూతపడ్డాయి. జమ్మూ కాశ్మీర్‌లో శుక్రవారం, శనివారాల్లో విద్యా సంస్థలు మూతపడగా.. తదుపరి నిర్ణయాన్ని సోమవారం తీసుకుంటామని అధికారులు తెలిపారు. పంజాబ్‌లో అన్ని పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలకు 3 రోజుల పాటు సెలవులు ప్రకటించారు. లడఖ్‌లోని లేహ్ ప్రాంతంలో 2 రోజుల పాటు పాఠశాలు నిలిపివేశారు. హర్యానాలో పంచ్‌కులతో సహా రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు మూతపడ్డాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనా జిల్లాలో విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు.

**విమాన రాకపోకలపై ప్రభావం**

కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం.. చండీగఢ్, శ్రీనగర్, అమృత్‌సర్, జోధ్‌పూర్, భుజ్, జమ్మూ వంటి 27 విమానాశ్రయాలను మూసివేశారు. విమానాశ్రయాల్లో భద్రతా తనిఖీలు పెరిగినందున ప్రయాణికులు ముందుగానే చేరుకోవాలని విమాయాన సంస్థలు సూచించాయి.

# భారత్‌పై దాడికి పాక్ ఎఫ్-16 యుద్ధ విమానాలను వాడొచ్చా..?



**జమ్ము కశ్మీర్:నవభూమి:**ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య పరిస్థితులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇరు దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు నెలకున్నాయి. గురువారం రాత్రి పాకిస్థాన్.. జమ్మూ, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ మీద దాడి చేసేందుకు యత్నించింది. అయితే భారత్ దాయాది దేశం కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టింది. భారత్‌తో జరుగుతోన్న సంఘర్షణల్లో.. తమ ఎయిర్‌ఫోర్స్ రెండు జేఎఫ్ 17 యుద్ధ విమానాలను కోల్పోయినట్లు పాకిస్థాన్ అధికారికంగా ప్రకటించింది. అయితే ఒక ఎఫ్-16 యుద్ధ విమానాన్ని సైతం ఇండియన్ ఆర్మీ నేలకూల్చిందని.. పైలట్‌ను బంధించిందని ప్రచారం జరుగుతోంది. దీంతో భారత్‌పై దాడి చేసేందుకు అమెరికా తయారీ ఎఫ్-16 యుద్ధ విమానాలను వాడేందుకు పాకిస్థాన్‌కు అనుమతి ఉందా? అనే ప్రశ్న తెర మీదకు వచ్చింది.

పాకిస్థాన్ ఎఫ్-16 యుద్ధ విమానాలను అమెరికా నుంచి కొనుగోలు చేసింది. అయితే వాటి వినియోగం, మార్పుల విషయంలో అమెరికా కఠినమైన నిబంధనలు విధించింది. వాషింగ్టన్.. ఈ యుద్ధవిమానాలను యూఎస్ ఫారిన్ మిలిటరీ సేల్స్ (ఎఫ్ఎంఎస్) కార్యక్రమం కింద పాకిస్థాన్‌కు విక్రయించింది. ఎండ్-యూజ్ మానిటరింగ్ (ఈయూఎం) ప్రకారం.. అమెరికా అనుమతి లేకుండా పాకిస్తాన్ ఈ యుద్ధవిమానాలను స్వేచ్ఛగా ఉపయోగించకూడదు, మార్చకూడదు. అంతేకాకుండా గోల్డెన్ సెంట్రీ, లాంతర్న్ వంటి కార్యక్రమాలలో భాగంగా అమెరికా బృందాలు పాకిస్థాన్‌లో ఉన్నాయి. అమెరికన్ టెక్నాలజీ దుర్వినియోగం కాకుండా చూడటమే వాటి విధి. ఈ బృందాలు విమానాలు, ఆయుధాల మోహరింపును నిత్యం పర్యవేక్షిస్తుంటాయి.

**అధికారిక నిబంధనలు ఏం చెబుతున్నాయి..**

ఈ ఒప్పందాల ప్రకారం, పాకిస్థాన్.. అమెరికా అనుమతి లేకుండా.. ఆ దేశం అభివృద్ధి చేసిన ఎఫ్-16 యుద్ధవిమానాలు, ఏఐఎం-120 ఆమ్రాం (ఏఎంఆర్ఏఏఎం) క్షిపణులను సంప్రదాయ యుద్ధంలో ఉపయోగించేందుకు అనుమతి లేదు. అంతేకాక పాకిస్థాన్.. ఈ విమానాలను ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలలో మాత్రమే ఉపయోగించాలి. ప్రత్యక్షంగా రెండు దేశాల మధ్య జరిగే పోరాటంలో వీటిని వినియోగించేందుకు పాక్‌కు అనుమతి లేదు. కాబట్టి, అమెరికా పత్రాలు ప్రత్యేకంగా భారతదేశం మీద వీటిని వినియోగించకూడదని స్పష్టంగా చెప్పకపోయినా సరే.. పాకిస్థాన్ ఎఫ్-16 ఫైటర్ జెట్లను యుద్ధం వంటి పరిస్థితుల్లో భారతదేశానికి వ్యతిరేకంగా ఉపయోగించకూడదు.పాక్ నియమాలను ఉల్లంఘిస్తే ఏం జరుగుతుంది..

పాకిస్తాన్ మళ్లీ ఎఫ్-16లను దుర్వినియోగం చేస్తే, అమెరికా దాయాది దేశానికి తన మద్దతును నిలిపివేయవచ్చు. లేదంటే మరో అడుగు ముందుకు వేసి.. పాక్‌తో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవచ్చు. ఈ యుద్ధవిమానాల మెయింటెనెన్స్, విడిభాగాల కోసం పాకిస్థాన్ అమెరికాపై ఆధారపడుతుంది. కాబట్టి ఒకవేళ అమెరికా ఈ ఒప్పందాన్ని రద్దు చేస్తే.. ఎఫ్-16 ఫైటర్ జెట్లను పాకిస్థాన్ ఉపయోగించడం కష్టం అవుతుంది. దీని ప్రభావం ఆ దేశ రక్షణ వ్యవస్థపై పడుతుంది.

2019లో ఏం జరిగిందంటే..

అయితే పాకిస్థాన్ అమెరికా అనుమతి లేకుండా 2019 బాలాకోట్ వైమానిక దాడుల సమయంలో ఎఫ్-16 యుద్ధ విమానాలను ఉపయోగించింది. దీంతో పాకిస్థాన్ ఎఫ్-16 ఒప్పందాన్ని ఉల్లంఘించిందని అమెరికా ఆరోపించింది. దీనికి సంబంధించి 2019 డిసెంబర్‌లో లీకైన పత్రాలను ఉటంకిస్తూ.. మీడియాలో కథనాలు వచ్చాయి. వాటి ప్రకారం.. ఎఫ్-16 యుద్ధ విమానాల అనధికారిక వినియోగంపై అమెరికా.. పాక్ మీద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందని మీడియా కథనాలు చెప్పుకొచ్చాయి.

అంతేకాక ఆగస్టు 2019లో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఏసీఎం ముజాహిద్ ఖాన్‌కు అమెరికా పంపిన మందలింపు లేఖన కూడా లీకైంది. ఎఫ్-16 యుద్ధ విమానాలను అనధికార స్థావరాలకు తరలించడం ద్వారా ఇస్లామాబాద్ "ఇరు దేశాల ఉమ్మడి భద్రతను ప్రమాదంలో పడేస్తోంది" అని అమెరికా తన లేఖలో.. పాక్‌ను ఘాటుగా మందలించిందని మీడియా తెలిపింది. దీన్ని బట్టి చూస్తే.. ఈ యుద్ధవిమానాల దుర్వినియోగాన్ని అమెరికా ఎంత తీవ్రంగా పరిగణిస్తుందో అర్థం అవుతుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4
హైదరాబాద్
శనివారం
10 ∣ మే ∣ 2025





## భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తత వేళ జమ్మూ నుంచి ఢిల్లీకి మూడు ప్రత్యేక రైళ్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్-పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితి క్రమంగా పెరుగుతోంది. ఇదే సమయంలో జమ్మూ ప్రాంతంలోని ప్రజల భద్రత కోసం భారత రైల్వే శాఖ అత్యవసర చర్యలు చేపట్టింది. జమ్మూ విమానాశ్రయం మూసివేయడం, సరిహద్దు జిల్లాల్లో యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో, జమ్మూ, ఉధమ్‌పూర్ నుంచి ఢిల్లీకి మూడు ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున జమ్మూ నగరంలో వినిపించిన బాంబు శబ్దాలు స్థానికుల్లో భయాందోళనలను రేకెత్తించాయి. ఈ ఘటనలు సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్తాన్ సైన్యం చేపట్టిన దాడులను భారత సైన్యం విఫలం చేసిన కొద్ది గంటల్లోనే చోటుచేసుకున్నాయి.శుక్రవారం తెల్లవారుజామున 3:50 నుంచి 4:45 గంటల మధ్య జమ్మూ నగరంలో దాదాపు శబ్దాలు వినిపించాయి. ఈ శబ్దాలతో పాటు సైరన్లు మోగడంతో నగరంలో ఒక్కసారిగా భయాందోళన వ్యాపించింది. ఈ ఘటనలు జరిగిన వెంటనే నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో అక్కడి స్థానికుల్లో ఆందోళన మరింత పెరిగింది. ఈ క్రమంలో సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోల్లో ఆకాశంలో కదులుతున్న వస్తువులు, వాటిని నిర్వీర్యం చేస్తున్నప్పుడు జరిగిన పేలుళ్ల దృశ్యాలు కనిపించాయి. భారత భద్రతా బలగాలు వెంటనే రంగంలోకి దిగి ఈ బెదిరింపులను తిప్పికొట్టాయి. ఈ ఘటనకు ముందు రాత్రి వేళల్లో పాకిస్తాన్ సైన్యం పూంచ్, రాజౌరి, జమ్మూ జిల్లాల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. భారత సైనిక స్థావరాలపై దాడులకు పాల్పడింది. ఈ క్రమంలో భారత సైన్యం దీటుగా స్పందించి, పాక్ దాడులను తిప్పికొట్టింది.

## పుస్తక పఠనంతోనే విద్యావికాసం

తెలుగు ప్రజలారా దయచేసి ఈ విషయాలను శ్రద్ధగా వినండి, ఆలోచించండి, చర్చించండి, ఉద్యమించండి. మనుషులందరినీ మాయ మబ్బులు కమ్మేశాయి. సెల్ ఫోన్ చీకటి కమ్మేసింది. చదువుల దుఃఖం మింగేసింది. వాట్సప్ మబ్బులు కమ్ముకున్నాయి. సోషల్ మీడియా అందరినీ ఊబిలోకి నెట్టేస్తోంది. దీనివల్ల మంచి మాట మాట్లాడుకునే పరిస్థితి లేదు. మంచి కథ చదువుకో బుద్ధి కాదు. మంచి పుస్తకం దరిచేరేదు. జీవితం ఆనందమయమైన కళలు, సాహిత్యం నుంచి దూరమైపోయింది.మాతృభాషను పరిరక్షించుకోవడంలో రెండు తెలుగు రాష్ట్రాలు అథమ స్థాయికి దిగజారిపోయాయి. తమిళనాడు వంటి రాష్ట్రాలు మాతృభాషను పరిరక్షించుకుంటూ పాఠశాలల్లో తప్పనిసరిగా ఈ భాషను నేర్పుకుంటూ, హిందీని వదిలించుకొని ద్విభాషా సూత్రాన్ని అమలు చేస్తున్నాయి. మాతృభాషలో ప్రాథమిక విద్యను తప్పనిసరిగా బోధించాల్సిన అవసరం ఉందని భాషాశాస్త్రవేత్తలు నెత్తి నోరూ బాదుకుంటున్నారు. కానీ తెలుగు రాష్ట్రాలు మాతృభాషలో బోధనను పక్కన పెట్టేసి, ఆంగ్ల భాషా మాధ్యమాన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టడం వల్ల సగం మంది పిల్లలు ఇంగ్లీషు చదవలేకపోతున్నారు. కాస్తో కూస్తో చదివే పిల్లలు అర్థం చేసుకోలేకపోతున్నారు. దీనితో విద్యార్థులు బడికి రావడం మానేస్తున్నారు. ఫలితంగా చదువుల వల్ల పిల్లలు ఆనందాన్ని కోల్పోతున్నారు. ఆలోచనను, విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతున్నారు. యాంత్రికంగా బట్టీ చదువుల మాయలో కొట్టుమిట్టాడుతున్నారు.క్రమశిక్షణ లేని విద్య నిరర్థకం. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి క్రమశిక్షణ అలవాటు చెయ్యాలి. అది విద్యార్థిని చదువుల వైపు ప్రేరేపిస్తుంది. నైతిక విలువలపై నిరంతరం అభ్యాసం జరుగుతూ ఉండాలి. క్రమశిక్షణకు విలువల విద్య తోడైతే పిల్లలు మరింతగా రాణిస్తారు. పాఠశాలల్లోనే క్రమశిక్షణ, నైతిక విలువలకు సంబంధించిన బోధన జరగాలి.తెలివైన పిల్లలకు చదువుకోవడానికి సమయం ఉండడం లేదు. విద్యావ్యవస్థలో ప్రధాన లోపాలలో గైడ్స్ వినియోగం ముఖ్యమైనది. ప్రతి తరగతిలోనూ గైళ్లను వాడుతున్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం పాఠశాలల్లో గైళ్లను ఉపయోగించకూడదు. ప్రైవేట్ స్కూళ్లలో మెటీరియల్ ఇచ్చి చదివిస్తారు. కాబట్టి గైళ్ల నుంచి రాసే చాకిరీ తప్పి పిల్లలకు చదువుకోవడానికి ఎక్కువ సమయం ఉంటుంది. అక్కడ ఎక్కువమంది పిల్లలు ఉత్తీర్ణులవుతున్నారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో గైళ్లలో ఉన్న విషయాన్ని యథాతథంగా ఎత్తి నోట్సులో రాయించడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. సరిగా చదవడం రాని పిల్లలకు గైళ్ళు చూసి రాయడం ఎంతో ఇబ్బంది. దీంతో నోట్సులు రాయలేక, భయంతో చాలామంది పిల్లలు బడి మానేస్తున్నారు. పదవ తరగతి పరీక్షలు పెద్ద ప్రహసనం. పిల్లల్ని పదవ తరగతి పాస్ చేయించడానికి సమాజంలో ప్రతి ఒక్కరు శతవిధాలా ప్రయత్నం చేస్తారు. పదవ తరగతి, ఇంటర్ రెండు సంవత్సరాలు ఎలాగోలా గట్టెక్కి ఎంసెట్లో ఎంత ర్యాంక్ వచ్చినా, ఏదో ఒక ఇంజనీరింగ్ కాలేజీలో ప్రభుత్వమే ఫీజులు కట్టి కొందరిని ఉచితంగా చదివిస్తుంది. అలా ఇంజనీరింగ్ అయిపోయిన తరువాత బయటపడిన విద్యార్థికి ఏ పనీ చెయ్యడం చేతకాదు, దాంతో ఏ ఉద్యోగమూ రాదు. పిల్లలు రెంటికీ చెడ్డ రేవడిగా తయారవుతున్నారు. వీళ్లు సమాజంపై కసి పెంచుకుని విద్రోహులుగా మారుతున్నారు. తమకు తామే అన్యాయం చేసుకుంటున్నారు.పాఠశాల%–%కళాశాల గ్రంథాలయాల్లో పిల్లలకు చదవడంపై ఇష్టం పెరగాలన్నా, చదివింది అవగాహన చేసుకోవాలన్నా, సాహిత్యం పరిచయం కావాలన్నా, స్వీయ అభ్యసనం పెరగాలన్నా, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి కావాలన్నా గ్రంథాలయాల అభివృద్ధి తప్పనిసరి. పుస్తకాల పఠనం తప్పనిసరి చెయ్యాలి. దీంతో పిల్లలు చదువుపై ఇష్టం పెంచుకుంటారు. చదవడం వచ్చిన పిల్లలు అవగాహన పెంచుకుంటారు. స్వీయ రచనా సామర్థ్యం పెరుగుతుంది. ఆలోచనాశక్తి పెరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీపడతారు. పుస్తక పఠనానికి పాఠశాల, కళాశాలలే ముఖ్య కేంద్రాలు. పాఠశాల గేటు దాటితే పిల్లల చేతుల్లోకి సెల్‌ఫోన్లు వస్తున్నాయి. దాంతో వారికి ఎవరి మాటా వినబడదు.పాఠశాలలో గ్రంథాలయాల నిర్వహణకు ప్రత్యేకంగా ఒక టీచర్ లేదా వాలంటీర్ ఉంటే ఆ గ్రంథాలయం సక్రమంగా నిర్వహించబడుతుంది. గ్రంథాలయంలోని పుస్తకాలు చదివితే పిల్లల్లో క్రమశిక్షణ విలువలు, విద్యావికాసం పెంపొందుతాయి. ఉపాధ్యాయులు చెయ్యలేని పనిని గ్రంథాలయం చెయ్యగలుగుతుంది. పుస్తకం ఇచ్చే చైతన్యం వెలకట్టలేనిది. చదవడం రాని పిల్లల్ని సైతం కథల పుస్తకాలు ప్రేరణ కలిగించి, చదువు నేర్చుకునేలా చేస్తాయి, ప్రాపంచిక జ్ఞానాన్ని పెంపొందిస్తాయి.పాఠశాలల్లో చదువు నేర్పడంలో ఇబ్బందులుంటే విద్యార్థులు ఉన్నతాధికారులకు తెలియజేయాలి. అన్ని స్థాయిల్లో అధికారులు పాఠశాలలను సందర్శించాలి. విద్యార్థుల చదువుల తీరును గమనించాలి. వాస్తవ స్థితిని తెలుసుకోవాలి. పాఠశాలల్లో విధానాలు ఎంత అధ్వానంగా ఉన్నాయి, విద్యావ్యవస్థ ఎంత లోపభూయిష్టంగా ఉంది. దీనిని ఏ విధంగా సరిచేసుకోవాలి అనే విషయాలపై మేధావులు, నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయులతో చర్చ జరగాలి. మార్పు కోసం అందరూ ప్రయత్నించాలి. నెమ్మదిగా శిథిలమైపోయిన వ్యవస్థను పునర్నిర్మించుకోవాలి. రెండు రాష్ట్రాలలో అనేక జిల్లాల్లో అద్భుతమైన పనితీరు ప్రదర్శించే పాఠశాలలు ఉన్నాయి. నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయులు ఉన్నారు. ఇలాంటి పాఠశాలల్ని, ఉపాధ్యాయుల్ని గుర్తించి వాళ్ళను ప్రోత్సహించాలి. వారు అమలు చేస్తున్న విధానాలను గుర్తించి, అన్ని పాఠశాలలకు ఆ విధానాలను విస్తరించాలి. ప్రతి విషయానికి ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ప్రజలు కూడా సమస్యలను పట్టించుకోవాలి. మేధావులు, విద్యావంతులు, సాహిత్యవేత్తలు, కళాకారులు, పారిశ్రామికవేత్తలు, సినిమా పరిశ్రమ, ఎన్ఆర్ఐలు సమాజంలో జరిగే అనర్థాలను పట్టించుకోవాలి.ఈ సమస్యల పరిష్కారానికి మరో గ్రంథాలయ ఉద్యమం రెండు తెలుగు రాష్ట్రాలలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రతి ఒక్కరూ తమ వంతుగా తాము చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేసుకోవాలి. తమ గ్రామంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడానికి సన్నద్ధం కావాలి.

# బానిస సంకెళ్లకు ఉరితాళ్లు - విప్లవ సింహాల గర్జన



### పీడిత ప్రజల పెను తిరుగుబాటు -స్వాతంత్ర్య సమర శంఖారావం

మొబైల్ ఫోన్లు లేని, వాట్సప్ జాడ లేని, ఇంటర్నెట్ ఊహకు కూడా అందని రోజుల్లో మీరట్ నుండి ఢిల్లీ వరకు ఒక మహా విప్లవం ఉప్పెనలా ఎగసింది! దుర్మార్గపు పాలకుల మోసాలు, నిరంకుశ దౌర్జన్యాలు, కుట్రపూరిత పన్నాగాలపై విసిగి వేసారిపోయిన ప్రజల గుండెల్లో విప్లవ జ్వాల రగిలింది! నరాలలో ప్రళయ రుధిరం ఉప్పొంగింది! బానిస సంకెళ్లను తెంచివేయడానికి, స్వేచ్ఛా భారతావనిని ఆవిష్కరించడానికి సింహాల్లా గర్జించడానికి ఎదురు చూస్తున్న ప్రజల ఆరాటమే ఈ పోరాటానికి పిలుపునిచ్చింది. ఆ పిలుపే 1857 మే 10న భగ్గుమన్న సిపాయుల తిరుగుబాటు ! ఇది కేవలం తిరుగుబాటు కాదు ! భారతదేశ ప్రథమ స్వాతంత్ర్య సమర శంఖారావం !

**దుర్మార్గపు పాలనకు చరమగీతం - రగిలిన ఆగ్రహ జ్వాలలు:**

1857 రాకమునుపే దుష్ట వలస పాలకులు ప్రజల ఆర్తనాదాలు, సమస్యలు పట్టించుకోకుండా కేవలం భారత సంపదను దోచుకోవడానికి కంకణం కట్టుకున్నారు. కంపెనీ స్థానిక ప్రజల జీవనాధారమైన కుల వృత్తులను తుంగలో తొక్కారు. మన ఎగుమతులపై పిడుగులాంటి పన్నులు, వారి దిగుమతులపై నామమాత్రపు పన్నులు విధించి దేశ ఆర్థిక వ్యవస్థను ఛిద్రం చేశారు. వారి దుర్మార్గపు ఆర్థిక దోపిడీ, వివక్షాపూరిత పాలన, నూతన భూస్వామ్య విధానాలు ప్రజలకు నరకం చూపించాయి. వారి దుర్నీతి సామాజిక విధానాలు కూడా విప్లవానికి ఊపిరి పోశాయి. పాశ్చాత్య విద్య, సంస్కృతిని బలవంతంగా రుద్దే ప్రయత్నం ప్రజలలో తీవ్రమైన పరాయీకరణ భావనను కలిగించింది. సాంస్కృతిక విధ్వంసం సృష్టించారు. మత మార్పిడులను ప్రోత్సహించారు. విదేశీ యుద్ధాల్లో భారతీయ సైనికులను బలిపశువులుగా వాడుకున్నారు. వేతనాలలో అమానవీయమైన తారతమ్యం చూపారు. భారతీయ సైనికులకు కనీసం పెన్షన్ కూడా లేదు. తమ హక్కులన్నీ కాలరాస్తున్నారన్న భావన పెరిగి ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఊగిపోయారు. అన్నింటా భారతీయుల కంటే యూరోపియన్లకే పట్టం కట్టారు. భూస్వామ్య దళారీలకు ఊడిగం చేస్తూ సామాన్య రైతుల ప్రయోజనాలను, హక్కులను కాలితో తన్నారు. రైతులను వారి భూముల నుండి తరిమికొట్టారు. దీంతో ప్రజలు




తమ భూమిని, వనరులపై తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించాలని ఉగ్రంగా పోరాడటానికి సిద్ధమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ రాబందులను నియమించి, దళారులు, వడ్డీ వ్యాపారులను పెంచి పోషించి, గిరిజన భూములను ఆక్రమించి, స్వదేశీ పరిశ్రమలను నేలమట్టం చేసి, పన్నుల భారం మోపి భూస్వాములకు, దళారులకే లాభం చేకూర్చే ఈస్టిండియా కంపెనీ దుర్మార్గపు పాలనను సహించలేక పాలనకు వ్యతిరేకంగా రైతులు, శ్రామికులు, గిరిజనులు, అన్ని మతాల ప్రజలు ఐక్యంగా తమను తాము కాపాడుకోవడానికి సాయుధ తిరుగుబాటుకు దిగారు. సన్యాసి తిరుగుబాటు, వెల్లూరు తిరుగుబాటు, పైకా తిరుగుబాటు వంటివి ఆ పోరాట స్ఫూర్తికి ప్రతీకలు. ఈ ప్రతిఘటన ఉద్యమాలలో వేర్వేరు ఆవేదనలు ఉన్నప్పటికీ వారందరిదీ ఒకే లక్ష్యం - బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి సమాధి కట్టడం! కంపెనీ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడానికి వారిని మరింతగా ప్రేరేపించాయి. కానీ 1857లో జరిగిన తిరుగుబాటు భారతదేశంలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో ఒక ప్రత్యేక అధ్యాయం. అది తాత్కాలికంగా విఫలమైనా స్వాతంత్ర్య పోరాటానికి తిరుగులేని పునాదులు వేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది - అదే మొదటి స్వాతంత్ర్య సంగ్రామం లేదా సిపాయిల విప్లవం!

**ఎన్‌ఫీల్డ్ తూటా - విప్లవానికి తక్షణ కారణం:**

వారి దుర్మార్గపు రాజ్య సంక్రమణ విధానం ఎన్నో స్వతంత్ర రాజ్యాలను కంపెనీ కబంధ హస్తాల్లోకి నెట్టింది. సతారా, నాగ్‌పూర్, ఝాన్సీ వంటి బలమైన రాజ్యాలు కూడా వారి దురాక్రమణకు గురయ్యాయి. అంతేకాదు, జైత్‌పూర్, సంబల్‌పూర్, ఉదయపూర్ రాజ్యాలను కూడా నిర్దాక్షిణ్యంగా విలీనం చేశారు. 1850లో హిందూ వారసత్వ చట్టాన్ని మార్చి, మతం మారిన వారికి కూడా ఆస్తులపై హక్కు కల్పించడం ప్రజల ఆగ్రహానికి హద్దులు లేకుండా చేసింది. భారతీయులందరినీ క్రైస్తవ మతంలోకి మార్చాలని దుష్ట ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ప్రజలు విశ్వసించారు. పాశ్చాత్య విద్యా విధానాన్ని బలవంతంగా రుద్దడం హిందువులతో పాటు ముస్లింల పవిత్ర ధర్మాన్ని అవమానించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, జమీందార్లు భూమిపై విధించిన భరించలేని పన్నులతో, కంపెనీ అనుసరించిన రక్తపిపాసి ఆదాయ సేకరణ పద్ధతులతో కుమిలిపోయారు. రుణదాతల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను కోల్పోయారు. పారిశ్రామిక విప్లవం పేరిట బ్రిటీష్ తయారీ వస్తువులు మన దేశాన్ని ముంచెత్తాయి. ఇది మన స్వదేశీ పరిశ్రమలను, ముఖ్యంగా వస్త్ర పరిశ్రమను పూర్తిగా నాశనం చేసింది. మన కళాకారులు బ్రిటన్‌లో యంత్రాలతో తయారైన చౌకబారు వస్తువులతో పోటీ పడలేక వీధిన పడ్డారు. బ్రిటీష్ దళాలలో 87% మంది భారతీయ సిపాయిలు ఉన్నప్పటికీ వారిని బ్రిటిష్ సైనికుల కంటే హీనంగా చూశారు. సిపాయిల వేతనాలలో అన్యాయమైన వ్యత్యాసం చూపారు. ఈ తిరుగుబాటుకు రాజకీయ, ఆర్థిక, సామాజిక, మతపరమైన కారణాలెన్నో ఉన్నప్పటికీ తక్షణ కారణం మాత్రం బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ 'ఎన్ఫీల్డ్ రైఫిల్స్' అనే మారణాయుధంలో ఆవు, పంది కొవ్వు పూసిన తూటాలను వాడటం. ఆ తూటాలను నోటితో కొరికి రైఫిళ్లలో నింపాల్సి రావడంతో హిందూ, ముస్లిం సిపాయిలు వాటిని వాడటానికి నిప్పులు చెరిగేలా నిరాకరించారు.

**మీరట్ నుండి ఢిల్లీకి - విప్లవ యాత్ర:**

1857 మార్చి 29న బారక్‌పూర్‌లోని సైనిక స్థావరంలో మంగళ్ పాండే అనే ధీరుడు ఎన్‌ఫీల్డ్ రైఫిల్‌ను ఉపయోగించడానికి నిరాకరించి తనపై అధికారిపై తిరుగుబాటు బావుటా ఎగరవేశాడు. మిగిలిన సిపాయిలు అతని ధైర్యానికి స్ఫూర్తి పొంది అతనికి అండగా నిలిచారు. కానీ, దుర్మార్గులైన బ్రిటిష్ పాలకులు అతనిని ఏప్రిల్ 8, 1857న ఉరితీశారు. 1857 మే 9న మీరట్‌లో ఎన్‌ఫీల్డ్ రైఫిల్‌ను ఉపయోగించేందుకు నిరాకరించిన 85 మంది సిపాయిల యూనిఫాంను తీసివేసి వారికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. ఈ అన్యాయానికి ఆగ్రహించిన సిపాయిలు 1857 మే 10న బ్రిటిష్ దుర్మార్గులకు వ్యతిరేకంగా మీరట్‌లో విప్లవం ప్రారంభించి ఢిల్లీ వైపు కదం తొక్కారు. 1857 మే 11న ఢిల్లీ ఎర్రకోటకు చేరుకొని బహదూర్ షాను చక్రవర్తిగా ప్రకటించారు.

**వీరనారుల పోరాటం - ధీరుల త్యాగం:**

లక్నోలో 1857 జూన్ 4న బేగం హజ్రత్ మహల్, 1857 జూన్ 5న కాన్పూర్‌లో నానా సాహెబ్, ఝాన్సీ, గ్వాలియర్లలో లక్ష్మీ బాయి మరియు తాంతియాతోపే, బరేలీలో ఖాన్ బహదూర్ ఖాన్, అలహాబాద్ , బనారస్‌లలో మౌల్వీ లియాకత్ అలీ, బీహార్‌లో కున్వర్ సింగ్ నాయకత్వాలలో స్వాతంత్ర్య పోరాటం ఉవ్వెత్తున సాగింది. ఎందరో వీరులు ప్రాణాలర్పించారు. మరెందరో జైళ్ల పాలయ్యారు. ఈ విప్లవం సుమారు సంవత్సరానికి పైగా కొనసాగింది. ఈ పోరాటంలో ముఖ్యంగా పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో రైతులు కంపెనీ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటులో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పాల్గొన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తొలి ప్రతిఘటనలో దేవీ చౌధురాణి పాల్గొనడం మహిళా శక్తిని చాటిచెబుతుంది.

**విఫలమైనా వెలిగించిన జ్యోతి - స్వాతంత్ర్యానికి తొలి అడుగు:**

పై తరగతి, మధ్యతరగతి పిరికి మేధావులు ఈ విప్లవానికి వెన్నుదన్నుగా నిలబడలేదు. హైదరాబాద్, మైసూర్, ట్రావెన్‌కోర్, కాశ్మీర్ వంటి పెద్ద రాచరిక రాష్ట్రాలు, చిన్న రాజపుతానా రాజ్యాలు ఈ పోరాటంలో భాగం పంచుకోలేదు. దక్షిణ ప్రాంతాలు దీనికి దూరంగా ఉండిపోయాయి. సమర్థవంతమైన నాయకత్వం కొరవడింది. తగినన్ని ఆర్థిక వనరులు లేకపోయాయి. చదువుకున్న బానిస మనస్తత్వం గల భారతీయులు ఈ విప్లవం భూస్వామ్య స్వభావానికి భయపడి ప్రేక్షక పాత్ర పోషించారు. బ్రిటిష్ కంపెనీ సైన్యం ఉపయోగించిన ఆధునిక మారణాయుధాల ముందు మన సిపాయిల సంప్రదాయ ఆయుధాలు ఏ మాత్రం నిలువలేకపోయాయి. చక్రవర్తిగా ప్రకటించిన బహదూర్ షా పోరాడే శక్తి లేని వృద్ధుడు కావడం కూడా ఒక కారణం. అనేక కారణాల వల్ల ఈ విప్లవం 1858 మధ్యలో దారుణంగా అణచివేయబడింది.

**అనంతర పరిణామాలు - స్వేచ్ఛా భారతం వైపు పయనం:**

ఈ విప్లవం భారత చరిత్రలో ఒక పెను తుఫానును సృష్టించింది. బ్రిటిషు దుర్మార్గులు ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనను రద్దు చేసి విక్టోరియా రాణి పాలనను ప్రవేశపెట్టారు. భారత పాలనా వ్యవహారాలను పర్యవేక్షించడానికి వైస్రాయిని నియమించారు. ఈ విధంగా భారతదేశం బ్రిటిషు సామ్రాజ్యవాదంలోకి కూరుకుపోయింది. కానీ, ఈ విప్లవం రగిలించిన స్వాతంత్ర్య కాంక్ష ఎందరో యోధులకు స్ఫూర్తినిచ్చింది. వారి పోరాట ఫలితంగానే 1947 ఆగస్ట్ 15న మనకు స్వేచ్ఛ లభించింది. ఆనాటి విప్లవకారుల త్యాగం ఎప్పటికీ మరువలేనిది!

జై హింద్!

**(సిపాయిల తిరుగుబాటు మే 10న సందర్భంగా)**

**కింజరాపు అమరావతి**
**82472 86357**


# భారత తయారీ రంగ భవితకు 'ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం' ఊతం :



భారతదేశ ఆర్థిక వ్యవస్థ స్వయం సమృద్ధి సాధించాలన్నా, ప్రపంచ తయారీ పటంలో సుస్థిర స్థానాన్ని పదిలపరుచుకోవాలన్నా పటిష్టమైన దేశీయ తయారీ రంగం అత్యంత కీలకం. ప్రస్తుత ప్రపంచ వాణిజ్య వాతావరణంలో వస్తున్న మార్పులు, సరఫరా గొలుసుల వైవిధ్యీకరణ అవకాశాలను భారతదేశానికి అందిస్తున్నాయి. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం 2020లో ప్రారంభించిన 'ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం' (పీఎల్ఐ) ఒక వినూత్నమైన, శక్తివంతమైన పారిశ్రామిక విధానంగా నిలుస్తోంది. ఇది కీలకమైన పరిశ్రమలలో ఆవిష్కరణ, సామర్థ్యం, పోటీతత్వాన్ని ప్రోత్సహిస్తూ భారతదేశాన్ని ప్రపంచ తయారీ శక్తి కేంద్రంగా స్థాపించాలనే ప్రభుత్వ వ్యూహానికి మూలస్తంభం. నిర్దిష్ట ఉత్పత్తుల అమ్మకాల పెరుగుదల ఆధారంగా ఆర్థిక ప్రోత్సాహకాలను అందించే ఈ పథకం, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం, భారీ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపుదల ద్వారా ప్రపంచ సరఫరా గొలుసులలో భారతదేశ స్థానాన్ని బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మారుతున్న ప్రపంచ భౌగోళిక, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఈ పథకం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

**లక్ష్యాలు - విస్తరణ ఆకాంక్ష:**

పీఎల్ఐ పథకం వెనుక బహుముఖ, దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాలున్నాయి. దేశీయ, విదేశీ పెట్టుబడుల ఆకర్షణతో పాటు, దిగుమతులను తగ్గించి, అధిక విలువ కలిగిన ఎగుమతులను ప్రోత్సహించడం ద్వారా వాణిజ్య లోటును నియంత్రించడం ప్రధాన లక్ష్యం. పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన బదిలీ సులభతరం చేయడం కూడా ఇందులో ఉన్నాయి. ?1.97 లక్షల కోట్ల గణనీయమైన కేటాయింపులతో, పీఎల్ఐ పథకం దేశంలోని 14 కీలక రంగాలను కవర్ చేస్తుంది. దేశీయ ఉత్పత్తిని బలోపేతం చేయడం, సాంకేతిక సామర్థ్యాలను పెంచడం, ప్రపంచ మార్కెట్లలో భారతదేశ స్థానాన్ని మెరుగుపరచడం వంటి జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా ఈ రంగాలను వ్యూహాత్మకంగా




ఎంపిక చేశారు.

**తొలి ఫలితాలు - గణాంకాల పరిశీలన**

అమలు ప్రారంభించిన తొలి దశలో పీఎల్ఐ పథకం వివిధ రంగాలలో స్పష్టమైన ఫలితాలను చూపడం ప్రారంభించింది. పథకం కింద నమోదైన కంపెనీల నుండి ఆగస్టు 2024 నాటికి ?1.46 లక్షల కోట్ల వాస్తవ పెట్టుబడులు వచ్చాయి. ఈ పెట్టుబడులు ప్రత్యక్షంగా ?12.50 లక్షల కోట్ల అదనపు ఉత్పత్తి, అమ్మకాలకు దారితీశాయి. సుమారు 9.5 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడ్డాయి, ఇవి సమీప భవిష్యత్‌లో 12 లక్షలకు పెరిగే అవకాశం ఉంది. ఎలక్ట్రానిక్స్, ఫార్మా వంటి రంగాల నుండి ఎగుమతులు ?4 లక్షల కోట్లను దాటడం, భారత ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లో పెరుగుతున్న ఆదరణను సూచిస్తుంది. మొబైల్ తయారీ వంటి రంగాలలో కేవలం మూడేళ్లలో 20% దేశీయ విలువ జోడింపు పెరగడం గమనార్హం, ఇది తయారీ లోతు పెంపు దిశగా ఒక ప్రోత్సాహకరమైన సూచన.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల

**సంస్కరణలు - ఆకర్షణ:**

పీఎల్ఐకి మద్దతుగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్డీఐ) విధానాన్ని సరళీకరించడం పథకం విజయానికి ముఖ్య కారణాలలో ఒకటి. చాలా తయారీ రంగాలలో 100% ఎఫ్డీఐకి ఆటోమేటిక్ మార్గం అనుమతించడం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను గణనీయంగా మెరుగుపరిచింది. 2014-2024 దశాబ్దంలో తయారీ రంగంలో ఎఫ్డీఐ ఈక్విటీ ఇన్‌ఫ్లోలు 165 బిలియన్ అమెరికన్ డాలర్లకు పెరిగాయి, ఇది అంతకు ముందు దశాబ్దంతో పోలిస్తే 69% పెరుగుదల. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధాన వాతావరణం, క్రమబద్ధీకరించిన ఆమోద ప్రక్రియలతో, భారతదేశం పెట్టుబడులకు మరింత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా నిలుస్తుంది.

**రంగావారీగా కార్యతీరు పరిశీలన:**

పీఎల్ఐ ప్రభావం వివిధ రంగాలపై విలక్షణంగా ఉంది. ఎలక్ట్రానిక్స్ తయారీలో, ముఖ్యంగా మొబైల్ ఫోన్లలో, భారతదేశం నికర దిగుమతిదారు నుండి నికర ఎగుమతిదారుగా రూపాంతరం చెందింది. యాపిల్ వంటి కంపెనీలు ఇక్కడ తయారీని విస్తరించాయి. దేశీయ ఉత్పత్తి, ఎగుమతులు గణనీయంగా పెరిగాయి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి 254% వృద్ధి చెందింది. ఫార్మాస్యూటికల్స్ రంగంలో భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్దదిగా నిలిచింది, ప్రపంచ ఔషధశాలగా మారుతోంది. ఎగుమతులు ఉత్పత్తిలో 50% వాటా కలిగి ఉన్నాయి, కీలకమైన బల్క్ ఔషధాల తయారీ ద్వారా దిగుమతులపై ఆధారపడటం తగ్గింది. ఆటోమోటివ్ పీఎల్ఐ పథకం ?67,690 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, ముఖ్యంగా విద్యుత్ వాహనాలు, వాటి విడిభాగాల తయారీకి ఊతమిచ్చింది. పునరుత్పాదక శక్తి రంగంలో, సౌర ఫోటో వోల్టాయిక్ తయారీ సామర్థ్యం ?4,500 కోట్ల మొదటి దశ, 19,500 కోట్ల రెండవ దశ కేటాయింపులతో వేగవంతమైంది, ఇంధన భద్రతకు ఇది కీలకం. టెలికాం ఉత్పత్తులలో, పథకం కింద 60% దిగుమతి ప్రత్యామ్నాయం సాధించబడింది, గ్లోబల్ టెక్ కంపెనీలు తయారీ యూనిట్లు స్థాపించాయి, భారతదేశాన్ని 4జీ, 5జీ పరికరాల ఎగుమతిదారుగా మార్చాయి. డ్రోన్ల రంగం వేగంగా వృద్ధి సాధించింది, టర్నోవర్ ఏడు రెట్లు పెరిగింది, స్టార్టప్‌లు పెట్టుబడులను, ఉద్యోగ సృష్టిని ఆకర్షించాయి, మన దేశాన్ని డ్రోన్ తయారీలో ప్రపంచ అగ్రగామిగా నిలుపుతున్నాయి.

**సవాళ్లు - భవిష్యత్ మార్గం:**

పీఎల్ఐ పథకం విజయవంతంగా దూసుకుపోతున్నప్పటికీ ప్రగతిని నిలకడగా కొనసాగించడానికి కొన్ని అంశాలపై దృష్టి సారించాలి. ప్రోత్సాహకాల పంపిణీ ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా జరగాలి. పథకం ప్రయోజనాలు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) కూడా విస్తృతంగా అందేలా చూడాలి. నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ లేకుండా, అంతర్జాతీయ మార్కెట్లలో "మేడ్ ఇన్ ఇండియా" ఉత్పత్తులకు గుర్తింపు తీసుకురావాలి. పరిశోధన మరియు అభివృద్ధికి పెద్దపీట వేయడం ద్వారా కేవలం తయారీ కేంద్రంగా కాకుండా, ఆవిష్కరణల కేంద్రంగా కూడా భారతదేశం ఎదగాలి. పథకం కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా పరిశ్రమలు తమంతట తాముగా నిలదొక్కుకుని, ప్రపంచ మార్కెట్లో పోటీపడేలా సామర్థ్యాన్ని పెంచడంపై దీర్ఘకాలిక వ్యూహం అవసరం.


**ప్రభుత్వ భవిష్యత్ దృష్టి:**

రాబోయే సంవత్సరాల్లో దేశీయ విలువ జోడింపును పెంచడంపై ప్రధాన దృష్టి సారించారు. పూర్తిస్థాయి తయారీ కార్యకలాపాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. విద్యుత్ వాహనాల బ్యాటరీ తయారీ, హరిత హైడ్రోజన్, సెమీకండక్టర్లు వంటి భవిష్యత్ సాంకేతికతలకు ప్రోత్సాహం పెంచే దిశగా చర్చలు జరుగుతున్నాయి. కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ పీఎల్ఐ పథకాల ద్వారా తయారీ రంగంలో ?20 లక్షల కోట్ల అదనపు ఉత్పత్తిని, రాబోయే ఐదేళ్లలో 40 లక్షల ఉద్యోగాలను సృష్టించాలని ఆశిస్తున్నట్లు పేర్కొంది.

**ముందుకు పోవాలి:**


పీఎల్ఐ పథకం భారత తయారీ రంగానికి ఒక నూతన దిశానిర్దేశం చేసింది. ఇది కేవలం ఆర్థిక ప్రోత్సాహకం మాత్రమే కాదు, దేశ పారిశ్రామిక భవిష్యత్తును తీర్చిదిద్దే ఒక వ్యూహాత్మక పెట్టుబడి. ప్రారంభ ఫలితాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, దాని దీర్ఘకాలిక విజయం అనేది అమలులోని అడ్డంకులను పరిష్కరించడం, ఎంఎస్ఎంఈలను చేర్చడం, లోతైన స్వదేశీకరణ, పరిశోధన అభివృద్ధిని ప్రోత్సహించడం, నిజమైన పోటీతత్వ వాతావరణాన్ని పెంపొందించడంపై ఆధారపడి ఉంటుంది. ఈ కీలక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లయితే, పీఎల్ఐ పథకం భారతదేశ తయారీ రంగ పునరుజ్జీవానికి నిజమైన చోదక శక్తిగా, 'ఆత్మనిర్భర్ భారత్' ఆశయాన్ని నెరవేర్చడంలో కీలకమైన స్తంభంగా నిలిచే అవకాశం ఉంది.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**



# పుష్కర సరస్వతి

భక్తి



నదులను దేవతలుగా భావించి, పూజించే సంస్కృతి మనది. మన జీవన అవసరాలను తీర్చే నదులకు కృతజ్ఞతలు తెలుపుకొనే సంప్రదాయాన్ని పుష్కరాల రూపంలో పూర్వులు నిర్దేశించారు. తదనుగుణంగా ఒక్కొక్క రాశిలో బృహస్పతి ప్రవేశించినప్పుడు... ఒక్కొక్క నదికి పుష్కరాలు జరుగుతాయి. పన్నెండు ప్రధాన నదులకు... పన్నెండేళ్ళకు ఒక్కోసారి పుష్కరాలు వస్తాయి. ఆ పుష్కర నదుల్లో సరస్వతి ఒకటి. మిగిలిన నదుల్లా కాకుండా అంతర్వాహినిగా ప్రవహించడం ఈ నది ప్రత్యేకత. ఋగ్వేదంలో, పురాణాల్లో సరస్వతీ నది ప్రస్తావన ప్రముఖంగా ఉంది. పవిత్రమైన సప్త నదుల్లోనూ సరస్వతికి విశిష్ట స్థానం ఉంది. అందుకే, స్నానం చేసినప్పుడు... గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతీ... నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు... అంటూ ఈ నదులను తలచుకోవడం పుణ్యప్రదమని చెప్పారు పెద్దలు. బృహస్పతి మిధున రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీ నదికి పుష్కరాలు వస్తాయి. ఈ ఏడాది మే 15 నుంచి 26వ తేదీ వరకూ పన్నెండు రోజుల పాటు సరస్వతీ నదికి పుష్కరాలు జరగబోతున్నాయి.

ఎక్కడ?: సరస్వతీ నది పుట్టిన చోటుగా పరిగణించే ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని బదరీనాథ్ సమీపంలో ఉన్న మానా గ్రామంలో పుష్కర స్నానాల కోసం ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సరస్వతీ నది... అలకనంద నదికి ఉపనది. కేశవ ప్రయాగ దగ్గర అలకనందలో కలుస్తుందంటారు. అలాగే సరస్వతీ నది అంతర్వాహినిగా... ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో, గుజరాత్‌లోని సోమనాథలోని త్రివేణీ సంగమాల్లో, రాజస్థాన్‌లోని పుష్కర్‌లో కలుస్తుందనే విశ్వాసం ఉంది. ఆ ప్రాంతాల్లో కూడా పుష్కరాలను నిర్వహిస్తున్నారు.కాళేశ్వరంలో ప్రతిష్ఠాత్మకంగా...తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం... సరస్వతీ నది పుష్కరాలకు సిద్ధమవుతోంది. గోదావరి, ప్రాణహిత నదులతో సరస్వతి కలిసే త్రివేణీ సంగమంలో పుష్కర స్నానాల కోసం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 15 నుంచి 26 వరకు జరిగే పుష్కరాల్లో భాగంగా... శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో నిత్యం వివిధ హెూమాలను నిర్వహిస్తారు. అలాగే ప్రధాన ఘాట్ వద్ద నదీ హారతి కార్యక్రమం ఉంటుంది. శ్రీ మాధవానంద సరస్వతి, శ్రీ పరిపూర్ణానంద స్వామి, శ్రీ సచ్చిదానంద సరస్వతి, శ్రీ విద్యాశంకర భారతి, ఆచార్య సంవిదానంద సరస్వతి మహరాజ్, శ్రీ జగద్గురు విద్యారణ్య భారతి, శ్రీ యోగానంద సరస్వతి తదితర ఆధ్యాత్మిక ప్రముఖులు ఈ పుష్కరాలకు హాజరై ప్రార్థనలు చేస్తారు, అనుగ్రహభాషణలు చేసి, భక్తులకు ఆశీస్సులు అందజేస్తారు. పుష్కరాల కోసం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలతో సహా పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ మహా సరస్వతి అమ్మవారి ఆలయం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంతో పాటు సమీప ఆలయాల సందర్శించుకోవచ్చు.

## పంజాబీ రెసిపీ... చనా మసాలా



కావాల్సిన పదార్థాలు..కాబూలీ శెనగలు - రెండున్నర కప్పు, టమాట ముక్కలు - మూడు కప్పులు, పచ్చిమిర్చి - నాలుగు, అల్లం తరుగు - అర స్పూను, వెల్లుల్లి తరుగు - రెండు టీస్పూనులు, పసుపు - ఒక టీస్పూను, కొత్తిమీర పొడి - రెండు టీస్పూనులు, జీలకర్ర పొడి - రెండు టీస్పూనులు, కారం - ఒక టీస్పూను, గరం మసాలా - ఒక టీస్పూను, ఉల్లిపాయ - రెండు, ఉప్పు - రుచికి తగినంత, నూనె - సరిపడినంత

తయారు చేసే విధానం..కాబూలీ శెనగల్ని రాత్రంతా నీటిలో నానబెట్టాలి. ఉదయాన నీళ్ల వంపేసి పక్కన పెట్టాలి. స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేసి వేడి చేయాలి. అందులో ఉల్లిపాయల ముక్కలు వేసి వేయించాలి. అందులో అల్లం, వెల్లుల్లి తరుగు వేసి వేయించాలి. అవి బాగా వేగాక టమోటా ముక్కల్ని, కొత్తిమీర పొడి, పసుపు, జీలకర్ర పొడి, కారం వేసి బాగా కలపాలి. వీటిని బాగా ఉడికించాలి. బాగా వేగితే ఆయిల్ పైకి తేలుతుంది. అప్పుడు ముందుగా నానబెట్టిన కాబూలీ శెనగల్ని వేసి కలపాలి. రెండున్నర కప్పులు నీళ్ల కూడా వేయాలి. ఉప్పు వేసి, కాస్త కొత్తిమీర ఆకులు చల్లి మూత పెట్టేయాలి. ఓ పావుగంట సేపు ఉడకనివ్వాలి. మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి.పావుగంట ఉడికాక అందులో గరం మసాలా వేసి బాగా కలపాలి. మళ్లీ మూత పెట్టేసి చిన్న మంట మీద మూడు నిమిషాల పాటూ ఉడకనివ్వాలి. మూత తీసి ఒకసారి బాగా కలపాలి. శెనగలు ఉడికాయో లేదో చూసుకోవాలి. ఉడకకపోతే మరికాసేపు చిన్నమంట మీద ఉడికించాలి. కావాలనుంటే పైన కొత్తిమీర మళ్లీ చల్లుకోవచ్చు. అంతే చనా మసాలా సిద్ధమైనట్టే.

## మొక్కలు ఎండిపోకుండా ఉండాలంటే ఏ సమయంలో నీరు పెట్టాలో తెలుసా?

వేసవిలో అధిక వేడి కారణంగా మొక్కలు చాలా ప్రభావితమవుతాయి. అయితే, ఎండాకాలంలో మొక్కలకు నీరు పెట్టే సమయం చాలా ముఖ్యం. టైమ్ కానీ టైమ్‌లో మొక్కలకు నీరు పెడితే అవి చనిపోయే ప్రమాదం ఉంది. ఉదయం, మధ్యాహ్నం లేదా సాయంత్రం, ఎండాకాలంలో మొక్కలు ఎండిపోకుండా ఉండాలంటే ఏ సమయంలో నీరు పెట్టాలో తెలుసా?

ఈ రోజుల్లో చాలా మందికి గార్డెనింగ్ అంటే ఇష్టం. మొక్కల్ని పెంచడంలో చాలా కేర్ తీసుకుంటున్నారు. అయితే, ఎండాకాలం మొక్కల్ని చూసుకోవడం చాలా కష్టంతో కూడుకున్న పని. ఎండలకి మనుషులే కాదు మొక్కలు కూడా అల్లాడిపోతాయి. ఎండల దెబ్బకి మొక్కలు ఎండిపోతాయి. ఇప్పటికే చాలా మొక్కలు ఎండిపోవడం ప్రారంభించాయి. అందుకే మొక్కల్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం.



వేసవిలో అధిక వేడి కారణంగా మొక్కలు చాలా ప్రభావితమవుతాయి. అయితే, ఎండాకాలంలో మొక్కలకు నీరు పెట్టే సమయం చాలా ముఖ్యం. టైమ్ కానీ టైమ్‌లో మొక్కలకు నీరు పెడితే అవి చనిపోయే ప్రమాదం ఉంది. వేసవికాలంలో ఏ సమయంలో మొక్కలకు నీరు పెట్టాలో ఇప్పుడు తెలుసుకుందాం.

టర్మ్ ఇన్సూరెన్స్ - ఉచిత కోట్ పొందండి

మధ్యాహ్నం నీరు పోస్తే

మధ్యాహ్నం లేదా సూర్యుడు ఉదయించిన తర్వాత మొక్కలకు నీరు పోస్తే, వాటి ఆకులు, వేర్లు దెబ్బతినే ప్రమాదముంది. దీంతో, మొక్కలు ఎండిపోతాయని నిపుణులు అంటున్నారు.

- అంతేకాకుండా సూర్యాస్తమయం తర్వాత వెంటనే నీరు పోసినా మొక్కలకు ప్రమాదం. అవి ఇంకా దెబ్బతింటాయి. సూర్యస్తమయం తర్వాత వెంటనే నీరు పెట్టవద్దు.

- మొక్కల వేర్లు, నేల, ఆకులు చల్లబడటానికి కాస్త సమయం ఇవ్వండి. సాయంత్రం ఐదు గంటలకు సూర్యుడు మొక్కల పై కప్పు నుంచి దూరంగా ఉంటే.. సాయంత్రంలో ఆరు గంటల ప్రాంతంలో నీరు పెట్టాలి. అప్పుడు అయితే నేల, మొక్కల ఆకులు, వేర్లు చల్లబడి ఉంటాయి.

### నీరు పెట్టడానికి బెస్ట్ టైమ్

మొక్కలకు నీరు పెట్టడానికి ఉత్తమ సమయం సూర్యోదయానికి ముందు. ఈ సమయంలో నేల చల్లగా ఉంటుంది. సూర్యోదయానికి ముందు మొక్కలు నీటిని పీల్చుకోవడానికి మంచి సమయం లభిస్తుంది. ఉదయం నీరు పెట్టడం వల్ల మొక్కలు బాగా తేమగా ఉండి, రోజంతా వేడిని, సూర్యరశ్మిని తట్టుకుం టాయి. ఉదయం నీరు పోయలేకపోతే, సాయంత్రం నేల చల్లబడిన తర్వాత నీరు పెట్టండి.ఈ విషయాలు గుర్తించుకోండి



- మొక్కలకు నీరు పోసేటప్పుడు, వాటి స్వభావం గురించి కచ్చితంగా తెలుసుకోవాలి.

లి ఉదాహరణకు, కొన్ని మొక్కలకు ఎక్కువ నీరు అవసరం అయితే మరికొన్ని మొక్కలకు తక్కువ అవసరం.

లి బౌగెన్‌విల్లా మొక్కలు తక్కువ నీటిలో ఎక్కువగా పెరుగుతాయి. అలాంటి పరిస్థితుల్లో నీళ్ల పోసే ముందు నేలను తనిఖీ చేయండి. నేల తేమగా ఉంటే నీళ్ల పోయకండి. అయితే, అది ఎండిపోయి ఉండే ఉదయం, సాయంత్రం రెండు పూటలా నీరు పోయవచ్చు.

లి అధిక సూర్యకాంతి లేదా ఎండలు ఉన్నప్పుడు నీరు మాత్రం మొక్కలకు పెట్టకండి. ఎక్కువ నీరు ఇస్తే మొక్కలకు హాని కలుగుతుంది. దీనివల్ల మొక్క చనిపోయే ప్రమాదం కూడా ఉంది. ఎండాకాలంలో ఇంకొన్ని చిట్కాలు పాటిస్తే మొక్కలు ఎండిపోవు. ఆ చిట్కాలేంటో తెలుసుకుందాం.

**-మొక్కలకు పించింగ్**

-పించింగ్ అంటే మొక్కల పై భాగంలో కత్తిరించడం. ఎండాకాలంలో మొక్కలను కట్ చేయడం మంచిది. ఇలా కట్ చేయడం వల్ల కలిగే ప్రయోజనం ఏంటంటే.. మొక్క కొత్త కొమ్మల్ని అభివృద్ధి చేస్తుంది. అంతేకాకుండా మొగ్గలు కూడా సమయానికి కనిపిస్తాయి. మొక్కను కత్తిరించడం వల్ల అది బాగా పెరుగుతుంది.

-మొక్కలకు చల్లదనం

-వేసవిలో తీవ్రమైన సూర్యకాంతి కారణంగా, మొక్కలు తరచుగా వాడిపోతాయి లేదా ఎండిపోతాయి. మొక్కల పెరుగుదలకు సూర్యరశ్మి చాలా అవసరం. అయితే, ఎక్కువ సూర్యరశ్మి వల్ల మొక్కలకు హాని కలుగుతుంది.



అందుకే మొక్కల్ని తక్కువ సూర్యరశ్మి పడే ప్రాంతాల్లో ఉంచండి. లేదంటే మొక్కలను రక్షించడానికి ఒక షెడ్ నిర్మించవచ్చు. షెడ్ కూడా తక్కువ సూర్యరశ్మి పడేలా ఉండాలి.

**-ఎరువులు ముఖ్యం**

-మొక్కల పెరుగుదలకు ఎరువులు వాడాలి. ఎరువులు వాడటం వల్ల మొక్కలు వేగంగా పెరుగుతాయి. పూలు కూడా బాగా వికసిస్తాయి. ఎరువు మొక్కలకు అవసరమైన పోషణను అందిస్తుంది. మొక్కను నాటేటప్పుడు, నేలను కూడా జాగ్రత్తగా చూసుకోండి. కొద్ది రోజుల తర్వాత కుండీలోని మట్టిని మార్చండి. మట్టితో ఆవు పేడను కలపండి. నేల ఎక్కువ కాలం తడిగా ఉండటానికి కుండలో ఎండిన ఆకుల్ని ఉంచండి. ఈ ఆకులు ఎరువుల రూపంలో మొక్కల పెరుగుదలకు సాయపడతాయి.



## 40 డిగ్రీల ఎండలు ఉన్నా సరే పెరుగు పుల్లగా మారదు,



ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుకున్నారు. రోజు రోజుకి ఎండలు మండిపోతున్నాయి. ఎండలు దెబ్బకి ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇక, ఎండల ఎఫెక్ట్‌తో ఆహారాలు కూడా త్వరగా పాడవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రత కారణంగా పొద్దున చేసిన కూరలు, వంటలు మధ్యాహ్నం సమయానికి పాడైపోతున్నాయి. దీంతో, ఎండాకాలం ఆహారం భద్రపర్చడం సవాల్‌తో కూడుకున్న పని. ఇక, వేసవిలో చాలా మంది పెరుగు తినడానికి ఇష్టపడతారు.

పెరుగు చల్లటి స్వభావం కలిగి ఉంటుంది. వేడి వాతావరణానికి కమ్మటి పెరుగుతో తినాలని ఎవరికి ఉండదు. అయితే, ఎండల కారణంగా పెరుగు కూడా పుల్లగా మారిపోతుంది. దీంతో, చాలా మంది పుల్లటి పెరుగు తినడానికి అనాసక్తి చూపుతున్నారు. మనం చేసే కొన్ని తప్పుల వల్ల ఇంట్లో చేసిన పెరుగు కూడా పుల్లగా మారిపోతుంది. ఇక, బయట నుంచి తెచ్చిన పెరుగు కొన్ని గంటలకే పుల్లగా మారిపోతుంది. అయితే, ఉప్పు ఉపయోగించి పెరుగు చెడిపోకుండా లేదా పుల్లగా మారకుండా నిరోధించవచ్చు. ఆ సాల్ట్ ట్రిక్ ఏంటో తెలుసుకుందాం.

### ఎండల వేడికి పెరుగు పుల్లగా

నిజానికి, పెరుగును ఎక్కువసేపు బయట ఉంచడం వల్ల.. ఎండల వేడి కారణంగా బ్యాక్టీరియా పెరుగుతుంది. దీనివల్ల పెరుగు త్వరగా చెడిపోతుంది. చిక్కగా, క్రీమీగా ఉండే పెరుగును తయారుచేసినప్పుడల్లా , దానిని నిల్వ చేయడానికి వెంటనే రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. అదే సమయంలో, పెరుగును ప్లాస్టిక్ పాత్రల్లో ఉంచకండి. గ్లాస్ లేదా సిరామిక్ పాత్రల్లో పెరుగు తోడబెడితే చాలా మంచిది.

ఉప్పుమండే ఎండల్లో పెరుగు పుల్లగా మారకుండా ఉప్పు నిరోధిస్తుంది. ఉప్పు సంరక్షణకారిగా పనిచేస్తుంది. దీనివల్ల బ్యాక్టీరియా పెరుగుదల ఆగిపోతుంది.ఇందుకోసం పెరుగు తోడుకున్న తర్వాత చిటికెడు ఉప్పు కలపండి. దీంతో పెరుగు పుల్లగా మారదు. అంతేకాకుండా పెరుగు రుచి కూడా పెరుగుతుంది. అయితే, ఒక్క విషయం గుర్తించుకోవాలి. అయితే, ఎక్కువ ఉప్పు వాడటం మంచిది కాదు. చిటికెడు ఉప్పు మాత్రమే వాడాలని గుర్తించుకోండి.

### పెరుగు తోడుబెట్టడానికి బెస్ట్ టైమ్

పెరుగును తప్పు సమయంలో తోడు పెట్టడం వల్ల పుల్లగా మారుతుంది. చాలా మంది ఉదయం సమయంలో పెరుగు తోడుపెడతారు. అయితే, ఇది కరెక్ట్ సమయం కాదని నిపుణులు అంటున్నారు. ఈ సమయంలో తోడు పెడితే పెరుగు చిక్కగా ఉండదు. నీటిని విడుదల చేస్తుంది. అందుకే రాత్రి పూట పెరుగు తోడుపెట్టడం మంచి సమయం అంటున్నారు నిపుణులు. ఉదయం పూట అది ఘనీభవించినప్పుడు.. నిల్వ చేయడానికి కొన్ని గంటలు ఫ్రిజ్‌లో ఉంచండి. దీని వల్ల పెరుగు రుచి పుల్లగా మారదు.

### సరైన ఉష్ణోగ్రత ముఖ్యం

వేసవి కాలంలో, పెరుగు త్వరగా గట్టిపడుతుంది కానీ చాలా త్వరగా పుల్లగా మారుతుంది. ఉష్ణోగ్రత స్థిరంగా ఉండే ప్రదేశంలో పెరుగును ఉంచండి. వంటగదిలో చల్లని మూలలో లేదా వేడి ప్రభావం ఎక్కువగా లేని ఏదైనా ప్రదేశంలో తోడబెట్టిన పెరుగును ఉంచండి. సాధారణంగా పెరుగు గట్టిపడటానికి 6 నుంచి 8 గంటలు పడుతుంది. పెరుగు గట్టిపడినప్పుడు, దానిని ఫ్రిజ్‌లో ఉంచండి. ఎందుకంటే పెరుగును ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల పెరుగు పుల్లగా మారదు.

### ఈ విషయాలు ముఖ్యం

చాలా మంది పెరుగును స్టోర్ చేసేటప్పుడు దానిపై మూత లేకుండా ఫ్రిజ్‌లో పెడతారు. ఇలా మూత పెట్టకపోవడం వల్ల పెరుగు పుల్లగా మారుతుంది. అందుకే పెరుగుపై మూత పెట్టి ఫ్రిజ్‌లో స్టోర్ చేయండి.

1.6 డిగ్రీల నుంచి 4.4 డిగ్రీల సెంటిగ్రేడ్ మధ్య ఫ్రిజ్‌లో గాలి చొరబడని కంటైనర్‌లో పెరుగును నిల్వ చేయండి. ఇలా చేయడం వల్ల ఎక్కువ కాలం పాటు పెరుగు తాజాగా ఉంటుంది.

పెరుగు ప్యాకెట్ కొనేటప్పుడు దాని మీద గడువు తేదీ చెక్ చేసుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే పెరుగు పరిమిత షెల్ఫ్ జీవితాన్ని కలిగి ఉంటుంది.

## బియ్యం నీళ్లు చేసే అద్భుతం..



శిరోజాల రాలడం, చుండ్రు వంటి సమస్యలకు బియ్యం నీళ్లు మంచి పరిష్కారంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఫెర్మెంటెడ్ బియ్యం నీటిని వారానికి రెండుసార్లు ఉపయోగిస్తే కురులు ఆరోగ్యంగా, ఒత్తుగా పెరుగుతాయని సూచిస్తున్నారు.

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ... శిరోజాలు రాలడం, అవి నిర్జీవంగా మారడం, వాటి చివర్లు చిట్లడం, చుండ్రు లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని నివారించేందుకు బియ్యం నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఇలా తయారు చేసుకోవాలి...

ఒక గిన్నెలో ఒక కప్పు బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడగాలి. వెంటనే రెండు కప్పుల నీళ్ల పోసి అరగంటసేపు నానబెట్టాలి. తరవాత ఈ నీటిని మరో గిన్నెలోకి వడకట్టాలి.

బియ్యాన్ని నీటిలో రెండు రోజులు నానబెడితే ఆ నీటిని 'ఫెర్మెంటెడ్ వాటర్' అంటారు. ఈ నీళ్లు మాడుకు, శిరోజాలకు అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. ఫెర్మెంటెడ్ వాటర్‌ను ఫ్రిజ్‌లో వారంపాటు నిల్వ చేసుకోవచ్చు.

బియ్యం నీటిలో లావెండర్ లేదా రోజ్‌మేరీ ఆయిల్ చుక్కలు వేసుకుంటే ఫలితం బాగుంటుంది.

బియ్యం నీళ్లలో బి, ఇ విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

ఇలా వాడాలి...

ముందుగా శిరోజాలను కుంకుళ్లు లేదా గాఢత తక్కువగా ఉన్న షాంపూతో శుభ్రం చేసుకోవాలి. తలను కొద్దిగా ఆరనివ్వాలి. తరవాత బియ్యం నీటిని చేత్తో తీసుకుంటూ కురులకు, మాడుకు పట్టించాలి. బియ్యం నీటిని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తలంతా చిలకరించుకోవచ్చు. అయిదు నిమిషాల తరవాత తలను వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావుగంటసేపు ఆరనిచ్చి మంచినీళ్లతో తలను శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

నాలుగేళ్ల తన పిల్లాడికి ఆటిజమ్ అని తెలిసి తల్లడిల్లిపోయింది. కొడుకు కోసం ఎంతో శ్రమపడింది. అతడిలా బాధపడుతున్న మరికొంతమంది పిల్లలకు తల్లయింది. వారందరి కోసం తన ఉద్యోగాన్ని వదిలేసి... ఆటిజమ్ కేంద్రాన్ని నెలకొల్పిన శ్రీనగర్ టీచరమ్మ కుల్సుమా సేవా పథం ఇది...

## అమ్మగా ఆ వేదన తెలుసు!



"అబ్బాయి పుట్టాడని ఆనందపడేలోపే విధి మా జీవితాలను తలకిందులు చేసింది. మేం కన్న కలలన్నీ మాయమైపోయాయి. ఎంతగొప్పగా ఊహిచుకున్నాం.. వాడి భవిష్యత్తుని! పిల్లాడైతే పెరుగుతున్నాడు కానీ... మానసికంగా పరిపక్వత మాత్రం సాధించలేకపోతున్నాడు. ఇది మమ్మల్ని కలచివేసింది. వాడికి నాలుగేళ్లు వచ్చాయి. చెప్పింది అర్థం చేసుకోలేకపోతున్నాడు. వాడంతట వాడు ఏ పనీ చేసుకోలేకపోతున్నాడు. వాడిలో వాడు బిగ్గరగా నవ్వుకొంటున్నాడు. అంతలోనే ఏడుస్తున్నాడు. శ్రీనగర్ మా స్వస్థలం. మా అబ్బాయి ఫర్మాన్‌ను స్థానిక వైద్యులకు చూపించినా ఎలాంటి ఫలితం కనిపించలేదు. దీంతో ఢిల్లీకి వెళ్లి అక్కడి ఓ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో డాక్టర్లను సంప్రతించాం. వాళ్లు 'ఆటిజమ్'గా నిర్ధరించారు.

**ఢిల్లీ చుట్టూ ఆరేళ్లు...**

ఫర్మాన్ చికిత్స కోసం తరచూ కశ్మీర్ నుంచి ఢిల్లీ వెళ్లివచ్చేదాన్ని. అలా ఆరేళ్లు తిరిగాను. అదే సమయంలో నేను కూడా ఆటిజమ్‌పై క్రాష్ కోర్స్ ఒకటి చేశాను. ఆక్యుపేషనల్, స్పీచ్ థెరపీల్లో శిక్షణ తీసుకున్నాను. గురుగ్రామ్‌లో ఆటిజమ్‌పై జరిగిన అనేక వర్క్‌షాపుల్లో పాల్గొన్నాను. పలు సంస్థల్లో వాలంటీర్‌గా పని చేసి, అనుభవం గడించాను. ఇవన్నీ ఇంటి దగ్గర మా అబ్బాయిని జాగ్రత్తగా చూసుకోవడానికి. ఢిల్లీలో చికిత్స తరువాత వాడిని ఇంటికి తీసుకువచ్చాం. అయితే లోయలో ఆటిజమ్ కేంద్రమే లేదు. ఆరా తీస్తే ఫర్మాన్‌లాంటి పిల్లలు మా ప్రాంతంలో చాలామందే ఉన్నారని తెలిసింది.

మావాడి కోసం...నేనైతే మా అబ్బాయిని ఢిల్లీకి తీసుకువెళ్లి చికిత్స చేయించాను. వాడి కోసమే ఆటిజమ్ కోర్స్ కూడా చదివాను. కనుక వాడిని ఎలా చూసుకోవాలో... అలాంటి పిల్లల ప్రవర్తన ఎలా ఉంటుందో నాకు తెలుసు. అది అందరు తల్లితండ్రులకూ సాధ్యం కాదు కదా! మరి వాళ్ల పరిస్థితి ఏంటి? ఈ ఆలోచనతోనే శ్రీనగర్‌లోని బెమినా ప్రాంతంలో 'ఎక్సెప్షనల్ మైండ్స్' పేరిట ఆటిజమ్ సెంటర్ ఒకటి నెలకొల్పాను. దాంతోపాటు మూడేళ్ల కిందట స్కూల్ కూడా ప్రారంభించాను. ఇప్పుడు ఫర్మాన్‌కు పదహారేళ్లు. వాడితోపాటు మరో ఇరవై మంది పిల్లలున్నారు. నాకు మా అబ్బాయి ఎంతో... మిగిలినవారు కూడా అంతే! వీళ్లందరినీ చూసుకోవడానికి నా టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేశాను. ఇప్పుడు ఈ కేంద్రంలో నాతోపాటు మరొక మహిళ కూడా సేవలందిస్తున్నారు.

**ముందుగానే గుర్తిస్తే...**

పిల్లల్లో ఆటిజమ్ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే... వారిలో మార్పు తీసుకురావచ్చు. విద్య, పునరావాసం ద్వారా ప్రత్యేక లక్షణాలుగల పిల్లల సాధికారతే నా లక్ష్యం. మా కేంద్రంలో కొంతమంది పిల్లలు ఆటిజమ్‌తో పాటు నరాల సంబంధిత రుగ్మతలతో కూడా ఇబ్బంది పడుతున్నారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని మా దగ్గర బిహేవియరల్, ఆక్యుపేషన్, స్పీచ్, లాంగ్వేజ్, ఓరల్ ప్లేస్‌మెంట్, ఫిజియో, మ్యూజిక్- ఆర్ట్ థెరపీలు అందిస్తున్నాం. వీటివల్ల వారిలో మానసిక పరివర్తన వస్తుంది. స్నానం చేయడం, డ్రెస్‌లు వేసుకోవడం, తినడంలాంటి పనులు వేరొకరి సాయం లేకుండా వారే చేసుకోగలుగుతారు. వారి కోసమే...ఈ పునరావాస కేంద్రం కోసం ఒక భవనం అద్దెకు తీసుకున్నాం. పిల్లల్ని చూసుకోవడానికి కొంతమందిని నియమించాం. కేంద్రానికి వచ్చే పిల్లల తల్లితండ్రుల నుంచి నామమాత్రపు ఫీజు వసూలు చేస్తున్నాం. ఆ మొత్తాన్ని భవనం అద్దె, స్టాఫ్ జీతాలకు వెచ్చిస్తున్నాం. అయితే స్కూల్‌లో సేవలకు ఫీజు తీసుకోవడంలేదు. ప్రభుత్వం నుంచి గానీ, కార్పొరేట్ సంస్థల నుంచి గానీ మాకు ఎలాంటి సహకారం లేదు. దాని కోసం నేను ఎదురుచూడను. దీని నిర్వహణకు మావారు డబ్బు సమకూరుస్తున్నారు. తల్లితండ్రులను నేను కోరేది ఒక్కటే... ఒకవేళ మీ పిల్లలకు ఆటిజమ్ అని తెలిస్తే, వారిని తక్కువ చేసి చూడవద్దు. ఒక భారంగా భావించకుండా... ప్రేమను పంచండి. వాళ్లు ప్రత్యేకమైన పిల్లలు... కనుక వారిపై ప్రత్యేక శ్రద్ధ కూడా అవసరమని మరువకండి.

# సరిహద్దుల్లో ఉద్రిక్తతలు.. భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..!



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో శుక్రవారం స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. జమ్మూ, పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌లపై దాడికి విఫల ప్రయత్నాలను భారత్ విజయవంతంగా తిప్పికొట్టింది. ఈ క్రమంలో శుక్రవారం మార్కెట్లు భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. గత సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 78,968.34 వద్ద నష్టాల్లో మొదలైంది. సెన్సెక్స్ ప్రారంభంలోనే 400 పాయింట్లు పతనమైంది. ప్రస్తుతం సెన్సెక్స్ 800 పాయింట్ల నష్టంతో 79,533.84 పాయింట్ల వద్ద కొనసాగుతున్నది. మరో వైపు నిఫ్టీ 260.8 పాయింట్లు తగ్గి 24,013 పాయింట్ల వద్ద కదలాడుతున్నది. మార్కెట్‌లో దాదాపు 555 షేర్లు లాభపడగా.. 2618 షేర్లు నష్టపోయాయి. మరో 109 షేర్లు మాత్రం మారలేదు. నిఫ్టీలో టైటాన్, లార్సెన్, భారత్ ఎలక్ట్రికల్, టాటా మోటార్స్, హీరో మోటోకార్ప్, ఎస్‌బీఐ, ఏషియన్ పేయింట్స్, ఓఎన్‌జీసీ, విప్రో లాభపడ్డాయి. జియో ఫైనాన్షియల్, ట్రెంట్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఎన్‌టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎటర్నల్, గ్రాసిమ్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత లాభం25 శాతం పెరిగి రూ.5,497 కోట్లకు చేరుకున్నట్లు లార్సెన్ అండ్ టూబ్రో నివేదించిన తర్వాత 4 శాతానికిపైగా పెరిగింది. టైటాన్ కంపెనీ కూడా 4 శాతానికి పైగా పెరిగింది. మార్చి త్రైమాసికంలో టాటా గ్రూప్ సంస్థ ఏకీకృత లాభంలో 13 శాతం పెరిగినట్లు తెలిపింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు గురువారం రూ.2,007.96 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారని ఎక్స్ఛేంజ్ డేటా తెలిపింది.




# రూపాయికి చిల్లులు.. 81 పైసలు పడిపోయిన విలువ



**ముంబై- నవభూమి:** దేశీయ కరెన్సీకు మరిన్ని చిల్లులు పడ్డాయి. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటుండటంతో దేశీయ కరెన్సీ భీకర నష్టాల్లోకి జారుకున్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 81 పైసలు నష్టపోయి 85.58 వద్ద ముగిసింది. గడిచిన రెండేండ్లలో ఒకేరోజు ఇంతటి స్థాయిలో పతనం చెందడం ఇదే తొలిసారి.ఇరు దేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటుండటం ఫారెక్స్ మార్కెట్లో అలజడి సృష్టించిందని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. 84.61 వద్ద ప్రారంభమైన డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు ఇంట్రాడేలో 84.52 నుంచి 85.77 శ్రేణిల్లో కదలాడింది. చివరకు ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 81 పైసలు కోల్పోయి 85.58 వద్ద ముగిసింది. సెప్టెంబర్ 22, 2022న పడిపోయిన 83 పైసల తర్వాత ఇదే రెండో అతిపెద్ద పతనం.

# ఏఐ స్థితిస్థాపకత భారతీయ కార్పొరేట్ వ్యూహాలకు మార్గదర్శకం




**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయులు అల్లకల్లోలం నుండి బయటపడటమే కాకుండా, ఆ పరిస్థితుల్లో కూడా అభివృద్ధి చెందడానికి వ్యవస్థలను సమర్థవంతంగా నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఫ్రాస్ట్ -సుల్లివన్ సహకారంతో ఐసిఐసిఐ లోంబార్డ్ అభివృద్ధి చేసిన కార్పొరేట్ రిస్క్ ఇండెక్స్ ఆఫ్ ఇండియా 2024 యొక్క ఐదవ ఎడిషన్ తాజాగా విడుదలైంది. దీని ప్రకారం, భారతీయ కంపెనీలు రిస్క్ నిర్వహణలో తమ విధానాన్ని మెరుగుపర్చినట్లు వెల్లడైంది. 2023 లో CIRI స్కోర్ 64 ఉండగా, 2024 లో అది 65 కు పెరిగినట్లు ఈ నివేదిక వెల్లడించింది. ఈ పెరుగుదల, భౌగోళిక రాజకీయ అస్థిరత, ఆర్థిక మందగమనం, AI వల్ల కలిగే అంతరాయం మరియు జాతీయ ఎన్నికలకు సన్నాహాలతో సహా అంతర్గత అనిశ్చితి పట్ల కంపెనీలు ఎలా స్పందిస్తున్నాయనే అంశంలో విస్తృత పరివర్తనను ప్రతిబింబిస్తుంది.సందీప్ గోరాడియా-చీఫ్ కార్పొరేట్ సొల్యూషన్స్, ఇంటర్నేషనల్, బాంకష్యూరెన్స్, ICICI లోంబార్డ్ ఇలా అన్నారు: ఈ సంవత్సరం ఫలితాలు స్పష్టంగా చూపిస్తున్నట్లుగా, భారతీయ కంపెనీలు ఇకపై రిస్క్‌లకు కేవలం ప్రతిస్పందించడం కాకుండా, వాటిని సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయి. కార్పొరేట్ ఇండియా రిస్క్ ఇండెక్స్ ద్వారా ప్రదర్శించిన మెరుగుదల ఈ పురోగతిని స్పష్టం చేస్తోంది. సవాళ్లు పెరుగుతున్నప్పటికీ, ఈ వృద్ధి ధోరణి బలమైన రిస్క్ తగ్గించే ఫ్రేమ్‌వర్క్‌ల వైపు చురుకైన మార్పును ప్రతిబింబిస్తుంది. దీర్ఘకాలిక స్థితిస్థాపకత వైపు మార్పును చూస్తున్నాము, ఇక్కడ , సుస్థిరత మరియు డిజిటల్ చురుకుదనం ఇప్పుడు కార్పొరేట్ వ్యూహానికి పునాదిగా నిలుస్తున్నాయి. లాంబార్డ్‌లో, ప్రభావవంతమైన రిస్క్ గవర్నెన్స్ కేవలం సమ్మతి ప్రక్రియ మాత్రమే కాదు, అది స్థిరమైన వృద్ధికి దోహదపడుతుందని మేము విశ్వసిస్తున్నాము. ఈ మార్గంలో భారతీయ కంపెనీలు మరింత బలంగా ముందుకువెళ్తున్నాయి."ఈ మార్పుకు అనుగుణంగా, 2024లో తొమ్మిది పరిశ్రమలు 'సుపీరియర్ రిస్క్ ఇండెక్స్' హోదాను సాధించడం ద్వారా భారతీయ కార్పొరేషన్లు వివిధ రంగాలలో మాత్రమే కాకుండా, వాటిలో రాణించడంలో కూడా విజయం సాధించాయి. ముఖ్యంగా ఫార్మాస్యూటికల్, హెల్త్, బిఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ మరియు ఇన్సూరెన్స్) మరియు తయారీ రంగాలు, తమ ప్రాథమిక వ్యూహాలలో స్థితిస్థాపకతను చేర్చి, అస్థిరతను పరివర్తనకు అవకాశంగా మలుచుకోవడంలో కీలకపాత్ర పోషించాయి. %AI%ని స్వీకరించడం, సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేయడం మరియు సుస్థిరత కార్యక్రమాలు ప్రమాద నిర్వహణ వ్యూహాల రూపకల్పనలో ప్రధాన ఇతివృత్తాలుగా ముందుకు వచ్చాయి. జాతీయ ఎన్నికలు, భౌగోళిక రాజకీయ అస్థిరత, సుంకాల యుద్ధాలు, చమురు ధరల గ్లోబల్ మార్పులు మరియు తీవ్రమైన బహిర్గతం వంటి బాహ్య ఒత్తిళ్ల మధ్య కూడా, కార్పొరేట్ ఇండియా తన ప్రమాద నిర్వహణ దృక్పథంలో మరింత ముందస్తు ప్రణాళిక, క్రమశిక్షణ మరియు భవిష్యత్తుపై దృష్టి సారిస్తూ, సాధారణ స్థితిస్థాపకతలో గణనీయమైన మెరుగుదలను ప్రదర్శించింది.

# భారత్, పాకిస్తాన్ ఉద్రిక్తత వేళ.. దేశంలో నిత్యావసరాలపై కీలక ప్రకటన



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుతం భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో దేశంలో నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాలని చూస్తున్న వారికి, స్టోర్ చేసుకోవాలనుకునే వారికి కేంద్రం కీలక సూచనలు జారీ చేసింది. కూరగాయలు, పప్పులు సహా ఇతర అత్యవసరాల ధరలు, నిల్వ ప్రస్తుతం సాధారణ స్థితిలో ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు.

**ప్రభుత్వం హామీ:** భారత్‌లో కూరగాయలు, కాయ ధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువుల స్టాక్‌లు సమృద్ధిగా ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలో ఆయా వస్తువుల సరఫరా అన్ని నగరాల్లో క్రమం తప్పకుండా కొనసాగుతోందన్నారు. రవాణా వ్యవస్థలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చూసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అధికారుల ప్రకారం, రాష్ట్రాల మధ్య ఆహార పదార్థాల రవాణా సాఫీగా జరుగుతోందని, ఇదే సమయంలో నగరాలకు రోజువారీ సరఫరా యథావిధిగా అందుతోందని చెప్పారు.

ఈ నేపథ్యంలో ప్రజలు ఆహారం లేదా రోజువారీ వినియోగ వస్తువులను అధిక మొత్తంలో కొనుగోలు చేసి నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. సరఫరా వ్యవస్థలో స్థిరత్వం ఉండేలా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. ఈ హామీతో, ప్రజలు భయాందోళనలకు లేకుండా సాధారణ జీవనం కొనసాగించవచ్చని ప్రభుత్వం సూచించింది. పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

**ధరల నియంత్రణపై దృష్టి:** ఈ సమయాన్ని ఆసరగా చూసుకుని పలువురు వ్యాపారులు లేదా సరఫరాదారులు అక్రమంగా ధరలు పెంచడం లేదా వస్తువులను నిల్వ చేయడం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో అనవసర భయాందోళనలు, తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే ప్రయత్నాలను కూడా అడ్డుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యాపారులు, సరఫరాదారులపై నిశితంగా నిఘా ఉంచాలని సూచించారు.అన్యాయంగా పెంచితే..ఎవరైనా ధరలను అన్యాయంగా పెంచడం లేదా స్టాక్‌లను దాచడం వంటి చర్యలకు పాల్పడితే, కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ సమావేశాల ద్వారా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం పెరిగి, సరఫరా వ్యవస్థలో స్థిరత్వం నిర్వహించడం సులభతరం అవుతుందని భావిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన ఫిర్యాదు వేదికల ద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చని అధికారులు తెలిపారు.

# ఉద్రిక్త పరిస్థితుల వేళ, భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. రూ.7 లక్షల కోట్లు మటాష్

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో స్టాక్ మార్కెట్ సూచీలు వారాంతంలో శుక్రవారం (మే 9న) భారీ నష్టాలను చవిచూశాయి. ఈ నేపథ్యంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ 880 పాయింట్లు క్షీణించగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 266 పాయింట్లు నష్టపోయింది. ఈ కుప్పకూలిన మార్కెట్‌లో మదుపర్లు కొన్ని గంటల్లోనే లక్షల కోట్ల రూపాయల సంపదను కోల్పోయారు. ఈ ఘటన దేశీయ, అంతర్జాతీయ ఇన్వెస్టర్లలో ఆందోళనను రేకెత్తించింది.

ఏప్రిల్ 2025లో జమ్మూ కశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ దాడిలో 26 మంది మరణించగా, 20 మందికి పైగా గాయపడ్డారు. రెసిస్టెన్స్ ఫ్రంట్ ఈ దాడికి బాధ్యత వహించినట్లు ప్రకటించింది. ఆ తర్వాత నియంత్రణ రేఖ వెంబడి ఇరు దేశాల మధ్య సాయుధ ఘర్షణలు జరిగాయి, ఇది రెండు అణ్వాయుధ శక్తుల మధ్య పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ భౌగోళిక రాజకీయ అనిశ్చితి మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. దీంతో ఇన్వెస్టర్లు సురక్షిత ఆస్తుల వైపు మళ్లడంతో స్టాక్ మార్కెట్ ఒత్తిడికి గురైంది.

సెన్సెక్స్, నిఫ్టీ పతనం..మే 9, 2025న ఉదయం మార్కెట్ ట్రేడింగ్ ప్రారంభమైన కొద్ది గంటల్లోనే సెన్సెక్స్ 900 పాయింట్లకు పైగా క్షీణించింది. ఈరోజు ముగిసే సమయానికి సెన్సెక్స్ 880 పాయింట్ల నష్టంతో 79,919 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 266 పాయింట్లు కోల్పోయి 24,168 వద్ద స్థిరపడింది. ఈ నష్టాలు బ్యాంకింగ్, ఐటీ, మెటల్, ఆటోమొబైల్ రంగాల్లో భారీ అమ్మకాల వల్ల సంభవించాయి. ఈ క్రమంలో నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 4% కంటే ఎక్కువ క్షీణించగా, బ్యాంక్ నిఫ్టీ 3% నష్టపోయింది. దీంతో మార్కెట్లు ఒక్క రోజులోనే రూ. 7 లక్షల కోట్లకు పైగా మదుపర్ల సంపదను ఆవిరి చేశాయి. మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 403 లక్షల కోట్లకు దిగజారింది.

ఈ భారీ నష్టాలకు అనేక కారణాలు ఉన్నాయి. ప్రధానంగా భారత్-పాకిస్తాన్ మధ్య సైనిక ఘర్షణలు, దౌత్యపరమైన సంక్షోభం ఇన్వెస్టర్లలో భయాందోళనలను రేకెత్తించాయి. దీంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లలో కూడా ప్రతికూల సంకేతాలు కనిపించాయి. అమెరికా మార్కెట్లు డోజోన్స్ ఇండెక్స్ 400 పాయింట్ల క్షీణతతో ముగియడం ఆసియా మార్కెట్లపై ప్రభావం చూపింది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన అమెరికా విధించిన సుంకాలు కూడా భారత ఎగుమతి రంగంపై ఒత్తిడిని పెంచాయి.

# సొంతంగా వ్యాపారం చేయాలా



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలోని ప్రజల స్వయం ఉపాధి కలను నెరవేర్చడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ముద్రా యోజన పథకాన్ని అమలు చేస్తోంది. సొంతంగా వ్యాపారం చేసుకోవాలనుకునే వారికి ఈ పథకం కింద రూ. 50,000 నుంచి 20 లక్షల రూపాయల వరకు రుణం ఇస్తున్నారు. ఎలాంటి హామీ లేకుండా ఈ లోన్ మంజూరు చేస్తున్నారు. పీఎం ముద్రా యోజన కింద 10 ఏళ్లలో రూ. 33 లక్షల కోట్ల రుణాలు ఇచ్చారు. ఈ పథకం కింద మహిళలకు ప్రత్యేక రాయితీలు ఉంటాయి. ముద్రా కార్డ్ అనే డెబిట్ కార్డ్ ద్వారా లబ్ధిదారుడు తమ లోన్ ఖాతా నుంచి అవసరమైనప్పుడు డబ్బు తీసుకోవచ్చు. ప్రధానమంత్రి ముద్రా యోజన పథకానికి అర్హతలు, దరఖాస్తు విధానం, ఇతర పూర్తి వివరాలు..

సొంతంగా వ్యాపారం చేయాలా.. రూ.50 వేల నుంచి 20 లక్షల వరకు లోన్.. ఇలా అప్లై చేసుకోండి

అంశాలు:ప్రధానమంత్రి ముద్రా యోజన అంటే ఏమిటి?

ముద్రా కార్డు అంటే ఏమిటి?

ప్రధానమంత్రి ముద్రా యోజన కింద ఎంత రుణం లభిస్తుంది?

పీఎం ముద్రా యోజన కింద రుణం పొందడానికి అర్హతలు ఏమిటి?

ముద్రా లోన్ ఆన్‌లైన్ దరఖాస్తు విధానం:

ప్రధానమంత్రి ముద్రా యోజన కోసం ఏయే డాక్యుమెంట్లు కావాలి?

పీఎం ముద్రా యోజన గురించి తరచూ అడిగే ప్రశ్నలు

సొంతంగా వ్యాపారం చేయాలని చాలా మంది కలలు కంటారు. కానీ, కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించక ఎక్కువ మంది వెనకడుగు వేస్తుంటారు. అలాంటి వారి కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకం 'ప్రధాన మంత్రి ముద్రా యోజన '. ఈ పథకం ద్వారా యువతకు, మహిళలకు వ్యాపారం చేసుకునేందుకు ఆర్థికంగా అండగా నిలుస్తోంది. ఎలాంటి హామీ లేకుండా రూ .50,000 నుంచి రూ. 20 లక్షల వరకు రుణాలు అందిస్తోంది. PMMY పథకం కింద మహిళలకు ప్రత్యేక రాయితీలు కూడా ఉన్నాయి.ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడం, చిన్న తరహా సంస్థలు, చిరు వ్యాపారులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు కేంద్రం పీఎం ముద్రా యోజన స్కీమ్‌ను 2015లో ప్రారంభించింది. వ్యవసాయేతర రంగాల్లో నిమగ్నమై ఉన్న చిన్న తరహా సంస్థలకు, వ్యక్తులకు రుణాలు అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. 2025 ఏప్రిల్ 8 నాటికి ప్రధాన మంత్రి ముద్రా యోజన పథకం ప్రారంభించి 10 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ పదేళ్లలో 33 లక్షల కోట్ల రూపాయల ముద్రా రుణాలు పంపిణీ చేసినట్లు కేంద్రం తెలిపింది.

బేకరీ స్థాపించి మహిళ విజయం

రాజస్థాన్‌లోని బికనీర్‌కు చెందిన సాధారణ మహిళ మిషికా దావరా PMMY ద్వారా రుణం తీసుకొని జీవితంలో ఊహించనంత విజయం సాధించింది. కేకులు, ఆరోగ్యకరమైన కుకీలను తయారు చేయాలనే తన అభిరుచిని ఒక వ్యాపార సూత్రంగా మలచుకుంది. కొంత మంది మహిళలను కలుపుకొని బికనీర్‌లో ఒక బేకరీని ప్రారంభించింది. పీఎం ముద్రా యోజన కింద ఎలాంటి హామీ లేకుండా రూ. 10 లక్షల బ్యాంక్ లోన్ పొందింది. ఈ రోజు మిషికా ఒక విజయవంతమైన స్టార్టప్‌ను నడుపుతోంది. మిషికా మాదిరిగా.. దేశంలో చాలా మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు.ప్రధాన మంత్రి ముద్రా యోజన పథకం ద్వారా ఇప్పటివరకు 53 కోట్ల మందికి పైగా ప్రజలు సొంతంగా వ్యాపారాలు ప్రారంభించారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన వారిలో 70 శాతం మంది మహిళలే ఉన్నారు. సొంతంగా వ్యాపారం చేస్తూ.. ఇతరులకు ఉద్యోగాలు కల్పించాలని కలలు కంటున్న వారికి ఈ పథకం ఉపయోగపడుతుంది. చిన్నదైనా కావొచ్చు లేదా పెద్దదైనా కావొచ్చు.. మంచి వ్యాపార సూత్రంతో ఏదైనా పని ప్రారంభించేందుకు ఈ పథకం కింద రుణం పొందవచ్చు.

ప్రధానమంత్రి ముద్రా యోజన అంటే ఏమిటి?

దేశంలో స్వయం ఉపాధిని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పథకం ప్రధాన మంత్రి ముద్రా యోజన ఈ పథకం యొక్క ప్రధాన లక్ష్యం చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఆర్థికంగా ఎదగడానికి సహాయం చేయడం. ముద్రా అంటే Micro Units Development and Refinance Agency Ltd. చిన్న వ్యాపారాలను ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశం. కుట్టు మిషన్, కిరాణా షాపు మొదలుకొని స్టార్టప్‌లను ప్రారంభించే యువకులు, మహిళలను ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం.

ముద్రా కార్డు అంటే ఏమిటి?ప్రధాన మంత్రి ముద్రా యోజన పథకం కింద చిన్న వ్యాపారాలకు రూ. 50,000 నుంచి 20 లక్షల రూపాయల వరకు ఎలాంటి హామీ లేకుండా రుణాలు ఇస్తారు. బ్యాంకుల ద్వారా ఈ రుణాలను మంజూరు చేస్తారు. లబ్ధిదారులకు ముద్రా కార్డ్ కూడా జారీ చేస్తారు. ఇది ఒక డెబిట్ కార్డ్. దీని ద్వారా లబ్ధిదారుడు తమ లోన్ ఖాతా నుంచి అవసరమైనప్పుడు డబ్బు తీసుకోవచ్చు.ప్రధాన మంత్రి ముద్రా యోజన లక్ష్యాలు:

దేశంలో నిరుద్యోగతను తగ్గించి స్వయం ఉపాధిని ప్రోత్సహించడం.

- చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఆర్థిక సహాయం అందించడం.
- చిన్న వ్యాపారాలు చేసేవారిని బ్యాంకింగ్ రంగంతో అనుసంధానించడం.
- రుణం కోసం మధ్యవర్తుల పాత్రను తొలగించి ప్రజలను అధిక వడ్డీల నుంచి రక్షించడం.
- స్టార్టప్‌లు లేదా సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనుకునే యువతను ప్రోత్సహించడం.
- పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చడం
-మహిళల్లో స్వావలంబనను పెంపొందించడం.

కొత్తగా ఏదైనా వ్యాపారం ప్రారంభించాలనుకునే వారితో పాటు వ్యాపార విస్తరణ కోసం కూడా ముద్రా యోజన కింద రుణాలు అందజేస్తారు. మానుఫ్యాక్చరింగ్, ట్రేడింగ్ లేదా సర్వీసెస్ లాంటి రంగాల్లో ఉన్న వారెవరైనా పీఎం ముద్రా లోన్ పొందవచ్చు.

# భారత మార్కెట్ బేఫికర్.. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల ప్రభావం తాత్కాలికమే



**ముంబై- నవభూమి:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'.. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల్ని తీవ్రతరం చేసింది. ఇరు దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇవి అటు పాకిస్థాన్ స్టాక్ ఎక్స్చేంజ్, ఇటు భారతీయ స్టాక్ ఎక్స్చేంజ్‌లనూ ప్రభావితం చేస్తున్నాయి. బుధ, గురువారాల్లో పాకిస్థాన్ స్టాక్ ఎక్స్చేంజ్ ఏకంగా 10వేల పాయింట్లకుపైగా నష్టపోయింది. ఇక బుధవారం లాభాల్లో ముగిసినా.. గురువారం మాత్రం దేశీయ సూచీలు నష్టాలకే పరిమితమయ్యాయి. అయితే ఈ నష్టాలు తాత్కాలికమేనని గతంలో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పుడు భారత స్టాక్ మార్కెట్ల ప్రదర్శనను చూస్తే అర్థమవుతున్నది.

ఇదీ సంగతి..1999 నుంచి చూస్తే ఇప్పటిదాకా భారత్-పాక్ మధ్య ప్రధానంగా 6 ఉద్రిక్తకర ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇందులో మెజారిటీ సమయాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు మదుపరులకు లాభాలనే పంచాయి. అమెరికా స్టాక్ ఎక్స్చేంజీల్లో నమోదైన టాప్-500 కంపెనీల షేర్ల తీరుతెన్నులను ప్రతిబింబించే ఎస్అండ్‌పీ 500 ఇండెక్స్‌తో పోల్చితే ఆయా సమయాల్లో బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ, 30 షేర్ల సెన్సెక్స్ ప్రదర్శన ఎంతో మెరుగ్గా ఉన్నది మరి. ఆయా ఘటనలు జరిగిన రోజుల్లో సూచీ నష్టాలకు లోనైనా.. ఆ తర్వాత మాత్రం లాభాల్లోనే దూసుకెళ్లింది. ప్రతీసారీ సూచీలు త్వరగానే కోలుకున్నాయి. ముఖ్యంగా దాయాది దేశానికి ధీటుగా భారత్ స్పందించిన ప్రతిసారీ మదుపరుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. విదేశీ మదుపరులూ పెట్టుబడుల ప్రవాహానికి మద్దతు పలకడం గమనార్హం. కార్గిల్ యుద్ధం, పార్లమెంట్‌పై ఉగ్రదాడి, ముంబై ఉగ్రదాడులు, పఠాన్ కోట్ దాడి.. ఆ తర్వాత జరిగిన పరిణామాల వేళ విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) భారతీయ మార్కెట్లలో పెట్టుబడులకే ప్రాధాన్యతనిచ్చారు.

**ఆతిథ్య, విమాన, రక్షణ షేర్లపై..**

భారత్-పాక్ ఉద్రిక్తతలు.. ఆతిథ్య, విమానయాన, రక్షణ రంగాల్లోని సంస్థల షేర్లను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. పర్యాటక, ప్రయాణ సేవలకు అంతరాయం కలగడం వల్ల హోటల్స్, ఏవియేషన్ కంపెనీల షేర్లు నష్టాలకు గురవుతుంటే.. డిఫెన్స్ ఆధారిత కంపెనీల షేర్లకు డిమాండ్ వచ్చిపడుతున్నది. పరిస్థితులు చక్కబడ్డాక హోటల్స్, ఏవియేషన్ షేర్లు తిరిగి పుంజుకుంటున్నాయి. అయితే డిఫెన్స్ కంపెనీల షేర్లకు ఆదరణ క్రమేణా పెరుగుతున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి.

**దేశీయ మార్కెట్‌కు వార్ సెగ**

'ఆపరేషన్ సిందూర్', ఆ తర్వాత భారత్-పాక్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 411.97 పాయింట్లు లేదా 0.51 శాతం కోల్పోయి 80,334.81 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 80,927.99 వద్దకు పెరిగినా.. మరో దశలో 79,987.61 వద్దకు క్షీణించింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 140.60 పాయింట్లు లేదా 0.58 శాతం పడిపోయి 24,273.80 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో 264.20 పాయింట్లు పతనం కావడం గమనార్హం. అయితే బుధవారం సూచీలు లాభాల్లోనే స్థిరపడ్డ విషయం తెలిసిందే. ఇదిలావుంటే తాజా నష్టాలు.. మదుపరుల సంపదను రూ.5 లక్షల కోట్లకుపైగా హరించుకుపోయేలా చేశాయి. ఈ ఒక్కరోజే రూ.5,00,037.74 కోట్లు దిగజారి బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.4,18,50,596.04 కోట్లకు పరిమితమైంది. ఆటో, ఫైనాన్స్, స్టీల్, టెలికం, బ్యాంకింగ్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

**భీకర నష్టాల్లో పాక్ సూచీ**

పాకిస్థాన్ స్టాక్ ఎక్స్చేంజ్ (పీఎస్ఎక్స్)లో నష్టాల వరద పారుతున్నది. పాక్ కవ్వింపు చర్యలకు భారత్ ధీటుగా బదులిస్తుండటం, అంతర్జాతీయ సమాజం నుంచి దాయాది దేశంపై పెరుగుతున్న ఒత్తిళ్ల నడుమ.. మదుపరులు పెద్ద ఎత్తున పెట్టుబడుల ఉపసంహరణలకు దిగుతున్నారు. ఈ క్రమంలోనే గురువారం మరో 6,500 పాయింట్లదాకా పీఎస్ఎక్స్ ఇండెక్స్ పతనమైంది. 6,482.21 పాయింట్లు లేదా 5.89 శాతం క్షీణించి 1,03,526.82 వద్ద ముగిసింది. బుధవారం 3,521 పాయింట్లు (3.10 శాతం) పడిపోయిన విషయం తెలిసిందే. ఒకానొక దశలోనైతే 6,561 పాయింట్లు దిగజారింది. గురువారం సైతం ఇంట్రా-డేలో 6,948.73 పాయింట్లు కోల్పోయింది. దీంతో ఈ రెండు రోజుల్లోనూ స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌ను పీఎస్ఎక్స్ వర్గాలు ఆపేశాయి. ఈ నష్టాల దెబ్బకు పాక్ ఆర్థిక మంత్రిత్వ శాఖ చెప్తున్న ధైర్య వచనాలు కూడా ఏమాత్రం ఫలితాన్నివ్వలేకపోతున్నాయి. మొత్తానికి గత రెండు రోజుల్లో 10వేల పాయింట్లకుపైగా నష్టాలను పీఎస్ఎక్స్ మూటగట్టుకున్నది.

**అప్రమత్తత అవసరం**

'ఆపరేషన్ సిందూర్'తో భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు తక్షణమే మార్కెట్ ఒడిదొడుకులకు దారితీశాయి. అయితే పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది. కార్గిల్ వార్, ముంబై ఉగ్రదాడుల సమయాల్లో 4 శాతం.. పార్లమెంట్ దాడి, బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్ వేళల్లో 3 శాతం చొప్పున సెన్సెక్స్, నిఫ్టీ క్షీణించాయి. కానీ ఇది తాత్కాలికం. దీర్ఘకాలంలో ఇన్వెస్టర్లకు మంచి లాభాలనే పంచాయి. కార్గిల్ వార్ తర్వాత సెన్సెక్స్ 63 శాతం పుంజుకున్నది. అలాగే పార్లమెంట్‌పై దాడి అనంతర పరిస్థితుల్లో 20 శాతం, ముంబై దాడులు, బాలాకోట్ ఘటనల తర్వాత 60 శాతం, 15 శాతం చొప్పున పెరిగాయి. దీన్నిబట్టి మార్కెట్ ఒడిదొడుకులు స్వల్ప కాలానికి చెందినవేనని స్పష్టమవుతున్నది.

# భారత్- పాక్ ఉద్రిక్తతలు.. ఏటీఎంలు మూసివేస్తున్నారా?



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో పలు అంశాలకు సంబంధించి.. సోషల్ మీడియాలో విస్తృతంగా వార్తలు, ఫొటోలు, వీడియోలు ప్రచారం అవుతున్నాయి. ఇందులో నిజానిజా లేంటో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. చాలా మంది వాస్తవాలు తెలుసుకోకుండానే వాటిని షేర్ చేస్తుండటం వల్ల జనం భయభ్రాంతులకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమై.. సాధ్యమైనంత వరకు నకిలీ కంటెంట్‌ను అరికట్టే ప్రయత్నం చేస్తోంది.

**ఏటీఎంలు మూసివేస్తున్నారా**

భారత్- పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో.. సోషల్ మీడియాలో అనేక తప్పుడు వార్తలు వైరల్ అవుతున్నాయి. వీటిలో ఒకటి బ్యాంక్ ఏటీఎంలు 2-3 రోజుల పాటు మూతపడతాయంనేది. రాన్సమ్‌వేర్ సైబర్ దాడుల భయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా ఒక వాట్సాప్ సందేశం హల్‌చల్ చేస్తోంది. అయితే, ఈ వార్తల్లో నిజం ఎంత అనేది మనం ఇప్పుడు తెలుసుకుందాం.

వైరల్ అవుతున్న వాట్సాప్ సందేశం ఇదే..

"ఇండో వర్సెస్ పాక్ ఇంపార్టెంట్ అలర్ట్..

భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా రాన్సమ్‌వేర్ సైబర్ దాడి భయంతో రాబోయే 2-3 రోజులు ఏటీఎంలు మూతపడతాయి.

ఈరోజు ఎలాంటి ఆన్‌లైన్ లావాదేవీలు చేయవద్దు. మీ కాంటాక్ట్ లిస్ట్‌లోని వారందరికీ 'డాన్స్ ఆఫ్ ది హిల్లరీ' అనే వీడియో కాల్‌ను ఓపెన్ చేయవద్దని తెలియజేయండి.

ఇది మీ మొబైల్‌ను ఫార్మాట్ చేసే వైరస్. చాలా ప్రమాదకరమైనది. ఈరోజు బీబీసీ రేడియోలో దీని గురించి ప్రకటించారు.

దయచేసి షేర్ చేయండి." అని ఒక మెసేజ్ వాట్సాప్ ఇతర సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతోంది.

అయితే దీనిపైనే.. భారత ప్రభుత్వానికి చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) స్పందించింది. తమ ఎక్స్ (గతంలో ట్విట్టర్) ఖాతా ద్వారా ఈ సందేశం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. ఏటీఎంలు యథావిధిగా పనిచేస్తాయని పీఐబీ తేల్చి చెప్పింది.భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా, వాట్సాప్ ద్వారా అనేక తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతోంది. ప్రజలు ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మొద్దని ప్రభుత్వం సూచిస్తోంది.

మరోవైపు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా ఇతర బ్యాంకులు కూడా ఎక్స్ వేదికగా ట్వీట్లు చేశాయి. 'అన్ని ఏటీఎంలు, క్యాష్ డిపాజిట్ మెషీన్లు, సహా డిజిటల్ సర్వీసులు కూడా పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి. ప్రజలకు అందుబాటులోనే ఉన్నాయి. ధ్రువీకరించని సమాచారాన్ని నమ్మవద్దు.' అని ఎస్బీఐ ట్వీట్ చేసింది.


**ఇంధన కొరతపైనా వదంతులు..**

ఇదిలా ఉండగా, పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఇంధన కొరత ఏర్పడిందనే వార్తలు కూడా ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టాయి. అయితే, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ ప్రచారంపై స్పష్టతనిచ్చింది. దేశవ్యాప్తంగా తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని, తమ సరఫరా వ్యవస్థ సజావుగా పనిచేస్తోందని ప్రకటించింది. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, అనవసరమైన కొనుగోళ్లకు పాల్పడవద్దని కోరింది.కాబట్టి, ఏటీఎంలు మూతపడతాయనే వార్త పూర్తిగా అవాస్తవం. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియాలో వచ్చే ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మి భయాందోళనలకు గురికావద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.



# ఆ పది నగరాలకు ఇండిగో విమానాలు రద్దు..

**న్యూఢిల్లీ-నవభూమి:** పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల వేళ ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో ట్రావెల్ అడ్వైజరీ ప్రకటించింది. డ్రోన్లు, మిస్సైళ్ల దాడులు కొనసాగుతుండటంతో దేశంలోని పది నగరాలకు విమాన సర్వీసులను రద్దుచేసింది. ఉత్తర, పశ్చిమ భారతదేశంలోని నగరాలకు శనివారం అర్ధరాత్రి వరకు విమానాల రద్దు కొనసాగుతుందని వెల్లడించింది. దీనివల్ల శ్రీనగర్, జమ్ము, అమృత్‌సర్, లేహ్, చండీగఢ్, ధర్మశాల, బికనేర్, జోధ్‌పూర్, కిషన్‌గఢ్, రాజ్‌కోట్ సర్వీసులపై ప్రభావం ఉంటుందని తెలిపింది. ప్రయాణికులు సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదించాలని పేర్కొంది.



పరిస్థితులను తాము ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని వెల్లడించింది. తదుపరి సమాచారం, విమానాల రాకపోకల్లో మార్పులు చేర్పులకు సంబంధించి ప్రయాణికులు అధికారిక చానల్స్ ద్వారా మాత్రమే తెలుసుకోవాలని సూచించింది. ప్రయాణికుల సంక్షేమ కోసమే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.కాగా, పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, చండీగఢ్, జమ్ముకశ్మీర్, లడఖ్, రాజస్థాన్, గుజరాత్‌లోని 24న విమానాశ్రయాలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తాత్కాలికంగా మూసివేసింది. ఈ క్రమంలో పలు విమానయాన సంస్థలు ప్రయాణికులకు అడ్వైజరీని జారీ చేశాయి.స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ జారీ చేసిన అడ్వైజరీలో ప్రయాణికులు తప్పనిసరిగా మూడుగంటల ముందుగానే ఎయిర్‌పోర్ట్‌లకు చేరుకోవాలని సూచించింది.

## అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు కేంద్ర హెూంశాఖ లేఖ




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్ - పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో కేంద్ర హెూం శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్రం హెూం శాఖ లేఖలు రాసింది. 1968 సివిల్ డిఫెన్స్ చట్టంలోని రూల్ 11 వినియోగించుకోవాలని లేఖలో పేర్కొంది. అయితే రూల్ 11 ప్రకారం సైరన్ వంటి అత్యవసర పరికరాలు కొనేందుకు పూర్తి అధికారం ఇస్తున్నట్లు ప్రకటించింది. ఇక అవసరమైతే అత్యవసర అధికారులు ఉపయోగించుకోవాలని కేంద్ర హెూం శాఖ వెల్లడించింది.

అయితే భారత్‌లోని సరిహద్దు నగరాల్లో పాకిస్తాన్ దాడి చేస్తుందనే ముందస్తు సమాచారంతో ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో ప్రజలను అలర్ట్ చేయడానికి సైరన్‌లను ఉపయోగిస్తుంది భారత సైన్యం. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వాలు అలర్ట్‌గా ఉండి పౌరుల భద్రతకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉండాలని సూచనలు చేసింది కేంద్రం.

## బెంగాల్‌లో మే 22 నుంచి.. ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల సమ్మె

**కోల్‌కతా-నవభూమి:** పశ్చిమ బెంగాల్‌లోని ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు సమ్మె సైరన్ మోగించారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం మే 22 నుంచి మూడు రోజుల పాటు సమ్మెకు దిగుతామని పేర్కొన్నారు. ఆ రాష్ట్రంలోని ఐదు ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల సంఘాలు ఈ మేరకు శుక్రవారం ప్రకటించాయి. సీఎం మమతా బెనర్జీకి లేఖ రాశాయి. సమ్మె చేపట్టక ముందే తమతో చర్చలు జరుపాలని ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల సంస్థలు ప్రభుత్వాన్ని కోరాయి.

కాగా, కరోనా లాక్‌డౌన్ సమయంలో జరిగిన నష్టాల నుంచి ఇంకా కోలుకోలేదని ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు తెలిపారు. మనుగడ కోసం పోరాడుతున్న స్టేజ్ క్యారేజ్ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఆచరణీయ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించలేదని ఆరోపించారు. 15 ఏళ్ల పాత బస్సుల వినియోగాన్ని రెండేళ్లు పొడిగించాలని కోరారు.మరోవైపు ట్రాఫిక్ ఉల్లంఘనలపై పోలీసుల అతిక్రమణలను నియంత్రించాలని, టోల్ ట్యాక్స్‌లను తగ్గించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్చలు జరుపకుండా ప్రతిష్టంభన కొనసాగిస్తే మే 22 నుంచి 25 వరకు సమ్మె తర్వాత కూడా నిరసన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.కాగా, పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా, పరిసర ప్రాంతాల్లో సుమారు 2,500 ప్రైవేట్ బస్సులు నడుస్తుండగా, ఆ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 27,000 బస్సులు తిరుగుతున్నాయి.

## అంబాలాలో నేటి రాత్రి నుంచి పూర్తిగా బ్లాకౌట్



**అంబాలా-నవభూమి:** హర్యానాలోని అంబాలాలో స్థానిక జిల్లా యంత్రాంగం ఇవాళ కీలక ప్రకటన చేసింది. ఇవాళ రాత్రి నుంచి పూర్తిగా బ్లాకౌట్ పాటించాలని ఆదేశించింది. ఇండోపాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో రాత్రి పూట బ్లాకౌట్ అమలు చేయనున్నారు. ప్రజల రక్షణ, వ్యూహాత్మక పరిస్థితుల నేపథ్యంలో రాత్రి పూట చీకటిగా ఉంటుందని డిప్యూటీ కమీషనర్ అజయ్ సింగ్ తోమర్ తెలిపారు. ఇన్వర్టర్లు, జనరేటర్లు, ఔట్‌డోరు లైట్లు, బిల్‌బోర్డులు, స్ట్రీట్ లైట్లుకు పవర్ బ్యాకప్ కూడా వాడరాదు. రాత్రి 8 నుంచి ఉదయం 6 గంటల వరకు బ్యాన్ చేస్తున్నట్లు తెలిపారు. ఒకవేల ఇండోర్‌లో లైట్లు వాడాలనుకుంటే, డోర్లు.. విండోలను పూర్తిగా కవర్ చేసుకోవాలన్నారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 223 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం వార్నింగ్ ఇచ్చింది.

## పూరి జగన్నాథ్ ఆలయం వద్ద భద్రత కట్టుదిట్టం



**భువనేశ్వర్-నవభూమి:** భారత్ - పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఒడిశాలోని పూరి జగన్నాథ్ ఆలయం వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. ఆలయ పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించారు. ఎన్ఎస్‌జీ కమాండోలు ఆలయం వద్ద పరిస్థితిని సమీక్షించారు. ఆలయం చుట్టు, పరిసర ప్రాంతాల్లో నిఘా పెంచాలని, అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. స్పెషల్ ఫోర్స్‌ను రంగంలోకి దించుతున్నట్లు పేర్కొన్నారు. పెట్రోలింగ్ వ్యవస్థను కూడా పెంచుతున్నామని చెప్పారు. పూరి ఆలయంతో పాటు సాంబాల్‌పూర్ జిల్లాలోని హీరాకుడ్ డ్యామ్ వద్ద పోలీసులు భద్రతను పెంచారు. ఇది ప్రపంచంలోనే అతి పొడవైన డ్యామ్. సరిహద్దుల్లో ఉద్రిక్తత నేపథ్యంలో ఈ డ్యామ్ వద్దకు పర్యాటకులు ఎవర్నీ అనుమతించొద్దని అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయన్నారు.భువనేశ్వర్‌లోని బిజు పట్నాయక్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, జగత్‌సింగ్‌పూర్‌లోని పారాదీప్ పోర్ట్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మరో వైపు బాలాసోర్‌లోని డీఆర్‌డీవో వద్ద ఉన్నతాధికారులు అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రక్షణ శాఖకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

# అగ్నివీర్ అమరుడైతే.. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎంత పరిహారం అందుతుంది?



**శ్రీనగర్--నవభూమి:**పాకిస్తాన్ చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో జమ్మూ కాశ్మీర్‌లో భారత్, పాక్ మధ్య జరిగిన కాల్పుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గడ్డం తాండ పంచాయతీలోని కళ్లితండాకు చెందిన మురళీ నాయక్ అనే అగ్నివీర్ అమరుడయ్యాడు. సాధారణంగా భారత త్రివిధ దళాల్లో సైనికులుగా పనిచేస్తూ.. విధి నిర్వహణలో శత్రువులతో పోరాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారికి.. కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ రకాల పరిహారం, సహాయం, అవార్డులు వంటివి లభిస్తాయి. అయితే కొన్నేళ్ల కింద కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం.. భారత త్రివిధ దళాల్లో చేరేవారి కోసం అగ్నివీర్ అనే పథకాన్ని తీసుకువచ్చింది. ఈ అగ్నివీర్ పథకం కింద భారత సైన్యంలో చేరే జవాన్లు కేవలం 4 ఏళ్ల పాటు మాత్రమే సేవలు అందిస్తారు. ఆ తర్వాత అందులో 25 శాతం మందిని మాత్రమే తీసుకుని.. మిగిలిన వారిని పక్కనపెడతారు. ఒకవేళ విధుల్లో ఉన్న అగ్నివీర్ అమరుడైతే ఎలాంటి సహాయం అందుతుంది అనేది ఈ స్టోరీలో చూద్దాం.భారత సైన్యంలో అగ్నివీర్ పథకం కింద చేరిన సైనికుడు సర్వీసులో అమరుడైతే.. వారి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయంతోపాటు వివిధ రూపాల్లో అండగా నిలుస్తుంది. అమరుడైన అగ్నివీర్ కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండేందుకు పలు కీలక గైడ్‌లైన్స్‌ను కేంద్రం రూపొందించింది.

**జీవిత బీమా:**అగ్నివీర్‌గా చేరిన ప్రతీ సైనికుడికి రూ. 48 లక్షల విలువైన జీవిత బీమా కల్పిస్తారు. ఒకవేళ సర్వీసులో అగ్నివీర్ మరణిస్తే ఆ మొత్తం వారి కుటుంబ సభ్యులకు అందిస్తారు. ఈ జీవిత బీమా ప్రీమియంను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఈ జీవిత బీమా అనేది శిక్షణలో ఉన్నపుడైనా, యుద్ధంలో అయినా, సహజ మరణానికి అయినా వర్తిస్తుంది.

**మిగిలిన సర్వీసు జీతం:**
అగ్నివీర్ సర్వీసు మొత్తం 4 ఏళ్లు ఉంటుంది. అయితే అగ్నివీర్ ఏ సమయంలో అమరుడైనా.. ఆ తర్వాత 4 ఏళ్ల సర్వీస్ పూర్తి చేయడానికి ఎంత కాలం మిగిలి ఉందో.. ఆ కాలాన్ని లెక్కించి.. దానికి సంబంధించిన పూర్తి జీతం ఆ అగ్నివీర్ కుటుంబానికి అందజేస్తారు. ఇదంతా ఒకేసారి చెల్లిస్తారు.


**సేవా నిధి ప్యాకేజీ:**
అగ్నివీర్ తన సర్వీస్ కాలంలో పొందిన జీతం నుంచి కొంత మొత్తం సేవా నిధికి జమ చేస్తారు. అగ్నివీర్ ఎంత మొత్తం అయితే సేవా నిధికి జమ చేస్తాడో.. అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా జమ చేస్తుంది. 4 ఏళ్ల సర్వీసు పూర్తి అయిన తర్వాత ఈ నిధిలోని మొత్తం (సుమారు రూ. 11.71 లక్షలు) వడ్డీతో సహా ఆ అగ్నివీర్‌కు చెల్లిస్తారు. ఒకవేళ సర్వీసు మధ్యలోనే అమరుడైతే ఈ మొత్తం వెంటనే వారి కుటుంబానికి అందజేస్తారు. ఈ సేవా నిధిపై ఎలాంటి ఇన్‌కమ్ ట్యాక్స్ ఉండదు.

**ఆర్మ్‌డ్ ఫోర్సెస్ బ్యాటిల్ క్యాజువాలిటీ ఫండ్:**
అగ్నివీర్ అమరుడైన తర్వాత ఈ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ బ్యాటిల్ క్యాజువాలిటీ ఫండ్ నుంచి కూడా అదనంగా ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందుతుంది. ప్రస్తుతం ఈ నిధి నుంచి ఎంత మొత్తం అందుతుందనేది అప్పటి పరిస్థితులను బట్టి మారుతూ ఉంటుంది. అయితే ఈ నిధి కూడా గణనీయమైన మొత్తంలోనే ఉంటుందని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది.

**తక్షణ ఆర్థిక సహాయం:**
అమరుడైన అగ్నివీర్ అంత్యక్రియలు, ఇతర అవసరాల కోసం కొంత మొత్తాన్ని తక్షణ సహాయంగా అతని కుటుంబ సభ్యులకు అందిస్తారు.

**మొత్తం పరిహారం:**
పైన పేర్కొన్న వివిధ రకాల పరిహారాలను కలిపితే.. సర్వీసులో ఉండగా అగ్నివీర్ అమరుడైతే వారి కుటుంబానికి సుమారు రూ.1 కోటి నుంచి రూ. 1.5 కోట్ల వరకు ఆర్థిక సహాయం అందుతుంది. ఈ మొత్తం అనేది అమరుడైన సైనికుడి పరిస్థితులు, వర్తించే నిబంధనల ప్రకారం మారుతూ ఉంటుందని తెలుస్తోంది. వీటికి అదనంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పరిహారాలు కూడా ఉంటాయి. ఇక అసాధారణ పోరాటం చేసి అమరులైన అగ్నివీరులకు గ్యాలంట్రీ అవార్డులు కూడా అందుతాయి.

## భారత్‌పై పాకిస్థాన్ వైరస్ దాడి.. అసలేమిటీ "డ్యాన్స్ ఆఫ్ ద హిల్లరీ"?



**శ్రీనగర్--నవభూమి:** పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకార చర్యలు తీసుకుంటోంది. ఓవైపు దౌత్యపరంగా దాయాది దేశానికి చుక్కలు చూపిస్తూనే.. మరోవైపు మెరుపు దాడులు చేసింది. ఉగ్రస్థావరాలే లక్ష్యంగా క్షిపణి దాడులు చేయగా.. ఆ దేశం సైతం ప్రతిచర్యలకు పాల్పడుతుంది. ఎల్ఓసీ వెంట కాల్పులు జరుపుతూ, క్షిపణి దాడులు చేస్తూ దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తుండగా.. భారత్ ఆర్మీ సైతం వాటికి దీటుగా బదులిస్తోంది. మరోవైపు సరికొత్త సోషల్ వైరస్‌ను వ్యాప్తి చేస్తూ భారత ప్రజలకు చుక్కలు చూపించేందుకు ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా "డ్యాన్స్ ఆఫ్ ద హిల్లరీ" అనే వైరస్‌ను తాజాగా పాక్ భారత ప్రజలపైకి ప్రయోగిస్తోంది. అయితే ఇదొక సైబర్ దాడి కాగా.. ఇది ఎక్కడ కనిపించినా దీన్ని క్లిక్ చేయొద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.భారత నిఘా సంస్థలు ప్రజలను హెచ్చరిస్తున్నాయి. భారత్, పాక్ ఉద్రిక్తతల వేళ దాయాది దేశం సైబర్ దాడికి ప్రయత్నిస్తోందని చెబుతున్నాయి. ముఖ్యంగా "డ్యాన్స్ ఆఫ్ ద హిల్లరీ" అనే వైరస్‌ను వ్యాప్తి చేస్తున్నట్లు వివరించారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఈ-మెయిల్, టెలిగ్రామ్ వంటి యాప్లలో ఇది వ్యాప్తి అవుతుండగా.. దీనికి సంబంధించిన లింక్ ఎక్కడ కనిపించినా దాన్ని క్లిక్ చేయొద్దని వివరిస్తున్నాయి. దీనిపై క్లిక్ చేస్తే.. ఫోన్, ల్యాప్‌టాప్‌లలో ఉన్న డేటా సహా బ్యాంకు వివరాలు వంటివి కూడా హ్యాక్‌కు గురవుతాయని పేర్కొంటున్నాయి.

అసలేమిటీ "డ్యాన్స్ ఆఫ్ ద హిల్లరీ వైరస్"..? డ్యాన్స్ ఆఫ్ ద హిల్లరీ అనే వైరస్.. రహస్య సమాచారాన్ని దొంగిలించడానికి, డిజిటల్ పరికరాలను దెబ్బ తీయడం కోసం రూపొందించారు. పాకిస్థాన్‌కు చెందిన సైబర్ నేరగాళ్లు తయారు చేసిన ఈ వైరస్ హానికరమైన మాల్వేర్ అని తెలుస్తోంది. అయితే ఫోన్లలో ఏవైనా ఫైల్స్ ఓపెన్ చేయడానికి వినియోగదారులు ప్రయత్నిస్తుంటే.. ఈ వీడియో, లింక్ కనిపిస్తుంది. పొరపాటున దీన్ని క్లిక్ చేశారంటే.. క్షణాల్లోనే వైరస్‌ను మీ ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌లో ఇన్‌స్టాల్ చేస్తుంది. ఆపై హ్యాకర్లకు మీ ఫోన్‌పై పూర్తి నియంత్రణను అందజేస్తుంది.

**దీని వల్ల కల్గే నష్టాలు ఏంటి?**
ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌లో ఈ వైరస్ ఇన్‌స్టాల్ అయిందంటే.. బ్యాంకింగ్ పాస్‌వర్డులు, వ్యక్తిగత సమాచారాన్ని హ్యాకర్లకు అందజేస్తుంది. రహస్యమైన ఫైళ్లను కూడా యాక్సెస్ చేసి లీక్ చేయగల్గుతుంది. అలాగే మీ పరికారలను స్లో చేయడం, క్రాష్ చేయడం వంటివి కూడా చేస్తుంది. ఫోన్లు, కంప్యూటర్లు.. వేటిలో అయినా సరే ఈ వైరస్ ఇన్‌స్టాల్ అయితే హ్యాకర్లు ఏమైనా చేయగల్గుతారు. మీ పరికరాలను మీ ఆధీనంలోంచి సులువుగా వారి ఆధీనంలోకి తీసుకుంటారు. ఇలాంటి వాటిల్లో taskche.exe'అనే ఫైల్ కనిపిస్తే చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇది వైరస్‌ను ప్రేరేపించే ఎగ్జిక్యూటబుల్ ఫైల్ అని వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా ఏ ఫైల్ చివర్లో అయినా .. ముగిస్తే అది అనుమానాస్పదంగా పరిగణించి దాన్ని క్లిక్ చేయకూడదని చెప్పుకొస్తున్నారు.

**ఈ వైరస్ ఎలా వ్యాపిస్తుంది?**
వాట్సాప్‌లలో ఫార్వార్డ్ చేసే వీడియో అటాచ్‌మెంట్ల ద్వారా దీని వ్యాప్తి జరుగుతుంది. అలాగే నకిలీ ఉద్యోగ ఇంటర్వ్యూ ఈ మెయిల్స్ లేదా ప్రభుత్వ సర్క్యులర్లలో కనిపిస్తుంది. తప్పుదారి పట్టించే యూఆర్ఎల్‌లతో ఫేస్‌బుక్ పోస్టుల్లోనూ దర్శనం ఇస్తుంది.

**టెలిగ్రామ్, ఎక్స్ వంటి వాటిల్లోనూ అత్యవసర ఫైళ్ల రూపంలో వస్తుంది.**
అయితే వీటిని వినియోగదారులు చూడగానే క్లిక్ చేసేందుకు.. హ్యాకర్లు అత్యవసర, ఉత్సుకత, భయం వంటివి కల్గించే ప్రయత్నాలు చేస్తున్నారు.దీని బారిన పడొద్దంటే ఏం చేయాలి..?:ఏవైనా వెబ్‌సైట్లు ఓపెన్ చేసినప్పుడు, గుర్తు తెలియని వ్యక్తులు ఏమైనా ఫైల్స్, లింకులు పంపిస్తే అస్సలే ఓపెన్ చేయకూడదు. అలాగే వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, టెలిగ్రామ్ వంటి వాటిల్లో మీడియా "ఆటో డౌన్‌లోడ్ ఫీచర్‌ను" ఆఫ్ చేయండి. యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసి అప్‌డేట్ చేసుకోండి. ముఖ్యంగా ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో వచ్చే సందేశాలను క్లిక్ చేయడం మానేయండి. బలమైన, విలక్షణమైన పాస్‌వర్డులను ఉపయోగించండి. ముఖ్యమైన డేటాను క్రమం తప్పకుండా బ్యాకప్ చేసుకోండి.

## భారత్‌లోకి చొరబాటు యత్నం.. ఏడుగురు జైషే ఉగ్రవాదులను హతమార్చిన సైన్యం



**శ్రీనగర్--నవభూమి:**జమ్మూకశ్మీర్‌లోని సాంబ జిల్లాలో సరిహద్దు దాటి భారత్‌లోకి చొరబడేందుకు పాకిస్థాన్ ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాలను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) తిప్పికొట్టింది. భారత్-పాకిస్థాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సమయంలోనే ఈ సంఘటన చోటు చేసుకోవడం గమనార్హం. మే 8వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో సాంబ జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఈ సంఘటన చోటుచేసుకొన్నట్లు బీఎస్ఎఫ్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ఈ ఘటనలో కనీసం ఏడుగురు ఉగ్రవాదులు మృతి చెందినట్లు బీఎస్ఎఫ్ వర్గాలు వెల్లడించాయి. చనిపోయిన ఉగ్రవాదులంతా జైషే మహ్మద్‌తో సంబంధం ఉన్నవారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

బీఎస్ఎఫ్ వెల్లడించిన దాని ప్రకారం.. పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులు.. ఇండియా భూభాగంలోకి చొచ్చుకువచ్చేందుకు ప్రయత్నించారు. చీకటిగా ఉండటంతో తమ ప్రయత్నాలను ఆర్మీ పసిగట్టే అవకాశం లేదని ఉగ్రవాదులు ఈ సాహసానికి దిగారు. కానీ సర్వేలైన్స్ కెమరాల వారి జాడను పసిగట్టడంతో బీఎస్ఎఫ్ రంగంలోకి దిగి.. ఉగ్రవాదులను అంతమొందించింది. చొరబాటుదారులను గుర్తించిన వెంటనే బీఎస్ఎఫ్ సైనికులు ప్రతిదాడిని ప్రారంభించి ఉగ్రవాదులను అంతమొందించారు. టెర్రరిస్టులకు మద్దతిచ్చిన పాక్‌కు చెందిన ధన్‌బార్‌లోని పోస్టును మన దళాలు ధ్వంసం చేశాయి. ఇందుకు సంబంధించిన థర్మల్ ఇమేజింగ్ దృశ్యాలను కూడా బీఎస్ఎఫ్ విడుదల చేసింది.ప్రస్తుతం భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు మరణించిన సంగతి తెలిసిందే. అందుకు ప్రతీకారంగా భారత్ మే 7న "ఆపరేషన్ సింధూర్" పేరిట పాకిస్థాన్, పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్ (పీఓకే)లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసింది. లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి సంస్థలకు చెందిన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని భారత అధికారులు తెలిపారుమరోవైపు పాకిస్థాన్ కూడా.. జమ్మూ, పఠాన్‌కోట్,ఉధంపూర్‌లోని భారత సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్‌లను ఉపయోగించి దాడులకు ప్రయత్నించింది. అయితే భారత దళాలు వీటిని సమర్థవంతంగా ఎదుర్కొవడమే కాక ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకుండా.. వాటిని నిర్వీర్యం చేశాయని ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ వెల్లడించిందికేంద్ర హెూం మంత్రి అమిత్ షా గురువారం అన్ని సరిహద్దు భద్రతా దళాల డైరెక్టర్ జనరల్‌లతో ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వమించారు.అలానే దేశవ్యాప్తంగా విమానాశ్రయ భద్రతను సమీక్షించడానికి మరో ప్రత్యేక సమావేశం కూడా జరిగింది.

## పెరుగుతోన్న ఉద్రిక్తతలు.. దాయాది దాడులను తిప్పికొట్టి



**శ్రీనగర్--నవభూమి:**భారత్, పాకిస్థాన్ మధ్య విస్తరిస్తున్న ఘర్షణల నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున, రాత్రి సైనిక స్థావరాలు, పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాక్ చేపట్టిన క్షిపణులు, డ్రోన్ దాడులను భారత సాయుధ దళాలు తిప్పికొట్టాయి. అనంతరం పాకిస్థాన్‌లోని అనేక గగనతల రక్షణ వ్యవస్థలు, ఇతర లక్ష్యాలపై భారత్ భారీ ప్రతీకార దాడులు చేసింది. 'ఆపరేషన్ సిందూర్ పూర్తిస్థాయిలో కొనసాగుతోంది. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్‌కు ఎలాంటి తప్పించుకునే అవకాశం ఇవ్వబోం' అని ఓ సీనియర్ అధికారి టైమ్స్ ఆఫ్ ఇండియాకు తెలిపారు. రాత్రిపూట కూడా భారత దాడులు కొనసాగుతుండగా... ఉత్తర అరేబియా సముద్రంలో యుద్ధ నౌకల మోహరింపు, , నియంత్రణ రేఖ వద్ద కాల్పుల విరమణ ఉల్లంఘనలు కొనసాగుతున్నాయి.

ఇంతలోనే పాకిస్థాన్‌కు చెందిన JF%-17 యుద్ధ విమానాలు, ఒక %F%-16 యుద్ధ విమానం కూల్చివేసినట్టు, అలాగే భారత్ ఇస్లామాబాద్‌ను లక్ష్యంగా చేసిందన్న అనధికార నివేదికలు వచ్చాయి. భారత వైమానిక దళం పాక్ క్షిపణుల దాడులకు తక్షణమే ప్రతిస్పందనగా ఇజ్రాయేల్ నుంచి కొనుగోలు చేసిన హారప్, హార్పీ కామికాజీ డ్రోన్లను వినియోగించింది. ఇవి శత్రు లక్ష్యాలు, రాడార్‌లపై దాడిచేసి క్రూయిజ్ మిసైల్‌లుగా పని చేస్తాయి.పాకిస్థాన్ పాక్షికంగా తిరిగి రాత్రి పూట దాడులు ప్రారంభించింది. జైసల్మేర్, అమృతసర్, జమ్మూ, పఠాన్‌కోట్, ఉదంపూర్ వైమానిక స్థావరాలు, అలాగే సాంబా, అర్ణియా ప్రాంతాలే లక్ష్యంగా మిసైల్‌లు, డ్రోన్లు ప్రయోగించింది. జమ్మూ నగరంలో పేలుళ్ల శబ్దాలతో ఆందోళన చెలరేగింది. అయితే, భారత దళాలు దీనిని తిప్పికొట్టాయి. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని ఒక అధికారి తెలిపారు. రాజస్థాన్‌లోని జసల్మేర్‌లో పాక్ పైలట్ పట్టుబడిన విషయం తెలిసిందే.'సైనిక స్థావరాలపై దాడులు జరిపితే తగిన విధంగా ప్రతిస్పందన ఉంటుంది' అని భారత్ హెచ్చరించింది. గురువారం భారత దళాలు భారీ ప్రతీకారం తీర్చుకున్నాయి. లాహెూర్‌లో చైనా తయారీ HQ-9 గగనతల రక్షణ వ్యవస్థ, రాడార్ వ్యవస్థను IAF డ్రోన్లు ధ్వంసం చేశాయి. రావల్పిండీ, గుజ్రన్వాలా, ఖైంజు (సింధ్), అట్టోక్, మియానో, బహావల్పూర్, కరాచీ సమీప ప్రాంతాల్లోనూ దాడిచేశాయి.అంతకుముందు పాకిస్థాన్.. జమ్మూ కశ్మీర్‌లోని అవంతీపురా, శ్రీనగర్, ఉత్తర్లైలో IAF స్థావరాలు.. జమ్మూ, అమృతసర్, జలంధర్, బఠిండా, చండీగఢ్ ప్రాంతాల్లోని ఆర్మీ స్థావరాలపై దాడులు జరిపినప్పటికీ.. భారత %ూ%-400 గగనతల రక్షణ వ్యవస్థ నేతృత్వంలోని మల్టీ లేయర్డ్ నెట్‌వర్క్‌ద్వారా వాటిని విజయవంతంగా అడ్డుకుంది.

## జైసల్మేర్‌లో బాంబు వంటి వస్తువు గుర్తింపు..



**జైపూర్-నవభూమి:** రాజస్థాన్‌లోని జైసల్మే ర్‌లో బాంబు వంటి వస్తువును స్థానికులు గుర్తిం చారు. కిషన్‌ఘాట్ ప్రాంతం లోని నర్సరీ సమీపంలో శుక్రవారం ఉదయం దీనిని కనుగొన్నారు. సర్పంచ్‌కు ఈ విషయం తెలియజేశారు. ఆయన వెంటనే పోలీసులు, ఆర్మీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ముందు జాగ్రత్త కోసం ఆ ప్రాంతం వద్దకు ఎవరూ వెళ్లకుండా మూసివేశారు. అనంతరం స్థానిక పోలీసులు, భారత వైమానిక దళానికి చెందిన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాంబు వంటి వస్తువును పరిశీలించారు.కాగా, గురువారం రాత్రి జైసల్మేర్‌తో పాటు పలు ప్రాంతాలపై డ్రోన్‌లు, క్షిపణులను పాకిస్థాన్ ప్రయోగించింది. భారత సైనిక దళాలు వీటిని కూల్చివేశాయి. ఈ నేపథ్యంలో పాక్ డ్రోన్‌కు చెందిన బాంబు భాగంగా దీనిని అనుమానిస్తున్నారు. నిర్వీర్యం చేసేందుకు బాంబు స్క్వాడ్ బృందం అక్కడకు చేరుకున్నది.మరోవైపు పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతమైన రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో బ్లాక్‌అవుట్ అమలులో ఉన్నది. ఈ ప్రాంతంలో భద్రతా చర్యలను ముమ్మరం చేశారు. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, భద్రతా సూచనలను పాటించాలని అధికారులు కోరారు.

## పెరిగిన బాస్మతి బియ్యం ధరలు..
### ఇండోపాక్ ఉద్రిక్తతల వల్ల కాదు !

**న్యూఢిల్లీ-నవభూమి:** ఇటీవల బాస్మతి బియ్యం ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఆల్ ఇండియా రైస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సతీశ్ గోయల్ ఓ ప్రకటన చేశారు. బాస్మతి బియ్యానికి అధిక డిమాండ్ ఉందని, దాని వల్లే ఆ రైస్ రేటు పెరిగినట్లు వెల్లడించారు. ఇండోపాక్ ఉద్రిక్తతల వల్ల ఆ బియ్యానికి ధర పెరగలేదన్నారు. బాస్మతి రైస్‌కి చెందిన 1509, 1718 వెరైటీల ధరలు ఇటీవల మార్చి నెలలో పెరిగాయన్నారు. ఆ బియ్యానికి డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. ఇండోపాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో జరుగుతున్న రవాణా జాప్యం వల్ల బియ్యం ధర పెరగలేదన్నారు. సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్ దేశాల్లో బాస్మతి బియ్యానికి ఎక్కువ డిమాండ్ ఉందని, దాని వల్ల ఆ రేట్లు పెరిగినట్లు చెప్పారు. ఇప్పటి వరకు బాస్మతి బియ్యం వాణిజ్యం ఎటువంటి ప్రభావం పడలేదన్నారు. ఆర్డర్‌లను చాలా స్మూత్‌గా డీల్ చేస్తున్నట్లు చెప్పారు.గత ఏడాది సెప్టెంబర్ 1509 బాస్మతి వెరైటీ బియ్యాన్ని కిలో రూ.62 కు అమ్మారని, ఆ తర్వాత వాటి ధరలు తగ్గాయని, పంట దిగుబడి పెరగడంవల్ల ధరలు తగ్గాయని ఏఐఆర్ఈఏ మాజీ అధ్యక్షుడు విజయ్ సేథియా తెలిపారు. ఫిబ్రవరి వరకు ఆ వెరైటీ ధర కిలో 52గా ఉందన్నారు. మార్చి నుంచి మాత్రం బియ్యం ధరలు పెరినట్లు చెప్పారు. ఇండో, పాక్ ఉద్రిక్తతలతో సంబంధం లేదన్నారు. 2024-25 సీజన్‌లో ఇండియా 60 లక్షల టన్నుల బాస్మతి బియ్యాన్ని ఎగుమతి చేశారని, ఇక పాకిస్థాన్ పది లక్షల టన్నుల బియ్యాన్ని షిప్పింగ్ చేసిందన్నారు.

## పాకిస్తాన్ అనుకూల పోస్ట్.. మెడికల్ స్టూడెంట్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు..!

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్-పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య కర్నాటకలో ఓ మెడికల్ కాలేజీ విద్యార్థి సోషల్ మీడియాలో పాకిస్తాన్ అనుకూలంగా పోస్ట్ చేసిందుకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. ఈ సోషల్ మీడియా పోస్టుపై హిందూ సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దాంతో పోలీసులు బీఎన్ఎస్ 152తో పాటు 197(3)(5) సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వివరించారు. విద్యార్థి ముంబయిలో ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. విద్యార్థిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. విద్యార్థి సోషల్ మీడియా పోస్ట్ వైరల్ కావడంతో హిందూ సంఘాల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. దాంతో విజయపుర పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. విజయ్‌పురలోని అల్ అమీన్ మెడికల్ కాలేజీ విద్యార్థి తసౌద్ ఫరూకీ షేక్ అనే విద్యార్థి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది.ఉద్రిక్తతల నేపథ్యంలో 'నా పాకిస్తానీ స్నేహితులకు.. భారత్ ఆక్రమిత కశ్మీర్, ఆజాద్ కశ్మీర్ ప్రజలు సైనిక, ప్రభుత్వ స్థావరాలకు దగ్గరగా వెళ్లొద్దు. మీరు 200 కిలోమీటర్ల సరిహద్దుకు దగ్గరగా నివసిస్తుంటే దూరంగా వెళ్లిపోయండి. అల్లా మనందరినీ భారత్ నుంచి రక్షించుగాక. అమీన్' అంటూ పాకిస్తాన్ జెండాను షేర్ చేసింది. ఆమె వాట్సాప్ స్టేటస్‌లోనూ ఇదే తరహాలో స్టేటస్ పెట్టింది. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో సదరు విద్యార్థి క్షమాపణలు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. 'తన చర్యల కారణంగా బాధపడిన ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వకంగా క్షమాపణలు కోరుతున్నాను. తాను భారతీయురాలినని.. నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. ఇది నా మాతృ భూమి. నేను భారత్‌లోనే పుట్టాను. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అవివేకం. మళ్లీ ఇలాంటి పనులు చేయను. అందరినీ క్షమాపణలు కోరుతున్నా. జై హింద్' అంటూ పోస్ట్ పెట్టిందని పోలీసులు వివరించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ | శనివారం | 10 । మే । 2025




# మద్యం మత్తులో హంగామా.. 'జైలర్' నటుడు వినాయకన్ అరెస్ట్

రజనీకాంత్ జైలర్ సినిమాతో గుర్తింపు తెచ్చుకుని మలయాళ చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన నటుడు వినాయకన్‌ను కేరళ పోలీసులు అరెస్ట్ చేశారు. మద్యం మత్తులో ఓ హోటల్‌లో సిబ్బందితో వాగ్వాదానికి దిగడంతో ఆయనను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై ఆయనను విడుదల చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వినాయకన్ ఓ సినిమా షూటింగ్ నిమిత్తం ఈ నెల 2వ తేదీ నుంచి కొల్లంలోని ఓ హోటల్‌లో బస చేస్తున్నారు. గురువారం ఆయన హోటల్ నుంచి చెక్ అవుట్ చేస్తుండగా మద్యం మత్తులో సిబ్బందితో గొడవపడ్డారు. దీంతో హోటల్ సిబ్బంది అంచలుమూడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వినాయకన్‌ను అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కేరళ పోలీస్ చట్టంలోని సెక్షన్ 118 (ఎ) కింద కేసు నమోదు చేశారు. ఈ సెక్షన్ ప్రకారం, బహిరంగ ప్రదేశంలో మద్యం మత్తులో ఉంటే చర్యలు తీసుకుంటారు. ఈ ఘటనపై పోలీసు అధికారి మాట్లాడుతూ, వినాయకన్ బాగా మద్యం తాగి ఉన్నారు. ఆయన పోలీసులతో సహా అందరినీ గట్టిగా అరుస్తూ అసభ్య పదజాలంతో దూషించారు" అని తెలిపారు. వినాయకన్‌తో పాటు ఉన్న వారిలో ఒకరు పూచీకత్తు సమర్పించడంతో ఆయనను స్టేషన్ బెయిల్ పై విడుదల చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

నవచిత్ర



# ఐకాన్ స్టార్ లిస్ట్‌లో శ్రీనిధి చేరిందా!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 22వ చిత్రం అట్లీ దర్శకత్వంలో లాక్ అయిన సంగతి తెలిసిందే. భారీ కాన్వాస్ పై చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే సినిమాలో ముగ్గురు హీరోయిన్లు ఉన్నారని ప్రచారం పీక్స్ లో జరుగుతుంది. దీనిలో భాగంగా చాలా మంది బ్యూటీల పేర్లు తెరపైకి వచ్చాయి. దీపికా పదుకొనే, శ్రద్ధా కపూర్, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, అనన్య పాండే, సమంత పేర్లు తెరపైకి వచ్చాయి. వీళ్లలో ముగ్గురు భామలు ఎవరు అవుతారు? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే సమంతకు ఆ ఛాన్స్ రాలేదని ఇటీవలే క్లారిటీ ఇచ్చింది. దీంతో బన్నీ సరసన రేసులో సమంత ఎగ్జిట్ అయినట్లు అయింది. ఈ నేపథ్యంలో తాజాగా కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టి పేరు తెరపైకి వస్తుంది. ఇందులో బన్నీకి మెయిన్ లీడ్ గా ఈ భామనే తీసుకుంటున్నారనే కొత్త ప్రచారం మొదలైంది. అట్లీ రాసిన పాత్రకు శ్రీనిధి పర్ఫెక్ట్ గా సెట్ అవుతుందని అందుకే తొలి అవకాశం ఆమెకే ఇస్తున్నట్లు కోలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. మరి ఇందులో వాస్తవం ఎంతో తెలియాలి. 'కేజీఎఫ్' తో శ్రీనిధి శెట్టి పాన్ ఇండియాలో వెలుగులోకి వచ్చిన సంగతి తెలసిందే. కానీ అటుపై పెద్దగా అవకాశాలు రాలేదు. ఇటీవల రిలీజ్ అయిన 'హిట్ 3'లో నటించింది. ఈ సినిమా మంచి విజయం సాధించింది. 'కేజీఎఫ్' కంటే హిట్ 3లో కాస్త మంచి రోల్ పడింది. నటనకు ఆస్కారం కనిపించింది. అందమైన నటిగాను అమ్మడు హైలైట్ అయింది. ప్రచార కార్యక్రమాల్లోనూ పద్దతైన చీర కట్టుకుని కనిపించింది. హీరోయిన్ అయినా తనకంటు కొన్ని పరిమితులున్నాయని మోడ్రన్ దుస్తులకు..అందాల ప్రదర్శనకు దూరంగా ఉంది. ఆ రకంగా శ్రీనిధి డీసెంట్ గాళ్ల్ గా హైలైట్ అవుతుంది. మరి ఐకాన్ స్టార్ చిత్రంలో ఛాన్స్ వస్తే గనుక తిరుగుండదు.

## నాని-సుజీత్ మూవీకి లైన్ క్లియర్..



నేచురల్ స్టార్ నాని వరుస సక్సెస్‌లతో దూసుకుపోతున్నాడు. ఆయన నిర్మాతగా వ్యవహరించిన కోర్టు చిత్రం మంచి విజయం సాధించింది. ఇక నటుడిగా హిట్ 3తో పెద్ద సక్సెస్ సాధించాడు. ఇక ఇప్పుడు ది ప్యారడైజ్ అనే చిత్రం చేస్తున్నాడు. ఈ మూవీతోను పెద్ద హిట్ కొడతాడని భావిస్తున్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ పై అభిమానులు భారీ అంచనాలు అయితే ఉన్నాయి. రియలిస్టిక్ డ్రామాగా ఈ మూవీతో సరికొత్త చరిత్ర సృష్టిస్తాడని అంటున్నారు. అయితే లైనప్ చాల పెద్దగానే ఉన్నట్టు తెలుస్తుంది. నానికి చాలా కాలం క్రితమే సుజీత్ దర్శకత్వంలో ఓ సినిమా చేయాల్సి ఉంది.అయితే సుజిత్.. పవన్ కళ్యాణ్‌తో ఓజీ చేస్తుండగా , ఈ ప్రాజెక్ట్ చాన్నాళ్లుగా పెండింగ్‌లో ఉంది. రాజకీయాల్లో పవన్ బిజీగా ఉండటంతో మధ్యలో షూటింగ్ నిలిచినా, రీసెంట్ గా ఆయన డేట్స్ ఇచ్చి మరల సెట్స్ పైకి వచ్చారు. ఓజీ వచ్చే ఆగస్టు-సెప్టెంబర్ లో విడుదల కానుందని తెలుస్తుంది. ఆ తర్వాత సుజీత్ పూర్తి స్థాయిలో నాని ప్రాజెక్ట్ పై ఫోకస్ చేయనున్నాడు. దసరా తర్వాత ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభమవుతాయని, వచ్చే ఏడాది ప్రారంభంలో షూటింగ్ మొదలవుతుందని టాక్ వినిపిస్తోంది. నాని రీసెంట్‌గా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ సినిమా 2027లో రిలీజ్ అవుతుందని చెప్పడం మనం చూశాం.ఈ ప్రాజెక్ట్ కు బ్లడీ రోమియో అనే టైటిల్ ను ఫిక్స్ చేశారని ఇప్పటికే ఫిల్మ్ నగర్ లో గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తారని సమాచారం. ఇక ఇదిలా ఉంటే నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన హిట్ సినిమాతో ఇప్పటికే రూ.100 కోట్ల వసూళ్లను రాబట్టారు నాని. ఇప్పుడు ప్యారడైజ్ మూవీ సెట్స్ లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా భారీ హిట్ అవుతుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

# నా పిల్లలు ప్రేమను -సంపాదించుకోవాలి



టాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా ఓ వెలుగు వెలిగిన ఇలియానా బాలీవుడ్ డ్రీమ్స్ తో ముంబైకి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. కానీ అక్కడ ఆశించిన స్థాయికి చేరుకోవడంలో విఫలమైంది. దానికి కారణాలు ఏవైనా కానీ, గోవా బ్యూటీ ఇటీవల సినిమాలను తగ్గించుకుని, పూర్తిగా వ్యక్తిగత జీవితంపై దృష్టి సారించింది. ఇలియానా ఈ ఏడాది ఫిబ్రవరిలో రెండో గర్భధారణకు సంబంధించి అధికారికంగా ప్రకటించింది. త్వరలోనే రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్నానని తెలిపింది. అనే అంశంపై ఇలియానా మాట్లాడింది. సోషల్ మీడియాలో ఒక అభిమాని ఇలియానాను ఇలా ప్రశ్నించారు. పిల్లలు దయలేని క్రూరుల్లా దుష్టుల్లా స్వార్థపూరితంగా పెరగకూడదంటే తల్లిగా ఏం చేయాలి? నిజమైన ప్రేమ అంటే ఏమిటి? అని అడిగారు. ఈ ప్రశ్నకు స్పందించిన ఇలియానా.. పిల్లల్ని ప్రేమ సంపాదించుకోవాలి అనే విధంగా పెంచను! అని సమాధానమిచ్చింది. నేను అనుభవించిన అత్యంత చెత్త అనుభూతి అది! అని కూడా ఇలియానా వ్యాఖ్యానించింది. ప్రేమ స్వతహాగా ఉండాలి. అది సంపాదించుకుంటే వచ్చేది కాదు! గౌరవం ఆనందంలా ప్రేమ కూడా సహజంగా వచ్చేది! అని ఇలియానా వివరించింది. నా పిల్లలు నా ప్రేమను సంపాదించుకోవాలి అని ఎప్పుడూ భావించకూడదని కోరుకుంటున్నాను. అది నేను అనుభవించిన అత్యంత చెత్త అనుభూతి. ప్రేమ సరిపోలేదు అనే భావన అస్సలు వారికి రాకూడదు. నేను సంతోషంగా, ఆరోగ్యంగా జీవించే దయగల పిల్లలను పెంచాలనుకుంటున్నాను. అందరు తల్లిదండ్రులు అలానే భావిస్తారని నేను అనుకుంటున్నాను. పిల్లలు ఎంతగా ప్రేమించబడుతున్నారో తెలుసుకోవడానికి నేను నా వంతు కృషి చేస్తాను.. అని ఇలియానా అంది. సహజసిద్ధమైన తల్లి ప్రేమ, ఎమోషన్స్ ని తాను ఇష్టపడతానని ఇలియానా చెప్పకనే చెప్పింది. అయితే ప్రేమను సంపాదించుకోవాలి అనేది చెత్త అనుభవం అని ఇలియానా వ్యాఖ్యానించడానికి కారణాలను అభిమానులు ఊహిస్తున్నారు. ఇలియానా స్పందన చూశాక.. ఫోటోగ్రాఫర్ ఆండ్రూ నీబోన్ ప్రేమ పేరుతో మోసం చేసిన విషయాన్ని ఇలియానా ఇంకా మర్చిపోలేదని కొందరు అభిమానులు గుర్తు చేస్తున్నారు. ఇలియానా 2021లో విదేశీ ప్రియుడు మైఖేల్ ని పెళ్లాడిన సంగతి తెలిసిందే. కానీ ఈ జంట ప్రేమాయణాన్ని చాలా కాలం రహస్యంగా దాచి ఉంచింది. వీరికి కోవా ఫోనిక్స్ డోలన్ అనే కుమారుడు ఉన్నాడు. ఇటీవల రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్నానని ప్రకటించిన ఇలియానా పూర్తిగా వ్యక్తిగత జీవితంపైనే దృష్టి సారించింది.

## ఓరుగల్లు పోరికి ఛాన్సులు



ఈషా రెబ్బా బ్రౌన్ డ్రెస్ లో మంత్రముగ్ధులను చేస్తుంది ఈషా రెబ్బా తన నటనా జీవితాన్ని తెలుగు చిత్రాలతో ప్రారంభించింది త్వరగా దక్షిణ భారత చిత్ర పరిశ్రమలో ప్రసిద్ధి చెందింది.మరోసారి అందంతో అదరగొట్టింది ఈషా రెబ్బా. మోడ్రన్ దుస్తుల్లో రచ్చ చేసింది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోషూట్ నెట్టింట వైరల్ అవుతోంది.హీరోయిన్ ఈషా రెబ్బ ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో తెగ హంగామా చేస్తోంది. ఎప్పటికప్పుడు తన ఫ్రెష్ అండ్ పెప్పర్ లుక్స్ షేర్ చేస్తూ కుర్రకారు మతిపోగొడుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఫోటో షూట్ వైరల్ గా మారింది.డస్కీ అందాలతో కనువిందు చేసింది ఈ అచ్చ తెలుగు అందం. కెమెరా ముందు పలు యాంగిల్స్‌లో రెచ్చిపోయింది. ఈ పిక్స్ చూసి కుర్రకారు మైమరచిపోతున్నారు. బ్యూటిఫుల్ అంటూ కామెంట్ల మోత మోగిస్తున్నారు.సినిమాల పరంగా బిజీ అవుతూనే సోషల్ మీడియాలో ఫాలోయింగ్ పెంచుకుంటోంది ఈషా. నిత్యం ఆమె ఫొటోస్ చూసేందుకు ఎగబడుతున్నారు ఫ్యాన్స్. దీంతో ఆన్ లైన్ వేదికలపై ఈషా హవా కనిపిస్తోంది.మోడలింగ్ చేస్తూ కెరీర్ ప్రారంభించిన ఈషా రెబ్బా.. 'లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్' మూవీతో సినీ ఎంట్రీ ఇచ్చింది. తొలి సినిమాతోనే యువత చూపు తనపై పడేలా చేసుకొని ఆ వెంటనే 'అంతకు ముందు ఆ తర్వాత' అనే సినిమా చేసి హీరోయిన్ గా మంచి మార్కులు కొట్టేసింది ఈ తెలుగమ్మాయి. ఫేమస్ హీరోయిన్ కానప్పటికీ ఈషా రెబ్బా అన్నా, ఆమె గ్లామర్ అన్నా పరిచయం లేని ప్రేక్షకుడు లేదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. వెండితెరపై తనదైన గ్లామర్ ఒలకబోస్తూ ఫేమ్ కొట్టేసిన ఈ బ్యూటీకి అదృష్టం మాత్రం కలసి రావడం లేదు.మెయిన్ హీరోయిన్ గా ఎలాగూ సక్సెస్ రావడం లేదని.. సెకండ్ హీరోయిన్ గానూ చేయడానికి ముందు కొచ్చింది ఈ అందాల ఈషా. ఎన్టీఆర్ హీరోగా వచ్చిన 'అరవింద సమేత.. వీరరాఘవ', అక్కినేని వారసుడి 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' వంటి చిత్రాల్లో నటించింది.కావాల్సినంత అందం ఉన్నా కూడా ఎందుకో ఈషా రెబ్బకు తెలుగు హీరోలు సరైన అవకాశాలు ఇవ్వడం లేదనే చెప్పాలి. అందుకే వెబ్ సిరీస్‌లతో పాటు పక్క ఇండస్ట్రీలపై ఫోకస్ పెట్టింది ఈ తెలుగు అందం.మోడ్రన్ యుగంలో రాణించడం కోసం వెబ్ సిరీస్‌ల బాట పట్టిన ఈషా.. ఇప్పటికే పలు సిరీస్‌లకు సైన్ చేసిందట.





# మలయాళ నటి పోస్ట్‌పై నెట్టింట తీవ్ర విమర్శలు..



టర్కిష్ తర్కం, గ్యాంగ్స్ ఆఫ్ 18 సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న మలయాళ భామ అమీనా నిజమ్ ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు గురవుతోంది. దానికి కారణం ఆమె నెట్టింట షేర్ చేసిన పోస్ట్. రీసెంట్ గా పాకిస్తాన్ ఉగ్రవాదులు పహల్గామ్ పై దాడి చేయడం, ఆ దాడికి వ్యతిరేకంగా ప్రతీకారం తీర్చుకుంటూ ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ సిందూర్ ని నిర్వహించిన విషయం తెలిసిందే.

ఈ విషయంపై అమీనా స్పందిస్తూ, ఇండియన్ ఆర్మీ పాకిస్తాన్ లోని ప్రజలను చంపడంపై తాను సిగ్గు పడుతున్నానని చెప్తూ ఇన్‌స్టాలో షేర్ చేసింది. చంపుకోవడం వద్దని అమీనా చెప్తున్న శాంతి పాఠాలు బావున్నప్పటికీ అదే పాకిస్తాన్ ఉగ్రవాదుల చేతిలో అమాయకులైన ఇండియన్స్ కూడా చనిపోయారనే విషయాన్ని ఆమె గుర్తించాల్సిన అవసరం ఉందంటూ ఆమెను నెటిజన్లు దేశ వ్యతిరేకి అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.

**పోస్టర్ తోనే కిక్కిచ్చారుగా..**

నెటిజన్లు అమీనాను విమర్శించడమే కాకుండా ఆమెకు అలాంటి అభిప్రాయాలు ఉన్నందు వల్ల ఎలాంటి అవకాశాలు ఇవ్వకూడదని కూడా ఫిల్మ్ మేకర్స్ ను కోరుతున్నారు. యుద్ధం, దాని వల్ల వచ్చే పర్యవసానాల గురించి హేతుబద్ధమైన ఆలోచన మంచిదే అయినప్పటికీ పాకిస్తాన్ ఫండింగ్ చేస్తున్న ఎంతో మంది ఉగ్రవాదులు ఇండియాపై చేసిన దాడుల గురించి మర్చిపోకూడదని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.ఇండియా- పాక్ మధ్య యుద్ధమే సొల్యూషన్ కాదు. అయినప్పటికీ ఇండియన్ ఆర్మీ ఒక నిర్ణయం తీసుకుని ముందుకెళ్తున్న నేపథ్యంలో భారత పౌరులంతా కలిసికట్టుగా నిలబడి ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందని ఆమె అభిమానులు సైతం అంటున్నారు. ఇలాంటి టైమ్ లో అమీనా పాకిస్తాన్ ఉగ్రవాదులను పాపం అనడం, వారిపై సానుభూతి చూపించడం ఏ మాత్రం మెచ్చుకోదగ్గ విషయం కాదు.

## అల్లు వారబ్బాయిని పెళ్లెప్పుడు అని అడిగిన సుమ..



శ్రీ విష్ణు నటిస్తున్న తాజా చిత్రం సింగిల్. ఈ మూవీకి సంబంధించిన టీజర్ ఇటీవల విడుదల కాగా, ఇది భారీ అంచనాలు పెంచింది.అయితే తాజాగా సింగిల్ ప్రమోషన్స్ లో భాగంగా టాలీవుడ్ సింగిల్స్‌ని గెస్ట్‌లుగా పిలిచి ఫన్నీ ప్రశ్నలు వేశారు. ఈ క్రమంలో భాగంగా అల్లు శిరీష్‌ని యాంకర్ సుమ పెళ్లి ఎప్పుడు అని అడిగేసింది. మా అమ్మానాన్నలకంటే ఎక్కువగా మీరే అడుగుతున్నారు.. ఏమైనా సంబంధాలు చూస్తారా? అని సుమకి శిరీష్ కౌంటర్ వేశాడు. అంతేకాకుండా తనకి సింగిల్ లైఫ్ చాలా బాగుంది అని, పెళ్లి చేసుకోవద్దని చాలా మంది చెబుతున్నారని శిరీష్ అన్నాడు.తన తండ్రి అల్లు అరవింద్ కూడా పదేళ్ల నుండి పెళ్లి చేసుకోమని వెంటపడుతున్నాడట. అయితే పెళ్లి చేసుకోమని ఎంత అడిగిన శిరీష్ మాత్రం మూవీపై ఆసక్తి చూపడం లేదని తెలుస్తుంది. పెళ్లి కంటే సింగిల్‌గా ఉంటేనే బాగుంటుందని అల్లు శిరీష్ అంటున్నాడు. మీ ఇంట్లోనే బెస్ట్ ఎగ్జాంపుల్ ఉంది.. బన్నీ పెళ్లి చేసుకుని హాయిగా ఉన్నాడు కదా అని సుమ అంటే.. నేను సింగిల్‌గా కూడా హ్యాపీగానే ఉన్నాను కదా అని రివర్స్ పంచ్ వేశాడు శిరీష్. దాంతో శిరీష్ ఇక తన నిర్ణయం మార్చుకునేలా కనిపించడం లేదంటూ హ్యాండ్సప్ అనేసింది సుమ.సారీ అరవింద్ గారు.. మీరు పదేళ్ల నుంచి చేయలేనిది నేను ఒక్క ఈవెంట్‌లో ఎలా చేయగలను అంటూ అక్కడినుండి వెళ్లిపోయింది సుమ.

# భారత సైన్యానికి సలాం.. మీ ధైర్య సాహసాలకు రుణపడి ఉంటాం..!



**న్యూఢిల్లీ-నవభూమి:** 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతున్న వేళ దేశ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భారత సైన్యం శత్రుదేశం పాకిస్థాన్ డ్రోన్లను గాల్లోనే కూల్చేస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూస్తోంది. ఈ నేపథ్యంలో యావత్ దేశం ఆర్మీకి మద్దతుగా నిలుస్తోంది. ప్రాణాలకు తెగించి మరీ దాయాది వ్యూహాల్ని నీరుగారుస్తున్న సైనికుల ధైర్యసాహసాలను పలువురు పొగుడుతున్నారు. ఈ క్రమంలోనే స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా తన సంఘీభావం తెలియజేశాడు.'భారత ఆర్మీకి సెల్యూట్. మీ ధైర్య సాహసాలకు రుణపడి ఉంటాం. శత్రువుల ఎత్తులను చిత్తు చేస్తున్న మీకు యావత్ భారతం వెన్నంటి ఉంటుంది అని విరాట్ తన పోస్ట్‌లో రాసుకొచ్చాడు. 'భారత్, పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల వేళ మన సైన్యం అసమాన ధైర్య సాహసాలను ప్రదర్శిస్తోంది. ఈ కష్ట సమయంలో మన ఆర్మీ యోధులు దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్నారు.అందుకే.. సైన్యానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం. అందరి తరఫున ఆర్మీకి మద్దతు, హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. దేశం కోసం సైనికులు, వాళ్ల కుటుంబసభ్యులు చేసే త్యాగాలు భారత్‌ను గొప్ప దేశంగా మారుస్తున్నాయి. జై హింద్' అని కోహ్లీ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో వెల్లడించాడు.

**భద్రతా జాగ్రత్తలు..**

సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నందున పలువురు ఆటగాళ్లు భారత సైన్యానికి మద్దతుగా పోస్టులు పెడుతున్నారు. ప్రతిఒక్కరు దేశానికి మద్దతుగా నిలవాలని, సహనాన్ని పాటిస్తూ అధికారులు సూచించే భద్రతా జాగ్రత్తలు పాటించాలని భారత జట్టు వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ దేశ ప్రజలను కోరాడు. హిట్‌మ్యాన్ మాదిరిగానే కోహ్లీ సైతం సైన్యానికి సంఘీభావం తెలుపుతూ.. ప్రజల్ని అప్రమత్తంగా ఉండాలని విన్నవించాడు.

# నెల రోజుల్లోనే యూటర్న్.. ముంబైకి ఆడనున్న యశస్వీ



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐపీఎల్ 18వ సీజన్‌లో దంచికొడుతున్న యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌యూటర్న్ తీసుకున్నాడు. వచ్చే సీజన్ నుంచి గోవా కు ఆడాలనుకున్న అతడు తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. దేశవాళీలో ఇంతకుముందులానే ముంబై జట్టుకే ఆడేందుకు సిద్ధమయ్యాడీ చిచ్చరపిడుగు. ఈ క్రమంలోనే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం రాసిన లేఖను వెనక్కి తీసుకున్నాడీ యువకెరటం. అంతేకాదు వచ్చే రంజీ సీజన్‌లో తన పేరును పరిశీలించాలని ముంబై క్రికెట్ అసోసియేషన్‌కు అప్పీల్ చేసుకున్నాడు యశస్వీ.దాంతో, ఈ యంగ్‌స్టర్ రాకతో తమ జట్టు బ్యాటింగ్ బలం పెరుగుతుందనుకున్న గోవాకు నిరాశే మిగిలింది. వచ్చే దేశవాళీ సీజన్‌కు తనను ముంబై క్రికెటర్‌గానే పరిగణించాలని యశస్వీ ఎంసీఏకు లేఖ రాశాడని పీటీఐ పేర్కొన్నది. 'వచ్చే ఏడాది నుంచి గోవాకు దేశవాళీ క్రికెట్ ఆడాలనే ఆలోచనను విరమించుకున్నా. అందుకే.. ఎంసీఏ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోరుతూ రాసిన లేఖను ఉపసంహరించుకుంటున్నా.

నవక్రీడ

# ఐపీఎల్‌కు వారం రోజులు బ్రేక్.. త్వరలోనే కొత్త షెడ్యూల్ ప్రకటన..!



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల ప్రభావం ఐపీఎల్ 18వ సీజన్‌పై పడింది. ఆటగాళ్ల భద్రత దృష్ట్యా గురువారం ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ అర్ధాంతరంగా ఆపేసిన బీసీసీఐ.. మెగా టోర్నీని నిరవధికంగా వాయిదా వేసిన విషయం తెలిసిందే. అయితే.. శుక్రవారం మధ్యాహ్నం మరో ప్రకటనలో వారం రోజుల పాటు ఐపీఎల్ మ్యాచ్‌లకు బ్రేక్ ఇస్తున్నట్టు బీసీసీఐ వివరించింది. అనంతరం పరిస్థితులను బట్టి.. ప్రభుత్వ ఆదేశాలను బట్టి లీగ్ కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటామని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వెల్లడించాడు. ధర్మశాలలో పంజాబ్, ఢిల్లీ మ్యాచ్‌ను రద్దు చేసిన బీసీసీఐ ఆటగాళ్ల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఐపీఎల్‌ను వారం పాటు వాయిదా వేసింది. అప్పటికీ సాధారణ పరిస్థితులు నెలకొనకుంటే ఫ్రాంఛైజీ యజమానులతో మాట్లాడి టోర్నీ నిర్వహణపై ఓ నిర్ణయానికి రానుంది బీసీసీఐ. ప్రస్తుతానికైతే ఐపీఎల్ 18వ సీజన్‌ను వారం రోజులకు వాయిదా వేశాం. బీసీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్, ఐపీఎల్ జట్ల యజమానులతో మాట్లాడాకే ఈ నిర్ణయం తీసుకున్నాం.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**